thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 316 కరీంనగర్ బుధవారం, 22 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 50 లక్షల మందికి ప్రసాదం పంపిణీ చేయనున్న అదానీ

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఈసారి మహా కుంభమేళా మరింత వైభవంగా జరుగుతోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన, ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక సంఘటనలలో ఒకటిగా పరిగణించబడుతుంది. ఈ మహాకుంభమేళాకు భారత్‌తోపాటు విదేశాల నుంచి కూడా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో కుంభమేళా ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయాలకు, ఆధ్యాత్మి కతకు గౌరవాన్ని పెంచుతుంది. ఈసారి ఈ మహా సంగమంలో దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కూడా పాల్గొంటున్నారు. **స్వయంగా తన చేతులతో..** ఈ క్రమంలో గౌతమ్ అదానీ మహా కుంభ మేళా వేడుకలకు ఓ ప్రత్యేకత తీసుకురాబోతున్నారు. ఆయన త్రివేణి సంగమంలో పూజలు నిర్వహించిన అనంతరం, 50 లక్షల మందికి ప్రసాదం పంపిణీ చేయబోతున్నారు. ఈ ప్రసాదాన్ని ఆయన స్వయంగా తన చేతులతో పంపిణీ చేయనున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో అతి పెద్ద ఎన్‌కౌంటర్

## కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి కాల్చివేత

### మృతుల్లోమరో కేంద్ర కమిటీసభ్యుడు మోడం బాలకృష్ణ సైతం?


### ఆదివారం రాత్రి నుండి మంగళవారం వరకు కాల్పులు

## 19 మంది మరణించినట్లు లెక్కలు

### నక్సలైట్ల వేట కొనసాగుతున్నట్లు చతిస్గడ్, ఒడిస్సా అధికారుల ప్రకటన.!





**హైదరాబాద్,చురుకలు ప్రధాన ప్రతినిధి, జనవరి, 21 :** ఒడిశా చతిస్గడ్ రాష్ట్రాల సరిహద్దులను గరియాబంద్ - నుపాడకు జిల్లాలను ఆనుకొని ఉన్న దట్టమైన అడవుల్లో సోమవారం మంగళవారాల్లో జరిగిన భారీ ఎన్కౌంటర్లో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు ఇద్దరు సహా 19 మంది నేల కొరిగారు. ఈ ఎన్కౌంటర్ను రెండు రాష్ట్రాల ఆంటీ నక్సలైట్ ఆపరేషన్ బృందాలు సంయుక్తంగా నిర్వహించి మావోయిస్టులపై పెద్ద విజయం సాధించిన భద్రతా బలగాలను అధికారులు అభినందిస్తున్నారు. గరియా బంధు అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్లు కేంద్ర కమిటీ సభ్యుడు జయరాం ఏ చలపతి, అలియాస్ రామచంద్రారెడ్డి మృతి చెందారు.ఆయన తలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకోటి రూపాయల రివార్డును ప్రకటించింది. రామచంద్రారెడ్డి సహా వరంగల్ జిల్లాకు చెందిన మోడీ బాలకృష్ణ సైతం ఎన్కౌంటర్లో మరణించారన్న వార్తలు వస్తున్నాయి. బాలకృష్ణ ఎన్కౌంటర్ పై స్పష్టత లేనప్పటికీ ప్రచారం మాత్రం జరుగుతుంది. కాగా సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మ హత్యా ఘటనలో కీలకంగా పాల్గొన్న చలపతి ఆపరేషన్ పూర్తి చేశారు దీంతో చలపతి మాస్టర్ మైండ్ నాయకుడిగా పార్టీలో గుర్తింపు ఉంది. మావోయిస్టు అగ్రనేత ఆర్ కె కు అత్యంత సన్నిహితంగా మెలిగిన చలపతి ఏవోబి ప్రాంతంలోని ఎక్కువ కాలం పని చేశారు సోమవారం జరిగిన ఎన్కౌంటర్ కూడా ఏఓబి ప్రాంతంలోని నేలకొరిగారు. ఆయన సహచరిని కూడా ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అంటున్నారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కి గురువు చలపతేనని సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన 2018 లో జరిగిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోముల హత్యాకాండలో కీలకంగా పాల్గొన్న చలపతి తన సెల్ఫీ వీడియోను మాట్లాడుతూ విలేకరులకు పంపించారు. వరుసగా చతిస్గఢ్లో ఆపరేషన్ కగార్ ద్వారా మావోయిస్టు కీలక నేతలను మట్టు పెడుతున్న భద్రతా బలగాలు ఈసారి కేంద్ర కమిటీ సభ్యులను కాల్చి చంపాయి.

**మావోయిస్టు చలపతి ఎవరు? :** చిత్తూరు జిల్లాకు చెందిన చలపతి అలియస్ రాంచంద్రారెడ్డి. అగ్రవర్ణాల కుటుంబానికి చెందిన ఆయన మావోయిస్టు ఉద్యమంలో గత 30 ఏళ్ల క్రితం చేరారు. తనుకున్న తెలివితేటలతో మావోయిస్టు పార్టీలో అంచలంచలుగా ఎదుగుతూ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన మేధావి అని పేరుపొందినవాడని చెబుతున్నారు. ఇటీవల లొంగిపోయిన మాజీ నక్సలైట్ నాయకుడు ఒకరు పేర్కొన్నారు. 2016లో రామగూడ కాల్పుల్లో మృతి చెందిన రీజినల్ కమిటీ చీఫ్ కుడుముల వెంకట రమణఏరవి, 2017లో మృతి చెందిన గెమ్మెలి నారాయణరావు ఏ జాంబ్రి లో మరణంతో సైద్ధాంతిక నేపథ్యం ఉన్న చలపతి ని శ్రీకాకుళం, కోరాపుట్ డివిజన్ ఇన్చార్జి గా నియమించారు. చిత్తూరుకు చెందిన చలపతి 30 సంవత్సరాల క్రితం మావోయిస్టు పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర కమిటీ సభ్యుడు అయ్యాడు. తన కంటే చాలా చిన్న వయసు ఉన్న మావోయిస్టు అరుణను వివాహం చేసుకోవడంతో పార్టీ క్రమశిక్షణ చర్య కింద ఆయనను తూర్పు డివిజన్ ఇన్చార్జి పదవి నుంచి కొంతకాలం తొలగించారు. ఇక్కడ ప్రాంతానికి బదిలీ చేశారు. అయినప్పటికీ పార్టీకి అంకితభావం పనిచేస్తూ మళ్లీ క్రమంగా కేంద్రకంబి స్థాయికి చేరుకున్నారు.ప్రస్తుతం మళ్లీ ఆయనకే బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఇక మృతుల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతున్న బాలకృష్ణ వరంగల్ జిల్లాకు చెందినవారు ఆయన ఎన్కౌంటర్కు సంబంధించిన మరింత సమాచారం రావలసి ఉంది.




హైదరాబాద్: డెహ్రాడూన్ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ సీనియర్ నేత, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్? గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు వైద్యులు చికిత్స చేసి స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని.. ఎలాంటి ప్రాణప్రాయం లేదని డాక్టర్లు తెలిపారు. 2025, జనవరి 21 రాత్రి ఆయన హైద్రాబాద్?కు రానున్నారు. తమ అభిమాన నేతకు గుండె పోటు వచ్చిందని తెలియడంతో పద్మారావు గౌడ్ అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు గురి అయ్యారు. పద్మారావు గౌడ్ ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని తెలపడంతో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గుండె పోటుకు గురయ్యారని తెలియడంతో బీఆర్ఎస్ నేతలు ఆయన ఇంటికి తరలి వెళ్తున్నారు. పద్మారావు గౌడ్ హెల్త్ కండిషన్?పై బీఆర్ఎస్ అధిష్టానం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జీహెచ్ఎంసీ మేయర్‌కు పదవి గండం.. బీఆర్ఎస్ కీలక నిర్ణయం



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకొంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఆ పార్టీ నిర్ణయించింది. అందుకోసం మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ నివాసంలో దాదాపు రెండు గంటల పాటు సమావేశమై.. ఈ అంశంపై చర్చించారు. అందులోభాగంగా జీహెచ్ఎంసీలో తమకున్న కార్పొరేటర్ల సంఖ్య బలంతోపాటు అవిశ్వాసం పెట్టేందుకు సంఖ్య ఎంత అవసరమనే కోణంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు చర్చించారు. ఎక్స్ అఫిషియో సభ్యులు మినహా మిగతా సభ్యులను ఎలా సమకూర్చుకోవాలనే అంశం పై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే.. జీహెచ్ఎంసీపై పట్టు జారకుండా ఉండేదుకు బీఆర్ఎస్ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. 2020, డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. భారీగా డివిజన్లను కైవసం చేసుకొంది. దీంతో బంజారా హిల్స్ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జీ విజయలక్ష్మి ఎన్నికయ్యారు. ఆమె బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కేకే కుమార్తె కూడా కావడంతో.. గద్వాల్ విజయలక్ష్మిని మేయర్ పదవి వరించింది. అయితే 2023 ఏడాది చివరలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు సైతం హస్తం గూటికి చేరారు. అలా బీఆర్ఎస్ పార్టీకి కేకేతోపాటు ఆయన కుమార్తె, మేయర్ జీ విజయలక్ష్మి రాజీనామా చేసి... హస్తం పార్టీకి స్నేహ హస్తం అందించారు. ఈ నేపథ్యంలో మేయర్ జీ విజయలక్ష్మిపై అవిశ్వాసం పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేపట్టింది. అదీకాక ఈ ఏడాది చివరకు జీహెచ్ఎంసీ కౌన్సిల్ పదవి కాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో మళ్లీ జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లి తన సత్తా చాటాలని బీఆర్ఎస్ పార్టీ అగ్రనాయకత్వం సంకల్పించింది. మరోవైపు గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు డివిజన్లను మాత్రమే గెలుచుకొంది. కానీ రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. వారి సంఖ్య19కి చేరింది. మరోవైపు ఈ ఏడాది చివరల్లో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మంగా అడుగులు వేస్తున్నారు. ఇంకోవైపు గతేడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సైతం కాంగ్రెస్, బీజేపీలు సరి సమానంగా ఎంపీ స్థానాలను గెలుచుకొన్నాయి. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్లు సైతం దక్కలేదు. అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం మేయర్ పీఠం హస్తగతం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పక్కా ప్రణాళిలతో సిద్ధమవుతోన్నారు.

# తెలంగాణకు భారీ కంపెనీ..

## పెట్టుబడులు పెట్టేందుకు యూనిలివర్ సంస్థ సంసిద్ధత!


## వేల మందికి ఉద్యోగాలు..!!




తెలంగాణ సర్కార్ దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో మొదటి ఒప్పందం కుదిరింది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ అయిన యూనిలివర్ గ్లోబల్‌తో తెలంగాణ సర్కార్ చర్చలు జరిపి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకుంది.కాబట్టి, కామారెడ్డిలో పామాయిల్ తయారీ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు యూనిలివర్ సిద్ధమైంది. అలాగే, బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి కూడా ఆసక్తి చూపించింది. ఈ ఒప్పందాలపై సంబంధిత సంస్థలు ముందుకు వెళ్లాయి.

**తెలంగాణకు పెట్టుబడులు.. యూనిలివర్‌తో మొదటి ఒప్పందం...** స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో 2025 సంవత్సరంలో తెలంగాణకు పెట్టుబడులు ప్రవేశించడం ప్రారంభమైంది. రేవంత్ రెడ్డి సర్కార్‌తో ప్రముఖ కంపెనీ యూనిలివర్ తొలి ఒప్పందం కుదుర్చుకుంది. యూనిలివర్, ప్రపంచవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల తయారీలో ప్రముఖమైన బ్రాండ్. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు యూనిలివర్ సుముఖత వ్యక్తం చేసింది. ఈ చర్చలు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర అధికారులతో కలిసి నిర్వహించారు. ఇందులో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ మద్దతు వివరించారు. ఈ చర్చల అనంతరం యూనిలివర్, తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపించింది. యూనిలివర్ కంపెనీ తెలంగాణలో రెండు పరిశ్రమలను స్థాపించడానికి అంగీకరించింది. మొదటగా, కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ప్రారంభించనుంది. అదేవిధంగా, బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్ కూడా ఏర్పాటు చేయాలని యూనిలివర్ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో, తెలంగాణలో యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ సన్నాహక బృందం, ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో దావోస్‌లో కీలక సమావేశాలను నిర్వహిస్తోంది. సప్లై చైన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్నోవేషన్ రంగాలలో ప్రముఖ కంపెనీలతో చర్చలు జరిపాయి. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, వ్యవసాయ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు శ్రద్ధ తీసుకుంటుందని కూడా ఆయన చెప్పించారు.

**పెట్టుబడులు ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్..** ఈ సదస్సులో తెలంగాణ రైజింగ్ ప్రోగ్రామ్‌తో కొన్ని కార్యక్రమాలు నిర్వహించారు. గ్లోబల్ పబ్లిక్ పాలసీ, అమెజాన్ వెబ్ సర్వీసెస్, సిఫీ టెక్నాలజీస్, స్కైరూట్ ఎయిరోస్పేస్, యూపీఎల్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వేర్వేరు సమావేశాలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా, పారిశ్రామికవేత్తలతో కూడా భేటీ అయ్యారు. ప్రత్యేకంగా, ఐటీ, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా చర్చలు జరిగాయి. దావోస్‌లోని తెలంగాణ పెవీలియన్‌లో సందడి నెలకొంది. 55వ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో, తెలంగాణ పెవీలియన్ ప్రారంభించిన తర్వాత, కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల మంత్రులతో పాటు ఉ



న్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ ద్వారా, రెండో రోజు అనేక ఉత్తేజకరమైన మరియు పెట్టుబడులకు ఆశాజనకమైన కార్యక్రమాలు ఆరంభించబడ్డాయి.



## భారీ ఎన్‌కౌంటర్.. 20 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నేడు గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. దీంతో జనవరి 19 రాత్రి నుంచి పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల సంఖ్య 20కి చేరిందని పోలీసులు వెల్లడించారు.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దు జిల్లాలైన గరియాబంద్, నౌపాడలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిన్న ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా.. తెల్లవారుజామున జరిపిన గాలింపులో మరో 18 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే భారీస్థాయిలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంకా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ జరుగుతోంది. ఇందులో వెయ్యి మంది వరకు భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు తెలుస్తోంది.

**కీలక నేతలు మృతి :** ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కీలక నేతలు మృతి చెందారు. వారిలో కేంద్ర కమిటీ సభ్యులు చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, మనోజ్, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నారు. చిత్తూరు జిల్లావాసి అయిన చలపతిపై ప్రభుత్వం గతంలో రూ.కోటి రివార్డు ప్రకటించింది.



## ట్రంప్ ర్యాపిడ్ ఫైర్..

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ పదవి చేపట్టగానే.. తనదైన స్టైల్‌లో పాలన మొదలుపెట్టారు. ఏకంగా డజన్ల కొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై ఆయన సంతకం చేశారు. తొలి ఎనిమిది ఆదేశాలపై సంతకం చేసిన అనంతరం పెన్నును జనంలోకి విసిరేసి ఉత్సాహపర్చారు. దీంతోపాటు మాజీ అధ్యక్షుడు బైడెన్ జారీ చేసిన 78 ఆదేశాలను ట్రంప్ వెనక్కి తీసుకొన్నారు. ప్యారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగడం, ప్రభుత్వాన్ని ఆయుధంలా ప్రత్యర్థులపై వాడటం, వాక్ స్వేచ్ఛకు రక్షణ, దీంతోపాటు జీవన వ్యయాల సంక్షోభంపై దృష్టిపెట్టాలని అన్ని ఏజెన్సీలకు మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా కార్యాలయాలకు వచ్చి విధుల్లో హాజరుకావాలన్న ఆదేశాలు ఉన్నాయి. అంతేకాదు.. కెనడా, మెక్సికోలపై ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 25శాతం అదనపు సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ అల్టిమేటమ్ జారీ చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలగింది. ఈమేరకు ట్రంప్ నిర్ణయం తీసుకొన్నారు. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఈ సంస్థ బాధ్యతారాహిత్య తీరుతో ఆగ్రహంగా ఉన్న ట్రంప్ ఈమేరకు నిర్ణయం తీసుకొన్నారు. కృత్రిమ మేధ విస్తరణను నియంత్రిస్తూ బైడెన్ జారీ చేసిన ఆదేశాలను ట్రంప్ తొలగించారు. గత అధ్యక్షుడి ఆదేశాల మేరకు ఏఐ అభివృద్ధి, ప్రయోగాలపై నియంత్రణలు ఉండేవి. సరిహద్దు గోడ సామగ్రిని విక్రయించాలన్న బైడెన్ ఆదేశాలను ట్రంప్ వెనక్కి తీసుకొన్నారు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో కొన్నాళ్లుగా ఈ గోడ సామగ్రిని వేలంలో విక్రయిస్తున్నారు. చైనా కంపెనీ టిక్‌టాక్ అమెరికా విభాగాన్ని విక్రయించేందుకు ట్రంప్ సర్కారు 75 రోజుల సమయం ఇస్తూ నిర్ణయం తీసుకొంది. అమెరికాకు ఆ యాప్‌లో 50శాతం వాటా ఉండాలని ట్రంప్ ఈసందర్భంగా వ్యాఖ్యానించారు.

వాస్తవానికి టిక్‌టాక్ పేరెంట్ కంపెనీకి దీనిని విక్రయించేందుకు జనవరి 19 వరకు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. బైడెన్ కార్యవర్గం వాక్ స్వేచ్ఛపై నియంత్రణ విధించడాన్ని ట్రంప్ సీరియస్‌గా తీసుకొన్నారు. దీంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్, డైరెక్టరేట్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ విస్తృతంగా దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**మస్క్‌కు షాక్..** విద్యుత్తు వాహనాలపై ట్రంప్ నిర్ణయం ఎలక్ట్రికల్ కార్ల కంపెనీ టెస్లా యజమాని మస్క్‌ను కొంత షాక్‌కు గురిచేసింది. 2030 నుంచి విక్రయించే కొత్త కార్లలో కనీసం 50శాతం విద్యుత్తు వాహనాలు ఉండాలంటూ బైడెన్ తీసుకొన్న నిర్ణయాన్ని ట్రంప్ తొలగించారు.




## దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ ప్రారంభం

దావోస్: ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.




## దిల్ రాజు ఇళ్లు, ఆఫీసుల్లో ఐటీ సోదాలు

హైదరాబాద్: ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. దిల్ రాజు సతీమణి వైగా రెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఐటి అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. "ఉదయం నుంచి ఐటి శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం" అని ఆమె తెలిపారు.



## స్థిరాస్తి దళారిపై చేయిచేసుకున్న ఎంపీ ఈటల

పోచారం: భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ఓ స్థిరాస్తి దళారిపై చేయి చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఈ ఘటన చోటుచేసుకుంది. మున్సిపాలిటీలోని ఏకశిలానగర్‌లో మంగళవారం ఈటల పర్యటించారు. బాధితుల ఫిర్యాదుతో స్థిరాస్తి దళారిపై ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయనపై చేయిచేసుకున్నారు. ఇంటి స్థలాల యజమానులను ఇబ్బంది పెడుతున్నారని ఎంపీ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. "పేదలు కొనుక్కున్న జాగాలకు భాజపా అండగా ఉంటుంది. కొందరు అధికారులు బ్రోకర్లకు కొమ్ముకాస్తున్నారు. భూములు కొనుక్కున్న పేదల సమస్యలపై కలెక్టర్, సీపీతో మాట్లాడాను. కొందరు దొంగ పత్రాలతో పేదల భూములను లాక్కుంటున్నారు. బ్రోకర్లకు సహకరించే అధికారులపై చర్యలు తీసుకోవాలి. దళారులతో పోలీసులు, అధికారులు కుమ్మక్కవుతున్నారు. కూల్చివేతలు తప్ప.. పేదల కన్నీళ్లు పట్టించుకోవడం లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ముగిసిన కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం




హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం ముగిసింది. హైదరాబాద్‌లోని జలసౌధలో బోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ, తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వరరావు, ఇంజినీర్లు, ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఏపీ, తెలంగాణ మధ్య నీటి వాటా, బోర్డు నిర్వహణపై భేటీలో చర్చించారు. టెలిమెట్రిక్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరు రాష్ట్రాల అభ్యంతరాలపై సమావేశంలో చర్చకు వచ్చింది. భేటీ అనంతరం తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జ మాట్లాడారు. "కృష్ణా జలాల్లో 66:34 నిష్పత్తిపై నిరసన తెలిపాం. రాష్ట్రంలో కృష్ణా పరివాహక ప్రాంతం 71 శాతం ఉంది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 71 శాతం వాటా ఇవ్వాలి. 71 శాతం ఖరారు చేసే వరకు చెరి సగం వాటా ఇవ్వాలి. ప్రస్తుతం 66:34 నిష్పత్తి ప్రకారం కొనసాగిస్తామని బోర్డు ఛైర్మన్ తెలిపారు. పరిస్థితులను బట్టి వాటా పెంచే ప్రయత్నం చేస్తామని ఛైర్మన్ చెప్పారు. జలాల మళ్లింపు విషయాన్ని సమావేశంలో ప్రస్తావించాం. 11 ప్రాంతాల్లో టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరాం. టెలిమెట్రీల ఏర్పాటుపై వారంలో స్పందిస్తామని ఏపీ ఈఎన్సీ తెలిపారు" అని రాహుల్ బొజ్జ తెలిపారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. సాగర్ నుంచి సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉపసంహరించుకోవాలని కోరినట్లు చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని ప్రస్తావించామన్నారు. డ్యామ్ స్లూయిజ్‌కు మరమ్మతులు చేయిస్తామని బోర్డు ఛైర్మన్ చెప్పినట్లు తెలిపారు.

## తెలంగాణ వ్యాప్తంగా కొనసాగుతున్న గ్రామ సభలు

హైదరాబాద్: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు కొనసాగుతున్నాయి. 4 పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపికను చేపడుతున్నారు.


రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తులు స్వీకరించి గ్రామసభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈ నెల 24 వరకు ఇవి కొనసాగనున్నాయి. గ్రామసభల్లో ప్రభుత్వ సంకల్పం, పథకాల వివరాలను ప్రజలకు తెలియజేసి అభిప్రాయాలను సేకరిస్తున్నారు.




**గ్రేటర్‌లో కనిపించని వార్డు సభల నిర్వహణ :** జీహెచ్ఎంసీ పరిధిలో వార్డు సభల నిర్వహణ కనిపించడం లేదు.

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం వార్డు సభలు మొదలు కాలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారుల సర్వే ఇంకా పూర్తి కాలేదు. గ్రేటర్‌లో సర్వే పూర్తయ్యాక ఫిబ్రవరి 1 నుంచి వార్డు సభలకు సన్నాహాలు చేస్తున్నారు.

## 'కాళేశ్వరం' లక్ష్యమేంటి.. ఆదాయ సృష్టి ఎలా? రామకృష్ణారావును ప్రశ్నించిన కమిషన్



హైదరాబాద్: ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఆయన్ను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ విచారించారు. ఇప్పటికే రామకృష్ణారావు సమర్పించిన అఫిడవిట్, కాగ్ నివేదిక ఆధారంగా ప్రశ్నించారు. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలు, ప్రాజెక్టు డిజైన్‌లు, బడ్జెట్ కేటాయింపులపై కమిషన్ ప్రశ్నించింది. కార్పొరేషన్‌కు నిధులు ఎలా సమకూర్చారు? కార్పొరేషన్ ద్వారా ఆదాయాన్ని ఎలా జనరేట్ చేస్తారు? డిజైన్ల విషయంలో నిబంధనలు పాటించారా? అని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల బాధ్యత ప్రభుత్వానిదేనని రామకృష్ణారావు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ విషయంలో కోర్ కమిటీ రికార్డులు లేవని కమిషన్ ముందు చెప్పారు. ప్రాజెక్టు తొందరగా కట్టారు కానీ, నిబంధనలు పాటించలేదని ఈ సందర్భంగా కమిషన్ వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యం, రెవెన్యూ ఎలా జనరేట్ చేస్తారని కమిషన్ ప్రశ్నించగా.. పరిశ్రమలకు నీళ్లు విక్రయించి ఆదాయం పొందేలా చేయడమే ప్రాజెక్టు లక్ష్యమని రామకృష్ణారావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టు ఫిజికల్ పాలసీలు పెట్టలేదని ఈ సందర్భంగా కమిషన్ రికార్డులు చూపించింది. నిధుల విడుదల విషయంలో బిజినెస్ రూల్స్ పాటించలేదు, ఆర్థిక పరమైన అంశాల్లో రికార్డులు నిర్వహించలేదని పేర్కొంది. ప్రాజెక్టు కోసం ప్రభుత్వ గ్యారెంటీతోనే కార్పొరేషన్ రుణాలు తీసుకుందని, 9 నుంచి 10.5 శాతం వడ్డీతో రుణాలు చెల్లిస్తున్నామని రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.

## ఒకే రోజు నలుగురిని పొట్టన పెట్టుకున్న ప్రభుత్వం: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని.. రైతు రాజ్యం కాదిది.. రైతు వంచన కొనసాగిస్తున్న రాజ్యమిదని దుయ్యబట్టారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్ళలా ప్రాణం తీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమిదని అన్నారు. "కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్.. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలు.. రుణమాఫీ చేయకుండా తీసిన ప్రాణాలు.. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు.. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయి.. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయి" అంటూ కేటీఆర్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

**రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ..** రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 9 మందితో ఏర్పాటుచేసిన ఈ కమిటీలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, జోగు రామన్న, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్ ఉన్నట్లు తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తిస్తుందని చెప్పారు. ఏడాదిలో వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను తయారు చేస్తుందని వివరించారు.

## హైడ్రాకు భారీగా ఫిర్యాదుల వెల్లువ..


హైదరాబాద్ సిటీ: బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు వచ్చాయి. చెరువులు, పార్కులు, రోడ్ల ఆక్రమణలపై 89 ఫిర్యాదులు అందాయి. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ పౌరుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రాంతాల వారీగా ఉన్న అధికారులకు క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులపై గూగుల్ మ్యాప్, సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) చిత్రాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఫిర్యాదుదారులకు చూపించి క్షేత్రస్థాయి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అమీన్‌పూర్, పరిసర ప్రాంతాల నుంచి అధిక ఫిర్యాదులు వస్తోన్న నేపథ్యంలో ఆ మునిసిపాలిటీ పరిధిలో పూర్తిస్థాయి సర్వే చేయిస్తామని రంగనాథ్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా నిజాంపేట మునిసిపాలిటీ పరిధిలో మేడికుంట చెరువు 45 ఎకరాల్లో ఉండేదని, ఆక్రమణలతో చెరువు కుచించుకుపోయిందని వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు. మాదాపూర్ గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్-32లో ప్లాట్ నెంబర్ 85 యజమాని రోడ్డును ఆక్రమిస్తున్నారని సైబర్‌హిల్స్ ప్లాట్ల యజమానుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు లింగిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ప్లాట్ వాస్తవ విస్తీర్ణం 276 చ.గ.లు కాగా.. మరో 124 చ.గ.లు ఆక్రమించి షెడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలోని డిఫెన్స్ కాలనీలో ప్రజావసరాలకు కేటాయించిన 1000 చదరపు గజాల స్థలం స్థానిక ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నారని డిఫెన్స్ కాలనీ సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. ఛత్రినాకలో రోడ్డు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమిస్తున్నాడని, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని గుడుమాని సాయికిరణ్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు.

చురకలు



# మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర

## – జనవరి 22... ఆంధ్ర పితామహుని జయంతి




మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహాసంస్థ. ఆయ న జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజా నాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృ తిని కలిగించి, సామాజిక, సాంస్కృ తిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహు భాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీ యుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రో ద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్ర మహా సభలలో వాహినిగా ప్రవహిం చింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణాలో గ్రంథాలయాల అభి వృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి) న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకట ప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసే వారు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణా త్మకమైన సంస్థలద్వారా జరిగింది. ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధనీ ఉన్నత పాఠశాల లో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడు తున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటిం చారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవ మానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం. అధ్యక్షుడు రావు బహదూర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంత రావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డా యి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ డానికి వర్తక సంఘాలను స్థాపిం చింది. పటేల్– పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధ పడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగిం చారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అను మతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరి సిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టుపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టి పూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభ వోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులు కొండా వెంకటరంగా రెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులు కు తులాభారం జరుపగా, సంబంధి త రూ.6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించి న పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది. బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియా కు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశములో ప్రప్రథమ బాలికల పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంత రావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణ గూడలో స్థాపించాడు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యా రంగానికి చేసిన సేవలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేటు బిరుదునిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్ళలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ హైదరా బాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాల తో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడ పాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'. రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగ తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిర్వహణలో దక్షత వంటివి కలిగిన వ్యక్తి. అందరినీ కలుపుకు పోయే లక్షణం, ఉద్వేగం లేని స్వభావం వల్ల ఆయన అజాత శత్రువుగా నిలిచారు. రాజకీయాల్లో ఆయన మితవాది, అయినా ఆయన రాజకీయాదర్శాలను వ్యతిరేకించే కమ్యూనిస్టులు కూడా ఎంతగానో గౌరవించేవారు. శాసన మండలి అధ్యక్ష పదవీ విర మణ అనంతరం విశ్రాంతి జీవితా న్ని గడుపుతూ 1970 నవంబరు 11వ తేదీన తమ 86వ ఏటా మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# చరితార్థుడైన కథానాయకుడు అక్కినేని

## జనవరి 22... తెలుగుజాతి గర్వించ దగిన మహా నటుని వర్ధంతి




తెలుగు జాతి గర్వించదగ్గ మహా నటుడు అక్కినేని నాగేశ్వరరావు. అక్కినేనిని నిర్వచించడం ఎవరి తరం మహా నటుడిని విశ్లేషించడం ఎవరికి సాధ్యం? ఆయన రాసిచ్చిన "అఆలు" దిద్దనంత సులువు కాదు, అంత రంగాన్ని అర్థం చేసుకోవడం, అలుపెరుగని ప్రయాణంలో ఆయన్ని అందు కోవడమే కాదు, అనుసరించడమూ ఎవరికీ సాధ్యం కాలేదు. తెలుగు సినిమా నుంచి అక్కినేని నేర్చుకున్న దానికంటే, నేర్పిపెట్టిందే ఎక్కువ. అందుకే – తెలుగు సినిమా చదివితే అక్కినేని అర్థం కాకపోవచ్చు.. అక్కినేనిని చదివితే మాత్రం తప్పక తెలుగు సినిమా అవగత మవుతుంది. అంతెందుకు పొడిగానో తడిగానో అక్కినేని గురించి చెప్పాలంటే మళ్లీ అక్కినేని రావాలి. లేదా ఆయన వదిలెల్లిన అఆలు జ్ఞాపకాల పలకలపై దిద్దుకోవాలి. తెలుగు చిత్రసీమను దశాబ్దాలపాటు నిరాటంకంగా ఏలిన రాజులు ఇద్దరు. ఒకరు విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు నందమూరి తారక రాముడు, మరొకరు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. చిత్రసీమలో నటులుగా పోటీ పడినా, జీవితంలో సోదర భావంతో మెలిగిన ఇరువురూ తెలుగు ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారు. తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ మార్చడంలో ప్రముఖ పాత్ర పోషించాడు అక్కినేని. పరభాషా చిత్ర పరిశ్రమ నుండి తెలుగు చిత్ర పరిశ్రమని వేరు చేసి, మన పరిశ్రమ ఔన్నత్యాన్ని దేశ విదేశాలకు చాటిన మహా నటుడు, నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత. తన వారసులను పరిశ్రమకు అందించాడు అక్కినేని. స్టేజి నాటకాలలో స్త్రీ పాత్రలతో నటనకు మెరుగులు దిద్దుకునే క్రమంలో నాగేశ్వర్ రావు... ప్రముఖ చిత్ర నిర్మాత ఘంటసాల బల రామయ్యకు విజయ వాడ రైల్వే స్టేషన్ లో తారస పడి, ధర్మపత్ని సినిమాతో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేశారు. 90యేళ్ల జీవితంలో 75 సంవత్సరాలు విభిన్న పాత్రల ద్వారా తెలుగు చిత్రరంగ క్రమానుగత ప్రగతిలో విడదీయ లేని బంధం, అనుబంధం అక్కినేనిది. 1928 సెప్టెంబర్ 20న కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా నందివాడ మండలం రామాపురంలో వెంకట రత్నం పున్నమ్మ దంపతులకు జన్మించిన అక్కినేని, బాల్యం నుంచే నాటకాల మీద అనురక్తి పెంచు కున్నారు. 1941 లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన ధర్మపత్ని బాల నటునిగా తొలిసారి మేకప్ వేసుకున్నారు. 1944లో ఘంటసాల బలరామయ్య నిర్మాత, దర్శకునిగా తెరకు ఎక్కించిన సీతారామ జననంలో, పూర్తి స్థాయి కథా నాయకుడి పాత్ర పోషించారు. 1949లో అన్నపూర్ణను వివాహ మాడిన అక్కినేని.. తెలుగు తమిళ, హిందీ భాషల్లో 256 సినిమాలు చేసిన అనుభవజ్ఞుడు. చివరిగా 1991 లో ఆయన నట జీవితం స్వర్ణోత్సవం సందర్భాన విడుదలైన సీతారామయ్య గారి మనమరాలు, కొత్త, యువ నటుల చిత్రాలతో పోటీపడి బాక్సాఫీసు హిట్ గా నిలిచింది. తన పుత్రుడు అక్కినేని నాగార్జున, మనవడు నాగ చైతన్యతో చివరి సినిమాలో ఆయన కలిసి నటించారు. ఆయన మనం చిత్రంలో సహజ నటనా ప్రతిభను రుచి చూపించారు. 75ఏళ్ళ సినీ ప్రస్తానంలో శరత్ చంద్ర నవల ఆధారిత దేవదాసు (1953)లో భగ్న ప్రేమికుని పాత్రకు జీవం పోశారు. ఈ పాత్రకు ఆ తర్వాత మరెంతో మంది మరిన్ని భాషలలో నటించినా, హిందీ సినిమా నటుడు దిలీప్ కుమార్... అక్కినేని నటించినదే ఒకేఒక దేవదాసు అని ప్రశంసించాడు. 1966లో నవ రాత్రి చిత్రంలో 9 పాత్రలు పోషించి ఔరా! అనిపించారు. 1975 లో భార్య అన్నపూర్ణ పేరు మీద అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించిన అక్కినేని అన్నపూర్ణ బ్యానర్ లో మొదటి సినిమా కళ్యాణి. అన్నపూర్ణ బ్యానర్ లో వచ్చిన మొదటి బ్లాక్ బస్టర్ మూవీ ప్రేమాభిషేకం. 1981 లో వచ్చిన ఈ సినిమా ఓ సంచలనం సృష్టించింది. లైలా మజ్ను, అనార్కలి, బాటసారి, ప్రేమ్ నగర్, ప్రేమాభిషేకం, మేఘ సందేశం లాంటి సినిమాల్లో విషాద పాత్రల్లో, మిస్సమ్మ, చక్రపాణి, ప్రేమించి చూడు వంటి చిత్రాల్లో హాస్యరస ప్రధాన పాత్రలు, మాయా బజార్ లో అభిమన్యునిగా, చెంచు లక్ష్మిలో విష్ణువుగా, భూకైలాస్ లో నారదునిగా, శ్రీకృష్ణార్జున యుద్ధంలో పాండవ మధ్యమునిగా పౌరాణిక పాత్రల్లో మెప్పించారు. అక్కినేని నటించిన తొలి స్వర్ణోత్సవ చిత్రం 1971 లో వచ్చిన దసరా బుల్లోడు. తెలుగులో తొలి ద్విపాత్రాభినయం చేసిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు. దాసరి దర్శకత్వం వహించిన ప్రేమాభిషేకం హైదరాబాద్ లో 533రోజులు, నిరంత రాయంగా 365 రోజులు ప్రదర్శితమైన ఒకే ఒక్క తెలుగు సినిమా రికార్డు సొంతం చేసుకుంది. జయ దేవ, కాళిదాసు, జక్కన, విప్ర నారాయణ పాత్రలు అక్కినేని నటనకు కలికి తురాయిలు. మట్టి మనుషులు, ఒకే ఒక్కడు బుల్లితెర సీరియల్స్ లో నటించి, సమకాలీన నటులకు మార్గ దర్శకులు అయినారు. తెలుగు సినిమాలలో ఎందరో హీరోలైన అగ్ర నటులు విలన్ పాత్ర లలో కూడా నటించారు. కానీ అక్కినేని ఒక్కరే ఏ నాడూ విలన్ పాత్రలో కనిపించ లేదు. 'నా పర్సనాలిటీ(రూపం), కంఠం దుష్టపాత్రలకి సరిపోవు. ప్రేక్షకులు నన్ను విలన్‌గా అంగీకరించరనిపించింది. అందుకే ఎప్పుడూ విలన్ పాత్ర పోషించలేదు' అని నాగేశ్వరరావు స్వయంగా చెప్పేవారు. 1968లో భారత ప్రభుత్వ పద్మశ్రీ, 1988లో రఘుపతి వెంకయ్య అవార్డు, 1989లో రాజ్ కపూర్ స్మారక అవార్డు, 1991 లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, కేంద్ర ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్, 94లో లైఫ్టైమ్ అచీవ్మెంట్, 95 లో అన్నా అవార్డు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఎన్టీఆర్ జాతీయ పురస్కారం, డాక్టర్ ఆఫ్ లెటర్స్, మూడు ఫిల్మ్ ఫేర్, నట సామ్రాట్, కళా ప్రపూర్ణ లాంటి లెక్కలేనన్ని అవార్డులు సొంతం చేసుకున్న మహా నటుడు అక్కినేని. గుడి వాడ కళాశాలకు అక్కినేని ఇచ్చిన బూరి విరాళం తోనే ఏఎన్ఆర్ కళాశాల నామాంకిత అయింది. నటసామ్రాట్ బిరుదాంకితుడుగా నటనా ప్రస్థానంలో ఎన్నో పాత్రల్లో నటించి మరెన్నో మరపు రాని చిత్రాల్లో తనకు మాత్రమే సాధ్యమయ్యే నటనతో అభిమానులను ఆకట్టు కున్నాడు. తన 91 వ ఏట 2014 జనవరి 22న తెలుగు జాతి గర్వించ దగిన మహా నటుడు పరమ పదించే వరకు వెండి తెరతో విడదీయ రాని వ్యక్తిగా కొనసాగారు. నట సామ్రాట్ అక్కినేనికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు – అక్కినేని వెంకట్, నాగార్జున, సత్యవతి, నాగ సుశీల, సరోజా. భార్య పేరుతో అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించాడు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ ద్వారా, కుమారుడు అక్కినేని నాగార్జున, మనవళ్లు సుమంత్, అఖిల్ సహా పలువురు నటీనటుల్నీ, దర్శకుల్నీ పరిచయం చేశాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# ధీరోధాత్తుడు రామానందతీర్థ

## జనవరి 22... బహుముఖ ప్ర జ్ఞు ని వర్ధంతి



స్వామి రామానంద తీర్థ (అక్టోబర్ 3, 1903 – జనవరి 22, 1972) స్వాతంత్ర్య సమర యోధుడు, హైదరాబాద్ సంస్థాన విమోచనానికి పాటు పడిన మహా నాయకుడు, భారత పార్లమెంట్ సభ్యుడు, సన్యాసి, కార్మిక నాయకుడు, విద్యావేత్త. ఆయన అసలు పేరు వెంకటరావు ఖేడ్గీకర్. తండ్రి భాపూరావు, తల్లి యసుబాయి. 1903 అక్టోబరు 3వ తేదీన అప్పటి హైదరాబాదు సంస్థానంలోని గుల్బర్గా జిల్లా, ఝువర్గీ తాలూకా సింధ్గీ గ్రామంలో ఆయన జన్మించారు. ఆయన తండ్రి సన్యాసం స్వీకరించటంతో బంధువుల ఔదార్యంతో తన విద్యాభ్యాసాన్ని సాగించ వలసి వచ్చింది. లోకమాన్య బాల గంగాధర తిలక్‌ను ఈయన ఆదర్శంగా తీసుకున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉండగానే 1920 జూలై 31 వ తేదీ రాత్రి లోకమాన్య బాలగంగాధర తిలక్ కాలధర్మం చెందారన్న వార్త విని బ్రహ్మచారిగా తన జీవితాన్నంతా మాతృభూమి సేవకే అంకితం చేయగలను అని ప్రతిజ్ఞ చేసి, ఆ ప్రకారమే ఉండి పోయిన ధీరోధాత్తుడు ఆయన. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని బడికి గాంధీ టోపి వేసుకుని వెళ్ళి తన నిరసన తెలిపి కొంత కాలం చదువుకు సెలవిచ్చారు. తరవాత పూనాలోని తిలక్ విద్యాపీఠ్‌లో మూడేళ్ళు అధ్యయనం చేసి, ప్రజాస్వామ్యం, దాని క్రమాభివృద్ధి అనే అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి పూనా విశ్వవిద్యాలయానికి సమర్పించి ఎం.ఏ పట్టా పొందారు. కొంత కాలం ప్రసిద్ధ కార్మిక నాయకుడు ఎన్ ఎం జోషి కార్మికోద్యమంలో పాల్గొన్నారు. 1926 లో ఢిల్లీలో ఉండగా పాక్షిక పక్షవాతానికి గురై కొంత కాలానికి కోలుకున్నాడు. తన ఆరోగ్య పరిమితి దృష్ట్యా జోషి అనుమతితో కార్మికోద్యమానికి స్వస్తి చెప్పి ఒస్మనాబాద్ స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. ఈ దరిమిలా హైదరాబాదు రాష్ట్రంలో హిందువులపై జరుపుతున్న దుశ్చర్యలు, ఆంక్షల గురించి తెలుసుకున్నారు. అప్పటి ప్రభుత్వం, హిందూ ఉన్నత పాఠశాల స్థాపనకు నిరాకరించింది. ఐతే ఓ లొసుగును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలను విస్తరించి ఉన్నత పాఠశాల నెలకొల్పాడు. ఆ స్కూల్ ప్రప్రథమ ప్రధానోపాధ్యాయుడిగా రామానంద తీర్థను నియమించడం జరిగింది. హిప్పర్గి పాఠశాల ప్రధానోపాధ్యాయుడై, ఆరు సంవత్సరాల పాటు ఆ విద్యా సంస్థను గురుకుల పద్ధతిపై చక్కగా ఆయన నిర్వహించారు. మరాఠ్వాడాలో ఉస్మానాబాదు జిల్లాలోని 1932లో స్వామి నారాయణ అనే గురువు ఆయనకు 'విద్వత్ సన్యాసం ' అనే పద్ధతి ప్రకారం సన్యాస దీక్ష ఇచ్చి, 'స్వామీ రామానంద తీర్థ' అని నామకరణం చేశారు. 1938లో రాజకీయ రంగంలోకి ప్రవేశించి ఆయన మహారాష్ట్ర పరిషత్తుకు కార్యదర్శిగా పనిచేసి, ఆ సంవత్సరమే తన నివాసాన్ని మోమినాబాదు నుంచి హైదరాబాదుకు ఆయన మార్చారు. నిజాం సంస్థానంలో ఆనాడు ఎవరూ పాలనా సంస్కరణల్ని కోరినా నవాబులు దానిని మతపరమైన అంశంగా చిత్రీకరించే వారు. దాంతో మత ప్రమేయం లేని ఒక రాజకీయ సంస్థ ఆవిర్భావం ఆవశ్యకమైంది. ఆ అవసరాన్ని తీరుస్తూ వెలిసిందే 'హైదరా బాద్ స్టేట్ కాంగ్రెస్. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అవసరాన్ని తొలిసారి గుర్తించింది స్వామి రామానంద తీర్థ. ఆయనే సంస్థ స్థాపనకు ప్రధాన కారకుడు. 1938, సెప్టెంబర్ 8న ఒక మహాజన సభ సమావేశాన్ని జరిపి అందులో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని నిర్ణయించారు. కానీ, ఈ సమావేశ ముందు రోజు 1938, సెప్టెంబర్ 8న అప్పటి హైదరాబాద్, ప్రధాని సర్ అక్బర్ హైదర్ ఈ సంస్థను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ సందర్భన చేశారు. అలా హైదరాబాద్ సంస్థానంలోనే కాదు... బహుశా దేశంలోనే ఆవిర్భావానికి ముందే నిషేధానికి గురైన సంస్థగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిలిచింది. బూర్గుల రామకృష్ణా రావు హైదరాబాద్ స్టేట్ స్టేట్ కాం కాంగ్రెస్ మత సంస్థ కాదని ప్రభుత్వానికి తెలియజేస్తూ చర్చలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అహింసాయుత సత్యాగ్రహం ద్వారా మాత్రమే నిషేధాజ్ఞల్ని తొలిగింప చేసు కోవాలని కాంగ్రెస్ ప్రతినిధులు భావించారు. 1938 అక్టోబర్ లో సత్యాగ్రహం ప్రారంభమైంది. ఆ సంవత్సరం అక్టోబర్ 24న రావి నారాయణరెడ్డి, రామకృష్ణ దూత్, జనార్ధనరావు దేశాయ్, గోవిందరావు నానక్ కలిసి స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో సత్యాగ్రహం చేశారు. వీరిలో సత్యాగ్రహం ఉద్యమ మొదటి డిక్టేటర్ (సర్వాధికారి) రామానంద తీర్థ కావడం గమనార్హం. ఈ క్రమంలో స్వామి రామానంద తీర్థను హైదరా బాదులో 1938 అక్టోబరు 27వ తేదీన ప్రభుత్వం బంధించి, 18 నెలలు కఠిన శిక్షకు గురి చేసింది. నిషేధం తొలగించని కారణంగా, తాను వ్యక్తిగత సత్యాగ్రహం చేస్తానని స్వామీజీ అప్పటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వానికి తెలియ చేయగా, 1940 సెప్టెంబర్ 11 వ తేదీన ఆయనను బంధించి, ప్రజారక్షణ నిబంధనల క్రింద నిజామాబాద్ కారాగారంలో నిర్బంధంలో ఉంచారు. 1942–1950 సంవత్సరాల మధ్య హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. దేశీయ సంస్థానాల మహాసభ కార్య నిర్వాహక వర్గ సభ్యులుగా ఉన్నారు. 1942 ఆగస్ట్‌లో క్విట్ ఇండియా ఉద్యమ తీర్మానం ఆమోదింప బడిన బొంబాయి కాంగ్రెస్ సభలో పాల్గొని షోలాపూర్ నుంచి తిరిగి రాగానే ఆయనను నిజాం ప్రభుత్వం బంధించి1943 డిసెంబరులో విడుదల చేసింది. హైదరాబాదు సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావాలని ఉద్యమాన్ని ప్రారంభించి నందుకు ఆయనను 1948 జనవరిలో బంధించి, అనేక జైళ్ళల్లో ఉంచారు. నిజాం సైన్యం భారత ప్రభుత్వ సైన్యానికి లొంగిపోయిన 1948 సెప్టెంబర్ 17వ తేదీన రామానంద తీర్థ స్వామి నిర్బంధం నుండి విడుదల అయినారు. రామానంద తీర్థ నాందేడ్‌లోని పీపుల్స్ కాలేజి వ్యవస్థాపకుడు. హైదరాబాదు ఖాదీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు. హైదరాబాదు హిందీ ప్రచార సంఘానికి అధ్యక్షులు, 1952లో హైదరాబాదు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగాను పని చేశారు. 1952 నుండి 1962 వరకు లోకసభ సభ్యులుగా ఉన్నాడు. 1953లో హైదరాబాదు నగరంలో ప్రప్రథమంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహా సభకు స్వామీజీ ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. హైదరాబాదు సంస్థానాన్ని భాషా ప్రాతిపదికపై విభజించాలని 1953లోనే గట్టిగా కోరిన స్వామీజీ ఎనిమిది తెలంగాణ జిల్లాలను మద్రాసు రాష్ట్రం నుండి విడిపడ్డ ఆంధ్ర ప్రాంతంలో కలిపేసి తెలుగు ప్రజల చిరకాల వాంఛయైన విశాలాంధ్రను ఏర్పాటు చేయాలని ఒక ప్రకటన చేశారు. అంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఆయన అంధ్రప్రదేశ్ పౌరుడుగానే హైదరాబాదులో నివాసం ఏర్పరుచు కొన్నారు. 1957 నుండి ఆయన ఉస్మానియా సెనేట్‌లో శాశ్వత సభ్యులుగా కొంతకాలం ఉన్నారు. వినోభాజీ ప్రారంభించిన భూదాన్ ఉద్యమాలకు ఆయన చేయూత నిచ్చారు. స్వామీజి 1972 జనవరి 22 వ తేదీన హైదరా బాదులో నిర్యాణం చెందారు. రామానంద తీర్థ స్మారక తపాళా బిళ్ళను విడుదల చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**




# జన్మతః పౌరసత్వంపై డొనాల్డ్ ట్రంప్ వేటు.. ఉత్తర్వులు జారీ

వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేశారు.

అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం పిల్లలకు ఈ హక్కు సంక్రమించాల్సి ఉంటుంది. తాజాగా దీనిపై ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. "అక్రమ వలసదారులకు అమెరికాలో పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదు" అని ట్రంప్ ఈసందర్భంగా వ్యాఖ్యానించారు. ఆయన ప్రభుత్వం వలస విధానంపై తీసుకొనే చర్యలకు ఇది చిహ్నమని నిపుణులు చెబుతున్నారు. ఈసందర్భంగా అమెరికా మాత్రమే ఇలాంటి పౌరసత్వం అందిస్తోందని ట్రంప్ తప్పుగా వ్యాఖ్యానించారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 దేశాలు ఈ విధానంలోనే పౌరసత్వాన్ని అందజేస్తున్నాయి. అమెరికాలో అంతర్యుద్ధం తర్వాత 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ శరణార్థుల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని అందిస్తోంది. ఈ విధానం దాదాపు శతాబ్దకాలంగా అమలులో ఉంది. అక్రమ చొరబాటుదారులకు పుట్టిన పిల్లలకూ, టూరిస్టు లేదా స్టూడెంట్ వీసాపై వచ్చిన వారికి అమెరికాలో కాన్పు కాగా పుట్టిన పిల్లలకూ ఈ నియమం వర్తిస్తుంది.

కాగా, ఈ విధానాన్ని రద్దు చేసే ప్రయత్నానికి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది.

చురకలు

## సంపాదకీయం

# కేజ్రీవాల్ తో ఫ్యూచర్ లోనూ కాంగ్రెస్ తో పొత్తుకు నో!

ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేడి.. ఆ రాష్ట్రంలో ఇప్పటికే సెగలు పుట్టిస్తోంది. దీనికి తోడు ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. పనిలో పనిగా విమర్శలు.. ఆరోపణల విషయంలో ఒకరికి మించి మరొకరు అన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇలాంటి వేళ.. అధికార ఆమ్ ఆద్మీకి.. ఒకప్పుడు ఢిల్లీని నాన్ స్టాప్ గా ఏలిన కాంగ్రెస్ పార్టీల మధ్య ఎన్నికల పొత్తు కుదురుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి వేళ.. అలాంటి ప్రచారానికి తన వ్యాఖ్యలతో ఫుల్ క్లారిటీ ఇవ్వటమే కాదు.. తలుపుల్ని పూర్తిగా మూసేసినట్లుగా చెప్పాలి. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత అవసరమైతే ఆమ్ ఆద్మీకి మద్దతు ఇస్తారా? అంటూ కాంగ్రెస్నేత అజయ్ మాకెన్ ను అడగ్గా.. ఆయన నోటి నుంచి కీలక వ్యాఖ్యలు వచ్చాయి. కేజ్రీవాల్ పార్టీతో కాంగ్రెస్ కు ఫ్యూచర్ లో ఎలాంటి పొత్తు అక్కర్లేదన్నారు. అయితే.. తాను చేసిన వ్యాఖ్యలన్నీ కూడా వ్యక్తిగత అభిప్రాయంగా పేర్కొన్నారు. అయితే.. కాంగ్రెస్ అధినాయకత్వం ఎలాంటి భావనలో ఉందన్న విషయాన్ని అంచనా వేసుకొనేలా మాకెన్ వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పాలి. మాకెన్ మాటల నేపథ్యంలో ఇక్కడో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ మొత్తం అధికార ఆమ్ ఆద్మీ వర్సెస్ బీజేపీ మధ్యనే జరుగుతుందన్న మాట బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో పెద్దగా పట్టు లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికల బరిలో కాంగ్రెస్ నిలిచినప్పటికీ.. అది చూపే ప్రభావం అంతంత మాత్రమేనని చెప్పాలి. మరో విషయం ఏమంటే.. ఇండియా కూటమిలో భాగంగా లోక్ సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన పార్టీల్లో ఆప్ సహా ఒక్కొక్క పార్టీ కాంగ్రెస్ నుంచి దూరం కావటం గమనార్హం. మరోవైపు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే సమాజ్ వాదీ పార్టీ సైతం ఆ పార్టీ నుంచి దూరం జరుగుతోంది. ఢిల్లీ ఎన్నికల్లో ఈ పార్టీ కాంగ్రెస్ కు కాకుండా అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి అండగా నిలుస్తూ.. మద్దతు ఇస్తోంది. దీదీ పార్టీ సైతం ఆమ్ ఆద్మీ పార్టీకే మద్దతు ఇవ్వటం గమనార్హం. ఒక్కొక్కరిని దూరం చేసుకుంటున్న కాంగ్రెస్ కు ఢిల్లీ ఎన్నికలు భారీగా నష్టం చేస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి.. ఢిల్లీ ఓటర్లు ఎలాంటి తీర్పును ఇస్తారో చూడాలి.

# కథా సాహిత్యంలో ఇందిరాదేవి ప్రత్యేకమైన ముద్ర - జనవరి 22...నందగిరి ఇందిరాదేవి వర్థంతి



తెలంగాణ సాహిత్య చరిత్రలో నందగిరి ఇందిరాదేవి పేరును చిరస్థాయిగా నిలిచి పోయింది. కథా రచయిత్రిగా, సామాజిక సేవకురాలిగా, ఉద్యమ కారిణిగా, తెలంగాణ మహిళల అభ్యున్నతికి కృషి చేసిన సాహిత్య ప్రవంతిగా ఆమె పేరు నిలిచి పోయింది. ఆమె రచనలు సామాజిక సమస్యలను చర్చించడమే కాకుండా, మార్పు కోసం ఉద్యమాలకు ప్రేరణగా నిలిచాయి. నందగిరి ఇందిరాదేవి 1919 సెప్టెంబర్ 22న వరంగల్ జిల్లా హన్మకొండలో జన్మించారు. ఆమె చిన్ననాటి నుంచే సాహిత్యం పట్ల ఆసక్తిని ప్రదర్శించి, రచనా శక్తికి బీజం వేశారు. తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసిన అనంతరం, ఆమె సమాజ సేవలో తనను తాను నిమగ్నం చేశారు. విద్య, సాహిత్యం, సామాజిక సేవలను సమన్వయంతో నడిపి, ఆమె తన జీవితాన్ని ఒక ఆదర్శంగా మార్చారు. నందగిరి ఇందిరాదేవి కథా సాహిత్యానికి ప్రత్యేకమైన ముద్రను వేశారు. ఆమె కథలు పాఠకుడి హృదయాన్ని కదిలించడమే కాకుండా, సమాజాన్ని ప్రతిబింబించాయి. ఆమె కథల్లో ప్రధానంగా సామాజిక సమస్యలు, మహిళా సమస్యలు, కుటుంబ జీవితంలోని సంక్షోభాలు, స్త్రీపురుషుల మనస్తత్వాలు ఉంటాయి. నందగిరి రచనల్లో పాత్రలు జీవంతో నిండినవిగా కనిపిస్తాయి. ప్రతి పాత్రకి సామాజికత, భావోద్వేగాలు, జీవితంలో ఉన్న సమస్యల ముద్ర ఉంటాయి. ఆమె భాష సరళమైనదే కాకుండా, ఆలోచనలను ఉత్తేజపరిచే శైలిని కలిగిఉంటుంది. ఆమె రచనల్లో హాస్యం కూడా సున్నితంగా పలుకుతుంది. ఆమె రచనలు ఆంధ్రజ్యోతి, చిత్రగుప్త, ఆంధ్రకేసరి, శోభ, ప్రజామిత్ర వంటి పత్రికల్లో విరివిగా ప్రచురితమయ్యాయి. వాయిద్యం సరదా వంటి కథలు మానవ స్వభావాలపై సున్నితమైన విశ్లేషణలు చేస్తాయి. సాహిత్యం మాత్రమే కాదు, నందగిరి ఇందిరాదేవి సమాజ సేవలో కూడా చురుగ్గా పాల్గొన్నారు. మహిళా ఉద్యమాలలో మహిళల్లో అక్షరాస్యత పెంచడం, మహిళల జీవితాలను మార్పు తెలుస్తూ ఉద్యమాలు నడిపడం వంటి కృషిలో ముందుండి పాల్గొన్నారు. స్నేహితురాళ్లతో కలిసి ఆమె "ఆంధ్ర యువతీ మండలి"ని స్థాపించారు. దక్కన్ రేడియోలో ప్రసంగించిన తొలి రచయిత్రిగా ఆమె పేరు నిలిచింది. అరవై ఏళ్లపాటు ఆమె ప్రసంగాలు కొనసాగాయి. "మసకమాటున మంచిముత్యాలు" పేరిట వాటిని సంకలనం చేశారు. నందగిరి ఇందిరాదేవి ఒక సాంఘిక సంస్కరణోద్యమ సారథిగా ప్రముఖ పాత్ర పోషించారు. బాల్య వివాహాల పట్ల ఆమె నిరసన వ్యక్తం చేశారు. వ్యక్తిగత జీవితంలో కూడా ఈ నిబంధనను పాటిస్తూ, యుక్తవయస్సులోనే ఆమె వివాహం చేసుకున్నారు. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభల్లో ఆమె అధ్యక్షత వహించడం ద్వారా మహిళా చైతన్యానికి దోహదం చేశారు. 1940లో హైదరాబాద్ అఖిలాంధ్ర కథకుల సమావేశాన్ని నిర్వహించి, కథా సాహిత్యం మీద విస్తృత చర్చలు చేశారు. ఆమె భర్త నందగిరి వెంకట్రావు తెలంగాణ తొలి తరం కథకుల్లో ప్రముఖులుగా పేరు గాంచారు. 2007 జనవరి 22న ఆమె పరమపదించారు. నందగిరి ఇందిరాదేవి తెలుగు సాహిత్యానికి, తెలంగాణ సంస్కృతికి ఇచ్చిన కృషి అనన్యసామాన్యం. ఆమె కథలు కేవలం రచనలుగా నిలిచిపోకుండా, సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయి. ఆమె జీవితం, రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. నందగిరి ఇందిరాదేవి ఒక కథా రచయిత్రిగా మాత్రమే కాక, తెలుగు మహిళా చైతన్యానికి ఒక వెలుగు దీపంగా నిలిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


# వ్యావహారిక బాషకు పితామహుడు గిడుగు రామమూర్తి - అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు - జనవరి 22... గిడుగు రామ్మూర్తి వర్ధంతి



తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న సాహితీవేత్త గిడుగు రామమూర్తి పంతులు రామమూర్తి (1863-1940). ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వారు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకులు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని ఆయన. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామ్యాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వారితో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టారు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నారు. సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి, నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నారు. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించారు, నచ్చచెప్పారు. వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్థంలో ప్రాచీనమైన గ్రాంధిక భాషకు... వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ౨ ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919-20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసారు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంధిక భాషే పాతుకు పోయిందిబీ కొన్నిటిలో వీరేశలింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంధికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించారు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాస పత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది. వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి. వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నారు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవర భాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది. మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వారు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివారు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించారు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చారు. 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందారు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలి పెట్టక పోవటానికి బాధపడ్డారు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఆంధ్రప్రదేశ రాష్ట్ర తొలి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు - జనవరి 22... అయ్యదేవర జయంతి



భారత స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలను సైతం ఎదురొడ్డి పోరా టం సాగించిన మహా నాయకులలో తొలితరం తెలుగు నాయకులు కాశీనాథుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, టంగుటూరి ప్రకాశం మొదలైన వారు కాగా మలితరం మహా నాయకులలో పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, బులుసు సాంబమూర్తి తదితరులు పేర్కొనతగిన వారు. అయ్యదేవర కాళేశ్వరరావు (జనవరి 22, 1881 – ఫిబ్రవరి 26, 1962) స్వాతంత్ర సమర యోధు లు, ఆంధ్ర ప్రదేశ్ శాసన సభకు మొదటి శాసన సభాధిపతి. కాళేశ్వరరావు పశ్చిమ కృష్ణా జిల్లా నందిగామ వాసి. 1881 జనవరి 22వ తేదీన జన్మించారు. కాళేశ్వర రావు ప్రాథమిక విద్య స్వగ్రామం నందిగామలోనే జరిగింది. ఉన్నత విద్య ఆలస్యంగా 1894-1901లో బందరులో జరిగింది. బందరులో రఘుపతి వెంకట రత్నంనాయుడు శిష్యులైనారు. వేమూరి రామకృష్ణా రావు వద్ద ఇంగ్లీషు అభ్యసించారు. అక్కడ డా.పట్టాభి, ముట్నూరి కృష్ణారావులతో స్నేహం ఏర్పడింది. ఇంగ్లీషులో లెక్కలలో ప్రావీణ్యం సంపాదించారు. మదరాసు వెళ్లి ఇంజనీరు కావాలనుకున్న కాళేశ్వర రావు కోరిక నెరవేరలేదు. బందరులోనే చరిత్రలో పట్టభద్రులై, కాళేశ్వర రావు ప్రతిభను గుర్తించి ఆయనను అదే స్కూలులో చరిత్ర ఉపాధ్యాయులుగా నియమిం చారు. 1901-1903 ఉపాధ్యా యుడిగా ఉండి మంచి పేరు తెచ్చుకున్నారు. 1904-1905 సంవత్సరాలలో కాళేశ్వరరావు మదరాసులో లా చదివి న్యాయవాది అయినారు. జమిందారీల చట్టం విషయంలోగల విశేష పరిజ్ఞానం మూలంగా పలువు రు జమిందారులకు లాయరుగా పని చేశారు. మదరాసులో కొమర్రాజు లక్ష్మణరావు, కందుకూరి వీరేశలింగంలతో పరిచయం ఏర్పడింది. ఆ కారణంగా సంఘ సంస్కరణోద్యమ బీజం పడింది. రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రభావం వల్ల సంఘ సంస్కరణపై మక్కువతో బ్రహ్మ సమాజ కార్యక్ర మాలలో కృషి చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమంలోను, హోంరూ లు ఉద్యమంలోను పని చేశారు. మహాత్మా గాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాలలోనూ ఉత్సాహం గా పాల్గొని కారాగార శిక్షను అనుభవించారు. రాజకీయాలతో పాటు గ్రంథాల ప్రచురణలో శ్రద్ధ వహించారు. విజయవాడ లోని రామమోహన గ్రంథాలయ స్థాపనకు సహాయం చేశారు. కొమర్రాజు లక్ష్మణరావు నెలకొల్పిన విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిలో కార్యదర్శిగా పని చేశారు. కారాగారంలో ఉండగా 'ఫ్రెంచి విప్లవ చరిత్ర', 'అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర', 'తురుష్క ప్రజా స్వామికం', చీనా జాతీయోద్యమ చరిత్ర', 'ఈజిప్టు చరిత్ర' అనే పుస్త కాలను రచించారు. 1926, 1937, 1946, 1955 సంవత్సరాలలో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయవాడకు ప్రాతి నిధ్యం వహించారు. ప్రజా ప్రతి నిధిగా విజయవాడ పురపాలక సంఘానికి అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ఎంతోమందికి విద్యా దానము చేసారు. ఆయన విజయవాడ పురపాలక సంఘ అధ్యక్షులుగా, మద్రాసు శాసన సభకు చీఫ్ విప్‌గానూ బాధ్యతలు నిర్వర్తించారు. 1939లో మద్రాసు శాసనసభకు కాంగ్రెస్ పార్టీ తరఫున విజయవాడ- బందరులకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీ చేసి ఘన విజయం సాధించారు. రాజగోపాలాచారి ప్రధానమంత్రిగా మద్రాసు ప్రభుత్వం ఏర్పడగా, దానిలో కాళేశ్వరరావు రాజగోపాలా చారికి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మద్యపాన నిషేధ చట్టం, సేల్సుటా క్సు, హరిజన దేవాలయ ప్రవేశ చట్టాల రూప కల్పనలో కాళేశ్వర రావు తన మేధా సంపత్తిని, భాషా నైపుణ్యాన్ని ఉపయోగించి మన్ననలు పొందారు. 1946లో విజయవాడ నుంచి శాసనసభకు ఎన్నికైన కాళేశ్వరరావు ప్రకాశం పంతులు పక్షం వహించారు. టంగుటూరి ప్రకాశం మంత్రివర్గంలో కాళేశ్వర రావుకు మంత్రి పదవి రాలేదు కానీ ఆయన శిష్యుడు వేముల కూర్మ య్యకు మంత్రి పదవి కాళేశ్వరరావు ప్రభావం వల్ల లభించింది. ఆ ప్రభుత్వం ఏడాది లోపే పడి పోయినా కాళేశ్వరరావు ప్రకాశం పక్షాననే ఉన్నారు. 1947లో కాళేశ్వర రావు శాసన సభలో బహుభార్యత్వ నిషేధపు బిల్లును ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం 1955లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎన్నికై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తొలి శాసన సభకు అయ్యదేవర కాళేశ్వరరావు తొలి సభాపతిగా ఎన్నికయ్యారు. 1956 నుండి 1962 వరకు రాష్ట్ర శాసనసభ సభాపతిగా బాధ్యతలు నిర్వర్తిం చారు. శాసన సభాపతిగా శాసన సభలో భాష తెలుగులోనే ఉండాల ని 1959 డిసెంబరు 14న రూలింగ్ ఇచ్చారు. 1961 ఆగస్టు 11న సభాపతి అనుమతి లేనిదే సభలో ఎవరైనా ఎలాంటి ప్రకటన లు, ప్రసంగాలు చేయరాదని రూలింగ్ ఇచ్చారు. 1962లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యారు, కానీ ఫలితా లు వెలువడడానికి ముందురోజే తుదిశ్వాస వదిలారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

బుధవారం 22 జనవరి 2025

## స్థానికంగా రిజిస్ట్రేషన్లు.. తప్పిన ఇబ్బందులు

రామగుండం: రామగుండం నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన ఏర్పాటుతో ప్రజలకు ఉపశమనం లభించింది. ఇదివరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ కార్యాలయం ఉండగా.. నియోజకవర్గంలోని ప్రజలు దూర ప్రయాణంతో ఇబ్బందులు పడేవారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోనే నూతన రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో.. ప్రజలకు మరింత చేరువలో సదుపాయాలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎంపీడీవో కార్యాలయంలో రూ.10 లక్షల వ్యయంతో నూతన హంగులతో రిజిస్ట్రార్ కార్యాలయానికి సన్నాహాలు చేయగా అక్టోబరులో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు.




**అందుబాటులో సేవలు - బాలకిషన్, సబ్‌రిజిస్ట్రార్**

నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్లపై ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నా. ఇటీవల మంచిర్యాల జిల్లా పరిధిలో పనిచేసిన అనుభవముంది. నూతనంగా బాధ్యతలు స్వీకరించినంతరం మూడు నెలల వ్యవధిలో రూ.3 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేకూరింది. స్థానిక ప్రజలకు అందజేసి ఆదాయం పెంచే దిశగా ప్రయత్నిస్తా.

**కల సాకారం- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**

దూర ప్రాంతాన్ని తగ్గించి ప్రజలకు సేవలందించే దిశగా ఏళ్ల కల సాకారం చేసినందుకు సంతోషంగా ఉంది. రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. మూడు నెలల వ్యవధిలో సుమారు 600లకు పైగా రిజిస్ట్రేషన్లు కాగా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది.

## సుందరీకరణ.. సందర్శకులకు ఆహ్లాదం

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణ ప్రజలకు, రాజన్న భక్తులకు ఆహ్లాదం పంచేందుకు చేపడుతున్న గుడి చెరువు కట్టపై సుందరీకరణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. రానున్న మహా శివరాత్రి జాతరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేజర్ పనులు పూర్తయ్యాయి. రాజన్న ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వీరితోపాటు స్థానికులు ఆహ్లాదంగా గడిపేందుకు రూ.12 కోట్లతో గుడిచెరువు కట్టపై కిలో మీటరు పొడవునా బండ్ సుందరీకరణ పనులకు పర్యాటకశాఖ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) అధికారులు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. పనులు ఆగుతూ సాగుతూ ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. గుడి చెరువు కట్టను దాదాపు కిలో మీటరు పొడవునా సుందరీకరణ చేశారు. పార్కు మొత్తం పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. సేదతీరడానికి పచ్చని గడ్డి పెంచారు. వివిధ రకాల మొక్కలు నాటారు. విద్యుత్ దీపాలు, ఫ్లోరింగ్, వాకింగ్ ట్రాక్, బెంచీలు, రంగు రంగుల విగ్రహాలు, చిన్నారులు ఆడుకునేలా నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన గేటు, భద్రత సిబ్బంది గది తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. లైట్లు అమర్చాల్సి ఉంది. వీటికి సంబంధించిన సామగ్రిని సిద్ధంగా ఉంచారు. పార్కు ప్రారంభం తేది నిర్ణయిస్తే దీపాల ఏర్పాటు తదితర చిన్న చిన్న పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసిన తరవాత విద్యుత్ దీపాలు అమర్చనున్నారు. మహా శివరాత్రికి ముందే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ఆకర్షణీయంగా...గుడి చెరువు బండ్ సుందరీకరణ భక్తులతో పాటు పట్టణ ప్రజలను ఆకర్షించనుంది. ఆహ్లాదం పంచనుంది. ఇప్పటికే పట్టణంలోని మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన పార్కు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. అదే మాదిరిగా రాజన్న భక్తులకు ఇది ఉపయోగపడనున్నది. ఉదయం, సాయంత్రం పట్టణవాసులు, భక్తులు సేదతీరడానికి ఎంతగానో దోహదపడనుంది.

**అందుబాటులోకి తెస్తాం**

గుడి చెరువు బండ్ సుందరీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మహా శివరాత్రికి ముందే పార్కును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గేటు, చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. జీవన్, ఏఈ, పర్యాటకశాఖ

## గాడి తప్పుతున్న పాలన

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి కార్యనిర్వహణ అధికారి(ఈవో)లేక పాలన గాడితప్పుతోంది. ఈవోగా పనిచేసిన రామకృష్ణారావును ఈనెల 3న సికింద్రాబాద్‌లోని గణేష్ ఆలయానికి బదిలీ చేశారు. వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి వినోద్‌కు అదనపు ఈవోగా బాధ్యతలు అప్పగించారు. జనవరి 4న వినోద్ కొండగట్టు అదనపు ఈవోగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత మళ్లీ రాలేదని ఆలయవర్గాలు తెలిపాయి. వరంగల్ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావును ఈవోగా బదిలీ చేస్తూ ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు శ్రీకాంతరావు బాధ్యతలు చేపట్టలేదు. ఉన్నతాధికారిలేక ఆలయంలో పాలన గాడితప్పిందని విమర్శలు వస్తున్నాయి.

**టెండర్ల ప్రక్రియకు అవరోధం**

ఏప్రిల్ 21న ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు ముందు ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఏర్పాట్ల కోసం టెండర్లు నిర్వహించాల్సి ఉంటుంది. మూడు నెలల ముందు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆలయ కార్యనిర్వహణ అధికారిలేక టెండర్ల ప్రక్రియలో జాప్యం ఏర్పడుతోంది. 40 రోజులు కాగానే ఆలయంలోని హుండీలలో భక్తులు వేసిన కానుకలు, నగదును లెక్కిస్తారు. నవంబరు 21న హుండీ లెక్కింపు జరగగా 50 రోజులు గడుస్తున్నా లెక్కింపు చేపట్టలేదు. ఆలయానికి వరంగల్ డిప్యూటీ కమిషనరును ఈవోగా నియమించినా ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టకపోవడంపై చర్యలు తీసుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఏఈవో అంజయ్యను సంప్రదించగా ఈవో నియామకం గురించి ఉన్నతాధికారులు చూసుకుంటారని పేర్కొన్నారు.

# 'అపార్' నమోదులో జాప్యం!



కరీంనగర్ : విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డులో పొందుపరిచేందుకు కేంద్రం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ఉమ్మడి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. 'వన్ నేషన్ వన్ స్టూడెంట్' నినాదంతో ఈ ప్రక్రియను చేపట్టగా.. అపార్ పేరుతో విద్యార్థులకు 12 అంకెల గుర్తింపు నంబరు భవిష్యత్తులో వారికి కీలకంగా నిలవనుంది. మొదట 2వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వివరాలు గత సెప్టెంబరు నెలాఖరు నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. వివరాల నమోదుకు ఈ నెల 31 తుది గడువుగా కేంద్రం సూచించింది. తుది గడువు సమీపిస్తున్నా ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 19 శాతమే నమోదైంది.. అధికారులు పూర్తి చేయాలని తరచూ ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయి సమస్యలు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

**విద్యార్థి సమగ్ర సమాచారం**

కేంద్రం జారీ చేయనున్న అపార్ కార్డులో విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. ఎక్కడ చదివారు, ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి, వ్యక్తిగత వివరాలు అందులో ఉంటాయి. విద్యార్థులు ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి అపార్ కార్డులోని 12 అంకెల విశిష్ట నంబరును ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా దీన్ని రూపొందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ప్రామాణికంగా నిలవనుంది.

**నమోదులో వెనుకబాటు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల విద్యా సంస్థలు 3,700 ఉండగా, వాటిల్లో మొత్తం 5,26,061 మంది విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు వివరాలు నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య 1,00,030. కొన్ని పాఠశాలలు ఈ ప్రక్రియను ఇప్పటికీ ప్రారంభించలేదు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో మెజారిటీ నమోదు పట్టించుకోవడం లేదు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 326 ప్రైవేటు పాఠశాలల్లో 149 పాఠశాలలు నమోదును ప్రారంభించకపోవడం గమనార్హం. మరోవైపు విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు రావడంతోనూ ఈ ప్రక్రియ మందగించింది.

**ప్రతిబంధకాలు అనేకం..**

పలువురు తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధించిన వివరాలు, అంగీకార పత్రాలను ఉపాధ్యాయులకు సకాలంలో అందించడం లేదు. ఉపాధ్యాయులకు అవగాహన లేకపోవడంతో నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

యూ డైస్ ప్లస్‌లో ఉన్న వివరాలతో విద్యార్థుల ఆధార్ వివరాలు సరిపోక కొంతమందివి నమోదు కావడం లేదు. ఆధార్ కార్డుల్లోని తప్పులను సవరించుకుని రావడంలో తల్లిదండ్రుల నిరాసక్తతో నమోదు పుంజుకోవడం లేదు. ఇంటర్ కళాశాలల్లో పబ్లిక్ పరీక్షలపైనే ప్రధాన దృష్టి నిలపడంతో నమోదు మందగించింది.

ఎమ్మార్సీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు చాలా రోజులు సమ్మెలో ఉండటం, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడం నమోదు ఆలస్యానికి మరో కారణం.

# కట్ట తెగి.. నీరు ముంచెత్తి!



తిమ్మాపూర్: అధికారుల అలసత్వం.. గుత్తేదారుల నిర్లక్ష్యం వెరసి తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి జలగండం తప్పడం లేదు. ఇప్పటికే మూడుసార్లు డీ-4 కెనాల్ కట్ట తెగడంతో ఇళ్లు నీటమునిగి నిత్యావసర సరకులు, విలువైన సామగ్రి నీటిపాలయింది. అయినా సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

**ఇదీ పరిస్థితి:** చిగురుమామిడి, తిమ్మాపూర్, సైదాపూర్, మానకొండూర్ మండలాలకు సాగు నీరందించేందుకు మధ్యమానేరు జలాశయం నుంచి తోటపల్లికి.. అక్కడి నుంచి ప్రధాన కాల్వ, పిల్ల కాల్వల వెంబడి నీళ్లందించేందుకు 2008లో కాల్వ పనులను ప్రారంభించారు. ఆ పనులన్నీ 2019లో పూర్తయ్యాయి. మానకొండూర్ మండలంలోని చెంజర్ల, నిజాయితీగూడెం, ఖాదరగూడెం, తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామానికి మన్నెంపల్లి డీ-4 కెనాల్ ద్వారా ఈ సాగు నీరు వెళ్తోంది. 2019లో ఒకసారి కాల్వ తెగగా నీళ్లన్నీ మన్నెంపల్లిలోని ఇళ్లకు చేరాయి. తాత్కాలిక పనులు చేపట్టి అధికారులు, గుత్తేదారు చేతులు దులుపుకోగా రెండోసారి మరోసారి కట్ట తెగింది. అప్పుడు పంటలు నీట మునిగాయి.

నాలుగు రోజుల కింద మరోసారి కెనాల్ కట్ట తెగిపోవడంతో ఇళ్లు జలమయమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి విడుదలను నిలిపేశారు. మొరం పోసి కాల్వను సరి చేశారు.

పూర్తి స్థాయిలో కెనాల్‌కు సీసీ లైనింగ్ ఏర్పాటు చేస్తే తెగిపోయే ప్రమాదం తక్కువగా ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. కెనాల్‌లను అధికారులు పర్యవేక్షిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇళ్ల సమీపంలో ఉన్న కాల్వల వెంబడి లైనింగ్, రక్షణ గోడల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఈఈ పెద్ది రమేశ్ తెలిపారు. చివరి ఆయకట్టు రైతులు నీళ్లు ఇంకా రావడం లేదని పీచుపల్లి క్రాస్ రెగ్యులేటర్ వద్ద పరిమితికి మించి నీరు వచ్చేలా చేయడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. సరిపడా లస్కర్లు లేనందున పర్యవేక్షించలేకపోతున్నామని.. రైతులంతా సహకరించాలని కోరారు.

ఈ కాల్వల కింద సుమారు 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు కలుపుకొని 150 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్నాయి.

తోటపల్లి నుంచి సైదాపూర్ పరిధిలోని ఎలబోతారం వరకు, మానకొండూర్ మండలంలోని ఖాదరగూడెం వరకు రెండు వైపులుగా నీరు వెళ్లేందుకు కాల్వ నిర్మాణాలు చేపట్టి సాగు నీరు అందిస్తున్నారు.

# మొదట్లోనే మొగి పురుగు ఉద్ధృతి

గంగాధర: యాసంగిలో వరి పంట వేసిన రైతులకు మొదట్లోనే కష్టనష్టాలు ఎదురవుతున్నాయి. గత ఖరీఫ్‌లో సుడిదోమ, ఉల్లికోడు, ఇతర తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టాలపాలయ్యారు. ఈ పంటలోనైనా కష్టనష్టాలు అధిగమించి మంచి దిగుబడులు సాధించాలని ఆశించారు. కానీ మొగి పురుగు సోకి రైతులను కోలుకోకుండా చేస్తోంది. పురుగు మందులు చల్లినా పురుగు ఉద్ధృతి తగ్గడంలేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నాట్లు వేసిన 20 రోజుల్లోనే ఆశిస్తున్న తెగుళ్లు**

వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో వరి నారు దశలోనే మొగి పురుగు సోకుతుండగా రెండు, మూడు సార్లు క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. గతంలోనైతే వరిపంట వేశాక పొట్ట దశ నుంచి మొగి పురుగు ఆశించగా ఇప్పుడేమో పది రోజుల నుంచే సోకి వరికర్రలు కుళ్లిపోయి చనిపోతున్నాయి. దీంతో పొలమంతా పంట సాగు చేయని విధంగా ఖాళీ అవుతోంది. ఏళ్లుగా రైతులు ఒకే రకమైన పంట సాగు చేయడం, ఎప్పుడూ పొలం మడుల్లో నీరు ఉంచడంతో తెగుళ్ల ఉద్ధృతి కొనసాగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంట మార్పిడితోపాటు పొడి దుక్కులు దున్నడంతో తెగుళ్లు సోకకుండా నివారించగలవచ్చని అభిప్రాయపడుతున్నారు. చలికాలంలో ఉదయం పూట పొగమంచు, మధ్యాహ్నం ఎండ, రాత్రి చల్లని వాతావరణంతో వరిపై ప్రభావం చూపుతోంది. పంటలో జింకు లోపం కారణంగా ఎదుగుదల లోపించడమే కాకుండా ఎర్రబారుతోంది. పంట కాలపరిమితి 120 రోజుల నుంచి 135 రోజుల వరకు ఉండగా చేతికి అందేసరికి పెట్టుబడుల భారం పెరగనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అదనంగా పెట్టుబడి..**

మూడెకరాల్లో వరి పంట వేసి 20 రోజులు కాకముందే మొగి పురుగు



సోకింది. అధికారుల సూచన మేరకు ఎకరాకు 8 కిలోల చొప్పున కార్బోఫ్యూరిడాన్ గుళికలు చల్లాను. పురుగు మందు కూడా పిచికారీ చేశా. తెగుళ్ల ధాటికి పెట్టుబడులు ఎక్కువ అవుతుండగా పంట దిగుబడి తగ్గి నష్టాలే మిగలనున్నాయి. గతేడాది వర్షాకాలం పంట కూడా ఆశాజనకంగా రాలేదు. మల్లేశం, లక్ష్మీదేవిపల్లి రైతు

**నారు దశలోనే తెగుళ్లు నివారించాలి**


వాతావరణంలో మార్పులతో వరి పంటకు ఆదిలోనే మొగి పురుగు సోకుతుంది. ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరిడాన్ 3జీ గుళికలు లేదా 8 కిలోల కార్పస్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు పంటకు చల్లాలి. క్లోరిఫైరిఫాస్ రసాయన మందు పిచికారీ చేయాలి. వరి పైరులో జింకు లోపం ఉంటే జింకు సల్ఫేట్ చల్లాలి. దీనికంటే ముందు రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. శ్రీనివాస్, ఏవో

## వైద్యానికి తప్పని ఎదురుచూపులు

మెదక్ : పల్లెల్లో వైద్యం దయనీయంగా మారింది. వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరుకాక.. రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడేలా కలెక్టర్ దృష్టి సారించినా ప్రయోజనం ఉండడం లేదు. సమయపాలన పాటించకపోవడం, గైర్హాజరు కావడంతో గ్రామీణ ప్రాంతవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు బిగించినా... ఆకస్మిక పర్యటనలో గైర్హాజరైన సిబ్బందిపై కలెక్టర్ వేటు వేసినా వారిలో మార్పు రావడం లేదు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది.

**సమయానికి రాక..** శివ్వంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఇద్దరు వైద్యాధికారుల్లో ఒకరు సెలవులో ఉండగా... మరొకరు ఆలస్యంగా వచ్చారు. మిగతా సిబ్బందిలో కొందరు సమయానికి రాలేదు.

**ఒకరి తర్వాత మరొకరు** నార్సింగి పీహెచ్‌సీ 24 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఆస్పత్రిలో మొత్తం ముగ్గురు వైద్యులు ఉన్నారు. ఓ వైద్యురాలు సెలవులో ఉన్నారు. ఓ వైద్యురాలు ఉదయం 9:30 గంటలకు, మరో వైద్యుడు ఉదయం 10 గంటలకు చేరుకున్నారు.



అనంతరం 10:15 గంటలకు ఆస్పత్రిలోనే అల్పాహారం చేసేందుకు నిమగ్నమయ్యారు. వైద్య సిబ్బంది కూడా సమయపాలన పాటించలేదు. ఉదయం ఒక నర్సు, మరో ఉద్యోగి మాత్రమే విధుల్లో ఉన్నారు.

**ఒకరు హాజరు.. ఇద్దరు సెలవు** అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు వైద్యులు ఉండగా ఇద్దరు సెలవులో ఉన్నారు. ఒక్కరు మాత్రమే వైద్య సేవలు అందించారు. ఇద్దరు పర్యవేక్షకులు ఉండగా ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు.

**ప్రత్యామ్నాయ సేవలు** పేట పీహెచ్‌సీలో వైద్యుడు 11 గంటల తర్వాత రావడంతో అప్పటి వరకు ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ ద్వారా రోగులకు వైద్య పరీక్షలు జరిపించారు. దీంతో పాటు సిబ్బంది కూడా ఆలస్యంగా వచ్చారు.

**డిప్యుటేషన్‌లో ఏడుగురు..** నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఏడుగురు వైద్యులు ఓపీ సేవలందించారు. ఆసుపత్రిలో 12మంది వైద్యులుండగా, నలుగురు మెదక్, ఇద్దరు తూప్రాన్‌కు, ఒకరు కౌడిపల్లికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఉన్న వారితో మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ పావని తెలిపారు. ఇద్దరు గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, రేడియాలజిస్టు అవసరం ఉంది.

**20 మందికి మిగిలింది ఆరుగురు** కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. సీహెచ్‌సీలోని 20 మంది రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి ఇక్కడ కేవలం ఆరుగురు మాత్రమే పనిచేస్తుండగా.. మిగతా 14 మంది వేరేచోట విధులను నిర్వర్తిస్తున్నారు. సమయం దాటిన తర్వాతనే వైద్యులు విధులకు హాజరయ్యారు. డిప్యుటేషన్ రద్దుచేస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

**పర్యవేక్షణ చేస్తున్నాం...శ్రీరాం, జిల్లా వైద్యాధికారి**


జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది హాజరుపై నేరుగా కలెక్టర్, తాను పర్యవేక్షిస్తున్నాం. ఇద్దరు లేదా ముగ్గురు ఉన్న చోట సెలవుపై వెళ్తున్నా వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిర్వహిస్తున్నాం. ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

## అడుగంటిన హల్దీ

వెల్దుర్తి : హల్దీవాగు ఎండిపోయింది. ఇసుక దిబ్బలు తప్ప నీళ్లు కనిపించడం లేదు. వర్షాకాలంలో చెక్‌డ్యాంలపై మత్తడి పారింది. ఖరీఫ్ వరి నూర్పిళ్లు జరిగే వరకు పుష్కలంగా నీరుంది. యాసంగి వరి పంటలో కలుపు తొలగించే వరకు నీరుంటే సాగునీటికి ఇబ్బంది ఉండదని ఉమ్మడి వెల్దుర్తి మండల రైతులు భావించారు. కానీ ప్రస్తుతం వరి నాట్లు పూర్తి కాకముందే అడుగంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెక్‌డ్యాంలకు లీకేజీలు ఉండటమే ఇందుకు కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎనిమిది చెక్‌డ్యాముల్లో నీరు లేక**

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో హల్దీవాగుపై మొత్తం పది చెక్‌డ్యాంలు ఉండగా ప్రస్తుతం ఎనిమిది అడుగంటాయి. మాసాయిపేట మండలంలోని బొమ్మారం,



మాసాయిపేట చెక్‌డ్యాంలోనే కొద్దిగా నీరుంది. మాసాయిపేట మండలం కొప్పులపల్లి, వెల్దుర్తి-1, వెల్దుర్తి-2, ఉప్పులింగాపూర్, కుకునూర్, దామరంచ-1, దామరంచ-2, శెట్టిపల్లికలాన్ గ్రామాల పరిధిలోని చెక్‌డ్యాంలు ఎండిపోయాయి. ఈ ఎనిమిది చెక్‌డ్యాంలు భూమిలో గట్టి మొరం వచ్చే వరకు తవ్వి నిర్మించలేదని.. దీంతో సిమెంట్ బెడ్ కింది నుంచి నీళ్లు లీకేజీ అవుతున్నాయని రైతులు అంటున్నారు. బొమ్మారం, మాసాయిపేట చెక్‌డ్యాంలు గట్టి భూమిని తవ్వి చెక్‌డ్యాంలు నిర్మించారని, అందువల్లే వీటిలో చాలా రోజుల వరకు నీళ్లు నిల్వ ఉన్నాయని చెబుతున్నారు.

**వేల ఎకరాలకు ఇక్కట్లు**

హల్దీవాగుపై ఉన్న పది చెక్‌డ్యాంల ద్వారా వెల్దుర్తి, మాసాయిపేట, తూప్రాన్, చిన్నశంకరంపేట, కొల్చారం, మెదక్ మండలాల పరిధిలో సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చెక్‌డ్యాంలు అడుగంటడంతో సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. హల్దీవాగులో కాళేశ్వరం నీళ్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు పూర్తయ్యే దశలో ఉన్నాయి. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

చురకలు



# ప్రతీ పనికి ఓ రేటు

మెట్‌పల్లి: లంచం తీసుకుంటూ కొందరు ప్రభుత్వ అధికారులు అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడుతున్నా వారి తీరు మారడం లేదు. మెట్‌పల్లి పట్టణంలో నెల రోజుల వ్యవధిలో రెండు ప్రభుత్వ శాఖల్లో అధికారులు అనిశాకు చిక్కడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కొందరు అడ్డదారులు తొక్కుతూ లంచం ఇవ్వనిదే పనులు చేయడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విసుగు చెందిన బాధితులు అనిశాను ఆశ్రయిస్తుండడంతో అధికారుల అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరం. అయినా కొన్ని ప్రభుత్వ విభాగాల్లో కొందరు ఎంతో కొంత ముట్టజెప్పనిదే పని చేయని దుస్థితి నెలకొంది. ఏవేవో సాకులు చెబుతూ జాప్యం చేస్తుండగా పైసలు ఇస్తే మాత్రం పని పూర్తి చేస్తున్నారు. మెట్‌పల్లి పట్టణంలో డిసెంబర్ 16న నిరభ్యంతర పత్రంపై సంతకం చేయడానికి ఓ వ్యక్తి నుంచి రూ.4,500 లంచం తీసుకుంటుండగా అప్పటి అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి అనిశాకు పట్టుబడగా, తాజాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడి చేసి సబ్ రిజిస్ట్రార్‌తో పాటు కార్యాలయ ఔట్‌సోర్సింగ్ సబార్డినేట్, దస్తావేజు లేఖరి సహాయకుడిని పట్టుకున్నారు.

**దస్తావేజు లేఖరుల ప్రమేయం**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల క్రయవిక్రయాలకు సంబంధించి ప్రజలు మొదట దస్తావేజు లేఖరులను ఆశ్రయిస్తారు. మెట్‌పల్లి కార్యాలయంలో ప్రతీ దస్తావేజుకు ఎంతో కొంత



ముట్టజెప్పనిదే పనిపూర్తవదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లేకపోతే ఏవో సాకులు చెబుతూ జాప్యం ప్రదర్శిస్తుంటారని దీంతో చేసేదేమీ లేక కొందరు అడిగినంత సమర్పించుకుంటారని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారమంతా దస్తావేజు లేఖరుల ద్వారానే నడుస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం సబ్ రిజిస్ట్రార్ పట్టుబడ్డ వ్యవహారంలో దస్తావేజు లేఖరి సహాయకుడు పట్టుబడటం ఇందుకు బలం చేకూరుస్తోంది.

**నాలుగేళ్లలో 39 కేసులు..**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2021 నుంచి 2024 వరకు నాలుగేళ్లలో 39 కేసులు నమోదు కాగా 61 మందిని అనిశా అధికారులు పట్టుకున్నారు. గతేడాది 12 కేసుల్లో 20 మంది పట్టుబడ్డారు. అనిశా దాడులు విస్తృతం చేస్తుండడంతో కేసులు పెరుగుతున్నాయి. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల్లో ఎక్కువగా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. విద్యుత్తు, రిజిస్ట్రేషన్, మున్సిపాలిటీ శాఖల్లోనూ పట్టుబడ్డారు. కేసులు నమోదు చేయడమే కాకుండా వారికి శిక్ష పడేలా అనిశా అధికారులు కృషి చేస్తున్నారు. 2022లో ఒకరికి రెండేళ్లు, 2023లో నలుగురికి నాలుగేళ్లు, 2024లో ఇద్దరికి నాలుగేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరంతా రెవెన్యూ శాఖకు సంబంధించిన వారే కావడం గమనార్హం.

**అక్రమార్కుల్లో దడ**

మెట్‌పల్లి పట్టణంలో సుమారు ఏడాదిన్నర కిందట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సహాయకుడిని అనిశా అధికారులు పట్టుకున్నారు. మళ్లీ నెల వ్యవధిలో రెండు శాఖల్లో ఇద్దరు అధికారులు అనిశా వలకు చిక్కారు. అనిశా అధికారులు పక్కాగా దాడులు చేసి పట్టుకుంటుండడంతో అక్రమార్కుల్లో కొంత దడ మొదలైందని పలువురు చర్చించుకుంటున్నారు. మెట్‌పల్లి ప్రాంతంలో ప్రజలకు అవసరమయ్యే పలు ప్రధాన శాఖల్లోనూ కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించి అక్రమార్కుల భరతం పట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సమాచారమివ్వాలి: రమణమూర్తి, అనిశా డీఎస్పీ**

ప్రభుత్వ శాఖల్లో పనులు చేసేందుకు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే అనిశాకు సమాచారమివ్వాలి. ఎవరు ఫిర్యాదు చేసినా వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. వచ్చిన ఫిర్యాదును బట్టి తగిన చర్యలు తీసుకుంటాం.

# ఇక నగరంలో 66 డివిజన్లు

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోకి కొత్తగా ఆరు గ్రామాలను, ఒక మున్సిపాలిటీని విలీనం చేస్తూ ప్రభుత్వం శుక్రవారం గెజిట్ జారీ చేసింది. ఈనెల 5న రాజపత్రం ముద్రించారు. మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నగరానికి ఆనుకొని గ్రామాలను కలుపుతున్నట్లు డిసెంబరు రెండో వారంలో జరిగిన శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. దీనిపై పలు గ్రామాల ప్రజలతోపాటు పాలకవర్గ సభ్యులు సైతం అయిష్టత వ్యక్తం చేశారు. పునరాలోచన చేయాలని పాలకవర్గ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. ప్రభుత్వం అవేవి పరిగణనలోకి తీసుకోకపోవడం, అధికారికంగా రాజముద్ర పడటంతో విలీనం ఖాయమైంది. ప్రస్తుతమున్న 60 డివిజన్లను 66కి పెంచారు.



2018లో ఎనిమిది గ్రామాలను విలీనం చేశారు. ఆ సమయంలో ఉన్న 50 డివిజన్లను 60కి పెంచారు. ప్రస్తుతం ఆరు గ్రామాలతోపాటు మున్సిపాలిటీ కలపడంతో నగర విస్తీర్ణం, జనాభా మరింత పెరగనుంది.

**విలీనమైనవి :** కొత్తపల్లి పురపాలిక, చింతకుంట, మల్కాపూర్, లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామ పంచాయతీలు.

**ఆ పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే..**

గెజిట్ విడుదల కావడంతో విలీన గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే. అంతటా స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొని ఉండగా, ఇక వీటిలో ఉండవు. పాలకవర్గ పదవీకాలం కూడా ఈనెల 29తో ముగియనుండటంతో ప్రత్యేకాధికారి పాలనలో విలీన గ్రామాలపై చర్యలు ప్రారంభం కానున్నాయి.

# కార్యాచరణతో కళ్లెం వేద్దాం



హైదరాబాద్: వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో సమగ్ర మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కార్యాచరణను ముందుకు తీసుకెళ్లడంపై ప్రభుత్వ దృష్టిసారిస్తోంది. హైదరాబాద్ కోర్ ఏరియాతో పాటు కొత్తగా విస్తరించిన ప్రాంతాలు, ప్రదేశాలతో కూడిన సమగ్ర మురుగునీటి వ్యవస్థకు రూపొందించిన రూ.17 వేలకోట్ల ప్రణాళిక అమలు అంశం కీలకంగా మారింది. హైదరాబాద్ సమగ్ర మురుగునీటి వ్యవస్థను అమృత్ 2.0లో చేర్చాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖను కోరింది.

**నగరం భారీగా విస్తరించడంతో..** రాజధానిలో దశాబ్దాల నాటి మురుగునీటి వ్యవస్థ ఉండగా.. నగరం భారీగా పెరిగిన నేపథ్యంలో కొత్త వ్యవస్థను నెలకొల్పడం అత్యంత కీలకంగా మారింది. గ్రామ పంచాయతీలుగా ఉన్న కోర్ ఏరియాలోని ప్రాంతాలన్నీ జీహెచ్ఎంసీలో అంతర్భాగమయ్యాయి. కొత్త నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఉన్న మురుగునీటి వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. **కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల ఆధారంగా..** ఓఆర్ఆర్ వరకు ప్రభుత్వం రూపొందించిన సీవరేజీ మాస్టర్ ప్లాన్‌కు రూ.17,212 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. సుమారు 4,378 కి.మీ.ల మేర సీవరేజీ నెట్‌వర్క్ ఉండటంతో దీనిపై సమగ్ర నివేదిక తీసుకొచ్చారు. కోర్‌సిటీ, చుట్టుపక్కల ప్రాంతాలు, ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలను కలిపి దీన్ని సిద్ధం చేశారు. గతేడాది అక్టోబరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిని కలసి హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ (సీఎస్ఎంపీ)ను అమృత్ 2.0లో చేర్చి నిధులు అందించాలని కోరారు. ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలకు పటిష్ఠమైన మురుగునీటి వ్యవస్థతో పాటు వందశాతం మురుగునీటి జలాల శుద్ధి కీలకమని కేంద్రానికి వివరించారు. కేంద్రం అందించే నిధుల అంశంలో స్పష్టత వస్తే.. సీఎస్ఎంపీని ఎలా ముందుకు తీసుకెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తుందని అంటున్నారు. రాష్ట్ర బడ్జెట్ సమయం నాటికి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంపై స్పష్టత వస్తుందని పురపాలకశాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

# ల్యాండ్ పూలింగ్‌కు సై



హైదరాబాద్: ల్యాండ్ పూలింగ్‌కు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) సిద్ధమైంది. మూడు ప్రాంతాల్లో దాదాపు 400 ఎకరాలు సమీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం భూ సమీకరణ పథకం కింద ఆయా ప్రాంతాల రైతుల నుంచి దరఖాస్తులను కోరుతూ నోటిఫికేషన్లు జారీ చేసింది. కొత్త ప్రభుత్వంలో తొలిసారి ల్యాండ్ పూలింగ్‌కు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. సేకరించిన భూముల్లో హెచ్ఎండీఏ లేఅవుట్లు అభివృద్ధి చేయనుంది. ఇవన్నీ దాదాపు సాగులో లేనివే. కొన్ని అసైన్డ్ కేటగిరిలో ఉండటంతో రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. లేఅవుట్ కింద తీర్చిదిద్ది అందులో సకల సౌకర్యాలు కల్పించనుంది. మిగతా భూమిలో రైతులకు 60 శాతం ప్లాట్లు బదిలీ చేస్తుంది. మిగతా 40 శాతం హెచ్ఎండీఏ విక్రయించి ఆదాయం సమకూర్చుకోనుంది. ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా గతంలో రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలో దాదాపు 924.28 ఎకరాలను అధికారులు పరిశీలించారు. ప్లాట్ల ధరలు మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా చూడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సమీకరణ ఇక్కడే...**


రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం తిమ్మాయిగూడలోని సర్వే నంబర్లు 4 నుంచి 95, 104ల్లో 156.02 ఎకరాలు భూ సమీకరణ కింద తీసుకోనున్నారు. ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ కమ్ ల్యాండ్ పూలింగ్ పథకం కింద హెచ్ఎండీఏ డిక్లరేషన్ ఇచ్చింది. వచ్చే 30 రోజుల్లో రైతులు హెచ్ఎండీఏకు ఈ స్కీంలో చేరుతున్నట్లు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అబ్దుల్లాపూర్ మండలం కుత్బుల్లాపూర్ గ్రామంలో సర్వే నంబర్లు 164 నుంచి 246లో 130 ఎకరాలకు సంబంధించి భూ సమీకరణ పథకం కింద చేర్చుతూ నోటిఫికేషన్ జారీ చేశారు.

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం కుర్మల్‌గూడ, నాదర్‌గుల్‌లో సర్వే నంబర్లు 2 నుంచి 29 వరకు, 36 నుంచి 40 వరకు, 80 నుంచి 98 వరకు, 728/పార్ట్, 729ల్లోని 115.18 ఎకరాలు భూసమీకరణ కోసం హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చింది.

చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపూర్‌లో 355 ఎకరాలు, భోగారంలో 125 ఎకరాలు, ప్రతాప్‌సింగారంలో 152 ఎకరాలు, నాదూర్‌గుల్‌లో మరో 91 ఎకరాలు అతి పెద్ద లేఅవుట్లుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది.

# మహిళా వర్సిటీకి అధికారిక గుర్తింపు



హైదరాబాద్: కోఠి మహిళా కళాశాల నుంచి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా మారిన రాష్ట్ర తొలి మహిళా విశ్వవిద్యాలయానికి అధికారిక గుర్తింపు లభించింది. తెలంగాణ గెజిట్‌లో ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించింది. నాలుగేళ్ల క్రితమే అప్పటి ప్రభుత్వం విశ్వవిద్యాలయంగా ప్రకటించినా... శాసనసభలో యూనివర్సిటీ యాక్ట్ ప్రకారం బిల్లును ప్రవేశపెట్టలేదు. దీంతో యూజీసీ గుర్తింపు ఇప్పటికీ లభించలేదు. ఇంతేకాదు.. మూడేళ్ల క్రితం డిగ్రీలో చేరిన విద్యార్థులకు మహిళా విశ్వవిద్యాలయం పేరుతో డిగ్రీలు ఇవ్వకపోతే వారికి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలుండగా.. గతేడాది అక్టోబరులో ప్రభుత్వం స్పందించింది. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం పేరును వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా మార్చింది. డిసెంబరు నెలలో జరిగిన శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టింది. జనవరి 17న మహిళా విశ్వవిద్యాలయాన్ని అధికారికంగా గుర్తిస్తూ ప్రకటన జారీ చేసింది.

**యూజీసీ గుర్తింపు కోసం దరఖాస్తు**

వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయాన్ని ప్రభుత్వం గెజిట్‌లో ప్రచురించినందున విశ్వవిద్యాలయ గుర్తింపు కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కు శనివారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయనున్నామని ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ తెలిపారు. వారం పదిరోజుల్లో గుర్తింపు లభించకపోతే.. దిల్లీకి వెళ్లి గుర్తింపు పత్రం పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నామని వివరించారు.

# విద్యుత్తు అవసరాలు తీరేలా

హైదరాబాద్: నగర అవసరాల కోసం ప్రత్యేకంగా విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ ఉండాలని గతంలో శంకర్‌పల్లిలో ప్రభుత్వం పెద్దఎత్తున భూములు కేటాయించింది. అక్కడ ఎన్టీపీసీతో కలిసి పవర్‌ప్లాంట్ పెట్టాలనేది నాటి ఆలోచన. న్యూక్లియర్ పవర్ ప్లాంట్ తెరమీదకు వచ్చినా స్థానికుల వ్యతిరేకతతో అడుగులు ముందుకు పడలేదు. తాజాగా అక్కడ కాలుష్య రహిత బ్యాటరీ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగర విద్యుత్తు అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ వేసవిలో డిమాండ్ 5 వేల మెగావాట్లకు చేరొచ్చని అంచనా. నగరం కోసమే ప్రత్యేకంగా కాలుష్య రహిత ప్లాంట్ ఉండాలని దశాబ్దాల క్రితమే అధికారులు ఆలోచించారు. వేర్వేరు కారణాలతో కార్యరూపం దాల్చలేదు. అప్పట్లో శంకర్‌పల్లిలో సర్కారు కేటాయించిన భూముల్లో కొంతభాగం 400 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించారు. ఇంకా అక్కడ 350 ఎకరాల వరకు భూములున్నాయని ట్రాన్స్‌కో వర్గాలు చెబుతున్నాయి. వీటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలోనే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్(బీఈఎస్ఎస్) ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి వచ్చింది.

**నూతన ఇంధన పాలసీతో..** రాష్ట్రానికి ఇంధన భద్రత కోసం ప్రభుత్వం ఇటీవలే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రవేశపెట్టింది. ఇంధన నిల్వ స్థాపిత సామర్థ్యాన్ని 2034-35 నాటికి 7,917 మెగావాట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం బ్యాటరీ పవర్ ప్లాంట్లను సర్కారు ప్రోత్సహిస్తోంది. పగటిపూట చౌకగా ఉత్పత్తయిన సౌర విద్యుత్తును, కరెంట్ ఛార్జీలు తక్కువగా ఉన్నప్పుడు గ్రిడ్ నుంచి విద్యుత్తును కొనుగోలు చేసి ప్లాంట్‌లోని బ్యాటరీల్లో నిల్వ చేయవచ్చు. అధిక ధర ఉన్నపుడు దీన్ని వినియోగించుకోవచ్చు. ఇందుకోసం ప్లాంట్‌ను శంకర్‌పల్లిలో ఏర్పాటు చేయాలనేది ఆలోచన.

# అడ్డుకట్టతో జలకళ

జగిత్యాల : జిల్లాలో ఏడాదిలో సగటున 936 మి.మీ వర్షం కురవడం, ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీళ్లు రావటం, వరదకాలువ నుంచి వాగుల్లోకి నీటిని వదలటం, గోదావరి నుంచి ఎత్తిపోతలు, ఎల్లంపల్లి నీటి తరలింపుతో చాలా వాగులు జలకళతో ఉంటాయి. ప్రాజెక్టుల నీటిని చెరువులు, కుంటల్లోకి తరలించటం తదితర సానుకూలతతో వాగులు నిరంతరం నీటితో పారుతూ మిగులు జలాలను గోదావరిలోకి మోసుకెళ్తాయి. ఈ నేపథ్యంలో గోదావరిలోకి తరలిపోయే వృథానీటిని ఒడిసిపట్టేలా వాగులపై చెక్‌డ్యాం(ఆనకట్ట)ల నిర్మాణాన్ని 2019లో చేపట్టారు. జిల్లాలోని 5 సెగ్మెంట్ల పరిధిలో 75 ఆనకట్టలను నిర్మించవచ్చని గుర్తించగా ఇందులో 35 పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటివరకు 34 పనులు పూర్తికాగా మరో చెక్‌డ్యాం పని పూర్తిచేయాల్సి ఉంది. కొన్నిచోట్ల చెక్‌డ్యాంల కట్టలకు గత వానాకాలంలో భారీ వర్షాలతో గండ్లు పడగా మరమ్మతులు చేపట్టారు.



**మూడు టీఎంసీల నీటినిల్వ**

ఇప్పటికే పూర్తయిన చెక్‌డ్యాంలతో 3 టీఎంసీల నీటినిల్వ సాధ్యపడి 2,603 ఎకరాలకు నీరందే అవకాశం ఏర్పడింది. వాగుల అంతర్భాగంలోనే చెక్‌డ్యాంలను నిర్మించటం వల్ల నీరు కరకట్టల లోపలనే నిలువుండి ముంపు, భూసేకరణవంటి సమస్యలు ఏర్పడలేదు. జిల్లాలోని ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో చెక్‌డ్యాంలను నిర్మిస్తుండగా వాగుల్లో పారేనీటికి అడ్డుకట్టతో చాలావరకు నీరు వెనక్కి నిలువుండి వాగులకు ఇరువైపులా భూగర్భ జలమట్టం సాధారణస్థాయిలో కొనసాగుతుంది. భూగర్భ జలాలను, ఆనకట్టల్లోని నీటిని రైతులు మోటార్లద్వారా పంటలకు మళ్లించుకోవచ్చు. కట్టలకు ఇరువైపులా గ్రావిటీ కాలువలద్వారా రైతుల పంటపొలాలకు మళ్లించనున్నారు. వాననీటితో పాటు ప్రాజెక్టుల నుంచి వదిలేనీరు ప్రతి ఆనకట్టలోనూ ఐదారు మీటర్ల ఎత్తు వరకు నిలిచి చేపల పెంపకాన్ని చేపట్టే అవకాశముంది. ఈ నేపథ్యంలో చెక్‌డ్యాంల ఆపరేషన్ నిమిత్తం, గ్రావిటీ కాలువలు తదితరాలకు రూ.20 కోట్ల నిధులు కేటాయించాల్సి ఉంది. వచ్చే బడ్జెట్లో నిధులు కేటాయించి గుర్తించిన మరో 40 చెక్‌డ్యాంలను నిర్మించటం ద్వారా జిల్లావాసులకు ప్రయోజనం కలగనుంది.

జిల్లాలో నాబార్డు ద్వారా చేపట్టిన చెక్‌డ్యాంలు: 26

ఖర్చుచేసిన నిధులు: రూ.58.67కోట్లు

పనులు పూర్తయినవి: 26

స్టేట్‌ప్లాన్ ద్వారా చేపట్టిన చెక్‌డ్యాంలు:9

ఖర్చుచేసిన నిధులు: రూ.32.79కోట్లు

పనులు పూర్తయినవి:8

# నిర్వహణ లేక.. నిరుపయోగం!

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయిలో వాగు ఒడ్డున వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణం చేపట్టారు. రెండేళ్ల కిందట రోళ్లవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో కొట్టుకుపోయింది. ఇప్పటికీ మరమ్మతు లేక నిరుపయోగంగా ఉండగా కమ్మునూర్‌లో గోదావరి ఒడ్డున నిర్మించిన వైకుంఠధామం పరిస్థితి ఇదే.

సారంగాపూర్ మండలంలోని పోతారంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోయాయి. ప్రకృతి వనాలు ఊరికి దూరంగా ఉండడంతో నీటి వసతి లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉండగా, పంచాయతీలు దృష్టి సారిస్తే వినియోగంలోకి రానున్నాయి. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ సమస్యలతో నిరుపయోగంగా మారుతున్నాయి. జిల్లాలో 380 పంచాయతీలలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉపాధి హామీ పథకం నిధులతో



నిర్మాణాలు చేపట్టారు. పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. జిల్లాలో 90 శాతం వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయి. సెగ్రిగేషన్ షెడ్లలో తడి, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి పెట్టడంలేదు. పల్లె ప్రకృతి వనాలకు నిర్వహణ నిధులు లేకపోవడంతో నీటి వసతి కల్పించలేక పంచాయతీలు చేతులెత్తేశాయి. రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించిన నిర్మాణాలను పంచాయతీలు ప్రత్యేక దృష్టి సారించి ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

**కొరవడిన పర్యవేక్షణ**

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణకు గతంలో ఆకుపచ్చ, నీలం రంగు చెత్త బుట్టలు ఇంటింటికీ అందించారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. సెగ్రిగేషన్ షెడ్డులో చెత్తను వేరు చేయడమే కాకుండా సేంద్రియ ఎరువును తయారు చేయాల్సి ఉంటుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జనాభా ప్రాతిపదికన కార్మికుల నియామకం చేపట్టకపోవడంతో చెత్తను వేరు చేయడం ఇబ్బందిగా మారుతోంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి తగలబెట్టేస్తున్నారు.

పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలకు ఎరువులు వేయడం, నీటిని అందించడం చేయాలి. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహణకు నిధులు కేటాయించినప్పటికీ తరువాత రాకపోవడంతో నిర్వహణను వదిలేశారు. పలు పంచాయతీలు నిర్వహణ చేపట్టినా సమయానికి నిధులు రాకపోవడంతోనూ ఇబ్బందులు తలెత్తడంతో పల్లె ప్రకృతి వనాలు నిరుపయోగంగా ఉన్నాయి.

వైకుంఠధామాలు గ్రామాలకు దూరంగా ఉండడం. నీటి వసతి, విద్యుత్తు సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. సౌర విద్యుత్తు పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్కడా పనిచేసినట్లు కనిపించడం లేదు. పలువురు సొంత పొలాల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకుంటుండగా, కొన్ని వర్గాలు కేవలం ఖననం మాత్రమే చేస్తాయి. దీంతో వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి.

## సైబర్‌క్రైమ్ ఠాణా..
## సమయం దాటితే హైరానా

హైదరాబాద్: ఆపదలో ఉన్నా, అన్యాయం జరిగినా ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది పోలీస్‌స్టేషన్. అర్ధరాత్రి వెళ్లినా పోలీసులు ఆదుకుంటారని ప్రతి ఒక్కరికి భరోసా. అలాంటి ఠాణా లోపలికి వెళ్లడానికి, అధికారుల్ని కలవడానికి సమయం నిర్దేశిస్తే.. పరిస్థితేంటి? రాష్ట్రంలోనే అత్యధికంగా సైబర్‌క్రైమ్ కేసులు నమోదయ్యే సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో సరిగ్గా ఇదే జరుగుతోంది. ఈ ఠాణాలో ఇన్‌స్పెక్టర్లను కలిసేందుకు నిర్దేశిత వేళలు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. కేసు పురోగతి తెలుసుకోవడానికి, ఎఫ్ఐఆర్ ప్రతి తీసుకోవడానికి రోజూ సాయంత్రం 4- 6 గంటల మధ్య మాత్రమే రావాలని సిబ్బంది సూచిస్తున్నారు. పొరపాటున ఈ సమయం దాటితే ఫిర్యాదుదారులను లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. సైబర్ నేరాల్లో రూ.లక్షలు, రూ.కోట్లు పోగొట్టుకుని తిరిగి డబ్బు ఎప్పుడు వస్తుందోననే ఆశతో ఎంతో దూరం నుంచి వచ్చిన తమను సమయం మించిపోయిందని అడ్డకోవడమేంటని బాధితులు వాపోతున్నారు. దీని వెనుక ఓ అధికారి ఆదేశాలున్నట్లు సమాచారం.




**ప్రత్యామ్నాయం చూపకుండా నిబంధనేంటి?**

గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ఆవరణలోనే సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఉంది. సైబర్ నేరంలో రూ.50 వేల కంటే తక్కువ మొత్తంలో కోల్పోతే స్థానిక శాంతిభద్రతల పోలీస్‌స్టేషన్‌లో, అంతకంటే ఎక్కువ మొత్తంలో పోగొట్టుకుంటే సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైమ్ ఠాణాలో ఈ ఏడాది ఇప్పటివరకూ 9,400లకుపైగా కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఇతర పోలీస్ యూనిట్లతో పోలిస్తే ఇక్కడే అత్యధికంగా సైబర్ నేరాలు నమోదవుతున్నాయి. సైబర్ నేరాలపై ఫిర్యాదులకు ఎలాంటి ఆంక్షల్లేకున్నా కేసు పురోగతి వివరాలు తెలుసుకోవడానికి నిర్దేశిత సమయాలు పెట్టడం సమస్యగా మారింది. సాధారణ నేరాలతో సైబర్ నేరాల పరిస్థితి విభిన్నం. డబ్బు కోల్పోయాక సకాలంలో నేరస్థుల ఖాతాలు ఫ్రీజ్ చేసి బాధితులు పోగొట్టుకున్న డబ్బు తిరిగి వాపస్ ఇచ్చే విధానముంది. దీనికి పోలీసులు చట్టపరమైన ప్రక్రియ పూర్తిచేయడంతో పాటు కోర్టు అనుమతి, బ్యాంకులు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయడం ఇలా అనేక దశలుంటాయి. దీనికి రోజుల తరబడి సమయం పడుతోంది.

## ఆరోగ్య మహిళా కేంద్రాలకు నిరాదరణ

హైదరాబాద్ : గ్రేటర్‌లో మహిళల కోసం గతంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాల చిరునామా కన్పించడం లేదు. నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతి మంగళవారం మహిళలకు సేవలు అందేలా ఈ కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసింది. 90 యూపీహెచ్‌సీల్లో అందుబాటులోకి తెచ్చారు. వీటిపై ప్రచారం లేకపోవడంతో ఆదరణ కోల్పోయి.. ప్రస్తుతం అరకొరగా నడుస్తున్నాయి. మహిళల్లో వచ్చే జీవనశైలి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి చికిత్స అందించే ఉద్దేశంతో వీటిని ప్రారంభించారు. ముఖ్యంగా అధిక బరువు, ఊబకాయం, గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్లు, మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ ఇతర జీవనశైలి వ్యాధులకు ఈ కేంద్రాల్లో చికిత్సలందించేవారు. దీనివల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులను ముందే పసిగట్టి చికిత్సలు అందించడానికి వీలుంటుంది. రక్త ఇతర పరీక్షల కోసం శాంపిళ్లు సేకరించి వాటిని నారాయణగూడ తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపుతారు. రొమ్ము, నోటి, గర్భాశయ ముఖ క్యాన్సర్లకు సంబంధించి లక్షణాలు కన్పిస్తే...అలాంటి వారిని ఎంఎన్‌జే ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రికి పంపిస్తారు. అనంతరం ఉచితంగానే ఔషధాలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం సాధారణ ఓపీని నిర్వహిస్తున్నారు. జీవనశైలి వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించడం లేదని రోగులు చెబుతున్నారు.

**ఈ పరీక్షలు చాలా అవసరం...**

ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో చాలామందికి ఆరోగ్యంపై అవగాహన ఉండటం లేదు. మోనోపాజ్ తర్వాత హార్మోన్ల సమతుల్యతతో రకరకాల శారీరక సమస్యలు ఎదుర్కొంటున్నారు. మహిళల్లో క్యాన్సర్ల ముప్పు పెరుగుతోంది. ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఏటా 1500 రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. మరో 1200 వరకు గర్భాశయ క్యాన్సర్‌తో వైద్యులను సంప్రదిస్తున్నారు. ఇందులో 80 శాతం మంది వ్యాధి ముదిరే దశలో వస్తున్నారు. ముందే స్క్రీనింగ్ పరీక్షలు చేయడం ద్వారా ఈ రెండు క్యాన్సర్లను గుర్తించే అవకాశం ఉంది. తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నివారించే అవకాశం ఉంది. ఇక చాలామందికి బీపీ, షుగర్ లాంటి సమస్యలున్నప్పటికీ గుర్తించలేకపోతున్నారు. కొందరైతే ఏడాదికి ఒకసారి కూడా పరీక్షలు చేయించుకోవడం లేదు. అధిక రక్తపోటు కారణంగా కొన్నిసార్లు పక్షవాతం, గుండె జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది.

## వానర దండుతో ప్రజల బెంబేలు

మంథని : వానరాలతో మంథని పట్టణంతో పాటు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలు, రాత్రి.. రహదారులు, ఇళ్లు తేడా లేకుండా అవి సంచరిస్తుండటంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు.. వానరాల దాడుల్లో చాలా మంది గాయపడి ఆస్పత్రి పాలవుతున్నారు. మంథని–కాటారం, మంథని–ముత్తారం రహదారులకు ఇరువైపులా కోతులు తిష్ట వేయడంతో వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లేవారు భయాందోళనకు గురవుతున్నారు. పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. కోతుల బెడదతో కూరగాయలు.. ఇతర చిన్న పంటల సాగుదారులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు నష్టపోతున్నారు. **అటవీ ప్రాంతం కావడంతో..**మంథని నియోజకవర్గంలో గాడుదుల గండి గుట్ట సమీపంలో, మంథని–ముత్తారం ప్రాంతంలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉంది. ఇతర ప్రాంతాల నుంచి కోతులను తీసుకొచ్చి ఇక్కడ వదిలేస్తున్నారు. వాటికి అడవుల్లో ఆహారం దొరకక రోడ్లు.. గ్రామాల బాట పడుతున్నాయి. రోడ్ల వెంట వెళ్ళే పలువురు వాహనదారులు తినుబండారాలు, ఆహార పదార్థాలు వేస్తుండటంతో అవి ఆశగా అక్కడే ఉంటున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆహారం కోసం వాహనదారులపైకి వెళ్లడంతో వారు కిందపడి గాయాలపాలవుతున్నారు. కోతుల బెడదకు కిరాణ దుకాణదారులు రూ.వేలతో గ్రిల్స్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

**నివారణ చర్యలు** మంథని అటవీ డివిజన్ పరిధిలో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తే వానరాల బాధ కొంతైనా తగ్గుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు రహదారులపై తినుబండారాలు, ఆహార పదార్థాలు నిర్ణీత ప్రదేశాల్లో వేసేలా చర్యలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చు. అదే విధంగా మూగ జీవాలు బలికాకుండా చూడవచ్చు.

# ఏడాది దాటినా.. మట్టి, కంకరే!



తాండూరు : తాండూరు–చించోళి అంతర్ రాష్ట్ర రహదారిని కేంద్ర సర్కారు 2022లో జాతీయ రహదారిగా ప్రకటించింది. నిధులుకూడా మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఇప్పుడు 2024 డిసెంబరు. నేటికీ పూర్తిస్థాయిలో పనులు సాగక వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

**అన్ని విధాల ప్రయోజనమని ఆశిస్తే..**

తాండూరు–చించోళి మార్గం ఒకవైపు కర్ణాటక రాష్ట్రం మన్నెక్కెల్లి వద్ద ముంబయి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉంది. మరోవైపు మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ వద్ద బెంగళూరు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉంది. తాండూరు–చించోళి మార్గాన్ని జాతీయ రహదారులకు అనుసంధానం చేస్తే రాకపోకలకు మరింత సౌకర్యంగా మారుతుందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి నం.167 నిర్మించేందుకు 2022లో నిధులు మంజూరు చేసింది. వెంటనే పనులు చేపట్టారు. తొలుత పట్టణం, శివారులో గౌతాపూర్ నుంచి రాశులపురం దాకా తారు రోడ్ల విస్తరణ చేపట్టారు. ఇరువైపులా కాల్వల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఇందిరాచౌక్ సమీపంలో జాతీయ రహదారిపై మురుగు నీరు పారుతుండటంతో అపరిశుభ్రత నెలకొంది.

**తారు పనులకు తాత్సారం**

అల్లాపూర్ నుంచి కోటబాస్పల్లి వరకు నాలుగు వరసల రహదారి నిర్మించేందుకు ఒకవైపు పనులు మొదలయ్యాయి. పది కి.మీ. పొడవునా పనులు చేపట్టి కొంత ఎర్రమట్టి, కంకర పరిచారు. ఏడాది దాటినా తారు పనులు ప్రారంభించడం లేదు. వంతెన పనులు అసంపూర్తిగా ఉంచారు. రహదారి మధ్యలో కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు తొలగించాల్సి ఉండగా అమలు కాలేదు.

**నిత్యం 4,000కు పైగా వాహనాల రాకపోకలు**

ప్రతిరోజు 4వేలకుపైగా వాహనాల రాకపోకలు సాగిస్తుండగా అసంపూర్తి రహదారితో అవస్థలు పడుతున్నారు. సిమెంటు, నాపరాయి లారీలు, ట్యాంకర్ల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము లేస్తుండటంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. మట్టి, కంకర మీదుగా ప్రతిరోజు ట్యాంకర్లతో నీరు చల్లాల్సి ఉండగా గుత్తేదారు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే అల్లాపూర్, సిరిగిరిపేట, రాంపూర్, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి తదితర గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా పనులు వేగంగా నిర్వహించి తారు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

జాతీయ రహదారి నం.: 167
మంజూరైన నిధులు: రూ.631కోట్లు
దూరం: 42.5 కి.మీ.
ప్రదేశం: కొత్లాపూర్ నుంచి దుద్యాల వరకు
పనులు మొదలు: రెండు సంవత్సరాల క్రితం

# గోదారి ఇసుక తరలుతోంది

రాయికల్ : గోదావరి తీర గ్రామాలు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాలుగా మారాయి. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద ప్రారంభమయ్యే గోదావరి నది మల్లాపూర్, రాయికల్, సారంగాపూర్, ధర్మపురి మండలాల మీదుగా ప్రవహిస్తోంది. నదిలోని ఇసుకను రోజంతా ట్రాక్టర్లలో రహస్య ప్రాంతంలో నిలువ చేసి రాత్రి వేళల్లో టిప్పర్లలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు నిర్మల్, నిజామాబాద్ పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడపాదడపా పోలీసులు, రెవెన్యూ అధికారులు టిప్పర్లు, ట్రాక్టర్లను పట్టుకుంటున్నప్పటికీ ఇసుక దందాను నియంత్రించలేకపోతున్నారు. ప్రస్తుత కలెక్టర్ బాధ్యతలు చేపట్టినప్పుడు ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపగా తర్వాత పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు మామూళ్లతో సరిపుచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి.

**టిప్పర్లలో పట్టణాలకు తరలింపు**

మండలంలోని ఒబులాపూర్, పాతదాంరాజుపల్లి, వాల్గొండ, వెంకట్రావుపేట గ్రామ శివారులోని గోదావరి తీర ప్రాంతాల్లో రోజంతా ఇసుకను ట్రాక్టర్లతో తీసుకొచ్చి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళ జేసీబీల సాయంతో ఇసుకను టిప్పర్లలో లోడ్ చేస్తూ పట్టణ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. మైనింగ్‌శాఖ అధికారులు ఇసుక రీచ్‌లను గుర్తించకపోవడం ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నిత్యం వందల సంఖ్యలో ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న గోదావరి తీర ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీ వేలం నిర్వహిస్తున్నప్పటికీపోలీసులు మౌనంగా ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**కేసులు నమోదు చేసినా..**

మండలంలోని కోమటి కొండాపూర్, ఎర్దండి గ్రామాల్లోని గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున ఇసుకను ట్రాక్టర్లలో నింపి ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. గత నెలలో కోమటి కొండాపూర్ గ్రామంలో పలు చోట్ల ఇసుక డంపులు, ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రాలీలను రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. ఇసుకను సీజ్ చేసి, కేసు నమోదు చేసినప్పటికీ మళ్లీ ఇసుకను అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని, తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ట్రాక్టర్‌కు రూ.3 వేలు**

రాయికల్ మండలంలోని బోర్నపల్లి, జగన్నాథపూర్ గోదావరి తీరం, మూటపల్లి, కొత్తపేట, ఇటిక్యాల పెద్దవాగు, చింతలూరు అటవీ ప్రాంతాల నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. రాత్రి అయితే చాలు అక్రమార్కులు ఇసుకను గ్రామాలు అక్కడి నుంచి పట్టణాలకు తరలిస్తున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టరు రూ.2000 నుంచి రూ.3000 వరకు విక్రయించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అనాధికారికంగా వేలం వేసి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. గతంలో మాదిరి తహసీల్దారు కార్యాలయాల్లో గృహ నిర్మాణాలకు ఇసుక తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.

**ఎల్లంపల్లి నీటితో ఇబ్బంది..**

ధర్మపురి మండలంలో గోదావరి తీర ప్రాంతంలో గతంతో పోలిస్తే ఇసుక అక్రమ రవాణా తగ్గుముఖం పట్టింది. నదీ తీర గ్రామాల్లో ఎల్లంపల్లి నీరు ధర్మపురి ఎగువ ప్రాంతం వరకు ఉండటమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. నీరు అధికంగా ఉండటంతో వాహనాలు లోపలికి వెళ్లకపోవడం, అధికారుల నిఘా పెరగడం, నిల్వఉంచిన ఇసుకనే దళారులు గుట్టు చప్పుడు కాకుండా అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక నిలువలు కూడా ఒకటి రెండు గ్రామాల్లోనే ఉన్నాయి. జిల్లా కలెక్టర్ పలు చోట్ల దాడులు చేసి ఇసుక డంపులను పెద్ద ఎత్తున స్వాధీన పరచుకున్నారు. మండలంలోని ఒక గ్రామంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించినా, ఇసుకను తీసుకోవడానికి, ఆన్‌లైనులో దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపలేదు. గతంలో ఉదయం, పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగేది.

**టిప్పర్‌కు రూ.10 వేలు**

గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలింపు నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. బీర్‌పూర్ మండలంలో రంగసాగర్, మంగెళ, కమ్మునూర్, చిత్రవేణిగూడెం, రేకులపల్లె, చిన్న కొల్వాయి మీదుగా గోదావరి ప్రవహిస్తుంది. ఆయా గ్రామాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని చిన్న కొల్వాయి కేంద్రంగా ఇసుక అక్రమ తరలింపు వ్యాపారంగా మారింది. ట్రాక్టర్ యజమానులు పొద్దంతా ఇసుకను ఒడ్డుకు చేర్చితే రాత్రి కాగానే టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు. టిప్పర్ నింపి పంపితే ట్రాక్టర్ యజమానికి రూ.10 వేల వరకు చెల్లిస్తున్నారు. దీంతో ట్రాక్టర్ యజమానులే దగ్గరుండి ఇసుకను టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

# తాళం వేశారు.. అక్రమాలు మూసేశారు

హైదరాబాద్: ప్రభుత్వ భూములను ఆక్రమించి జీవో నంబర్ 59తో క్రమబద్ధీకరించుకోవాలని యత్నించిన అక్రమార్కులకు చెక్‌పెట్టేందుకు వారి దరఖాస్తులు ఆమోదించేందుకు వీల్లేకుండా సర్కారు తాళం వేసింది. రెవెన్యూ ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలు బాగానే ఉన్నా.. భూ కబ్జాదారులు ఎన్ని ఎకరాలు ఆక్రమించుకున్నారు? ఎవరు సహకరించారు? క్రమబద్ధీకరించుకునేందుకు రూ.కోట్లలో రెగ్యులరైజేషన్ రుసుం ఎలా చెల్లించారు? అన్న అంశాలపై ఇప్పటికీ విచారణ చేపట్టలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి తాఖీదులు, విచారణలు లేకపోవడంతో కొందరు అక్రమార్కులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, గండిపేట్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్ మండలాల్లో జీవో నంబర్ 59 క్రమబద్ధీకరణలో పలు అక్రమాలు జరిగాయి.

**జీవో నంబర్ 59 దుర్వినియోగం**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నవారికి ఆయా స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు జీవో నంబర్ 59 ద్వారా కల్పించిన అవకాశాన్ని కొందరు భూ కబ్జాదారులు అక్రమాలకు వినియోగించుకున్నారు. 125 చదరపు గజాల కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తే వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న నిబంధనను అనువుగా మార్చుకున్నారు. రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం రుసుం చెల్లించాలని, రుసుంను మూడు వాయిదాల్లో చెల్లించేందుకు సర్కారు




అంగీకరించింది.

**ఎకరాల్లో తాత్కాలిక నిర్మాణాలు..**

రిజిస్ట్రేషన్ సొమ్మును ఎలాగూ చెల్లిస్తున్నాం కదా అనుకున్న భూ కబ్జాదారులు రోజుల వ్యవధిలో ప్రణాళికను అమలు చేశారు. గండిపేట, శేరిలింగంపల్లి మండలాల్లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారు. కోకాపేటలో చిన్న, చిన్న డబ్బాలను నిర్మించి కొందరు పేదల పేర్లతో గతేడాది మార్చిలో దరఖాస్తులు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ దరఖాస్తులను ఆమోదించారు. ఈ ఏడాది మార్చిలో రంగారెడ్డి కలెక్టర్ కె.శశాంక దరఖాస్తుల ఆమోదంలో అక్రమాలున్నాయని గుర్తించి క్రమబద్ధీకరణను రద్దు చేశారు. కోకాపేటలో మాత్రమే ఆక్రమణలు ఆగిపోగా... మిగిలిన ప్రాంతాల్లో దరఖాస్తులు అలాగే ఉన్నాయి.

# ఖర్చు భరించేదెట్లా..!

నాంపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో ప్రచారం ఊపందుకుంటోంది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం సైతం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసిన యంత్రాంగం బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో పల్లెపోరుపై గ్రామాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మునుగోడు ఉపఎన్నిక, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఆయా పార్టీల తరఫున ఇంటింటికీ వెళ్లి స్థానిక నాయకులే విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశారు.

**గతం తలచుకుంటే గుబేల్**

ఇప్పుడు సర్పంచి ఎన్నికల్లో తమవంతు వచ్చింది. ఆ ఖర్చును ఎలా గట్టెక్కాలా.. అంటూ సర్పంచి ఆశావహులు ఆందోళన చెందుతున్నారు. ఆయా ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థులు స్థానిక నాయకుల చేతుల మీదుగానే ఖర్చు చేయించారు. డబ్బు, మద్యం పంపిణీ వారి ఆధ్వర్యంలోనే సాగింది. ఇప్పుడు సర్పంచి ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ ఖర్చు తల్చుకొని బెంబేలెత్తిపోతున్నారు.



మునుగోడు ఉప ఎన్నిక అత్యంత ఖరీదైన ఎన్నికగా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం కాగా.. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ అభ్యర్థులు భారీ మొత్తంలో ఖర్చు చేసినట్లు అంచనా. నామినేషన్ వేసింది మొదలు పోలింగ్ రోజు వరకు ప్రచార ఖర్చు, కార్యకర్తలకు భోజనాలు, మద్యం, ప్రచారానికి రోజువారి కూలీ చెల్లించి జనాన్ని రప్పించడం, చివరికి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి తాయిలాలు, డబ్బు పంపిణీ, ముఖ్య నాయకులు, అనుచరుల అలకలు తీర్చేందుకు అ'ధన'పు చమురు ఇలా మొత్తం తడిసి మోపెడయింది. ఖర్చంతా అభ్యర్థులే భరించినా.. డబ్బు వెళ్లింది మాత్రం స్థానిక నాయకుల చేతుల మీదుగానే. ఇప్పుడు సర్పంచి బరిలో నిలిస్తే జనాన్ని ఓట్లడగాలంటే.. ఏమిస్తావని ప్రజలు అడిగే అవకాశముందని భావిస్తున్నారు.

**పెరిగిన అంచనాలు**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1770 గ్రామ పంచాయతీలున్నాయి. సర్పంచిగా పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు చిన్న గ్రామాల్లో కనీసం రూ.25 లక్షలు, పెద్ద గ్రామాల్లో అయితే రూ.40 నుంచి రూ.50 లక్షలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితులున్నాయి. మండలకేంద్రాల్లో అయితే రూ.కోటి నుంచి కోటిన్నర వరకు ఖర్చు తప్పదని ఆశావహులే పేర్కొంటున్నారు. ఇటీవలి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ఖర్చు వీరిని కలవర పెడుతోంది. గత శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థుల తరఫున పెత్తనం చేసిన నాయకులు చూపిన బాటలోనే ప్రస్తుతం ఓటర్లు నడుస్తామంటున్నారు. ఆ ఎన్నికల్లో ఓటుకు ఇంతిచ్చారు.. ఇప్పుడెంతిస్తారో చూద్దాం.. అనే చర్చలు గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. అప్పుడు పెత్తనం చేసిన చేతులే ఇప్పుడు స్వయంగా ఓట్లడగాల్సి ఉంటుంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలంటే ఎంత ఖర్చు చేయాలో అంటూ ఆశావహులు వాపోతున్నారు.

## అభివృద్ధి చేసి.. నిర్లక్ష్యంగా వదిలేసి

నల్గొండ: పులిచింతల ప్రాజెక్టు నిర్మాణంలో పాక్షికంగా ముంపునకు గురైన మట్టపల్లిలో బాధితులకు పునరావాసం కల్పించేందుకు 2005లో 106 కుటుంబాల కోసం సర్వే సంఖ్య 540లో 10.20 ఎకరాలు కేటాయించారు. 2013లో ఇక్కడ సుమారు రూ.2 కోట్లతో కనీస వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, సామాజిక భవనం, గ్రామ పంచాయతీ కార్యాలయం వంటి నిర్మాణాలు పూర్తి చేశారు. విద్యుత్తు లైన్లు, వీధి దీపాలు, నియంత్రికలు ఏర్పాటు చేశారు. మునక జాబితాలో ఉన్న వారి ఇళ్లకు పరిహారం సైతం అందజేసి అభివృద్ధి చేసిన పునరావాస కేంద్రంలో ఇళ్లు కట్టుకునేందుకు స్థలాలను కేటాయించారు. కాగా అప్పట్లో బాధితులు స్వగ్రామాన్ని విడిచి వచ్చేందుకు అసక్తి చూపక పోవడంతో దశాబ్ద కాలంగా పునరావాస కేంద్రం పడావు పడింది. కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. సీసీ రహదారులు, డ్రైనేజీలు శిథిలమయ్యాయి. ప్రభుత్వ భవనాలు పగుళ్లతో రూపురేఖలు కోల్పోయాయి. భవనాల్లోని ఫ్యాన్లు, దర్వాజాలు, కిటికీలు చోరీకి గురయ్యాయి.

ఇదీ బాధితుల డిమాండ్.. శ్రీలక్ష్మీనృసింహుని క్షేత్రంలో అర్చకులతో పాటు ఇక్కడే జీవనోపాధి పొందుతున్న స్థానికులు స్వగ్రామాన్ని విడిచి 4కి.మీ.లకు పైగా దూరంలో ఉన్న పునరావాస కేంద్రానికి రావడానికి ఇష్టపడటం లేదు. ఈ కారణంగానే ఇప్పటి వరకు ఒక్క ఇల్లూ నిర్మించుకోలేదు. ప్రస్తుతం ఉంటున్న గ్రామంలోని పైభాగంలో సర్వే నం.1లో తమకు స్థలాలు ఇవ్వాలని దశాబ్ద కాలంగా ముంపు బాధితులు కోరుతున్నారు. స్థానికులంతా ఒకే చోట ఉంటామని, రెండు గ్రామాలుగా ఎలా ఉంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పునరావాస కేంద్రానికి వెళ్లేది లేదని తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం తమ విషయంలో న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. వారి ఆదేశాల మేరకే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

చురకలు



# అభివృద్ధి చేస్తే.. ఆధ్యాత్మిక పర్యాటకం సాకారం

సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి కొలువుదీరిన సింహాచలం క్షేత్రం ఆధ్యాత్మిక వైభవంతో భక్తులను.. చారిత్రక ప్రాంతాలతో పర్యాటకులను అలరిస్తోంది. ప్రధాన ఆలయంతో పాటు ఉత్తర దిక్కున ఉన్న శతాబ్దాల నాటి వైకుంఠవాసుల మెట్ట, శ్రీకృష్ణ దేవరాయలవిజయ స్థూపం చారిత్రక ఆనవాళ్లుగా శోభిల్లుతున్నాయి. ఇటీవల వైకుంఠవాసుల మెట్ట దరి కొండ శిఖరంపై నూతనంగా ఏర్పాటు చేసిన శంఖ చక్రాలు, తిరునామాల విద్యుద్దీపాలంకరణ భక్తులకు ప్రధాన సందర్శన ప్రాంతంగా మారిపోయింది. సుమారు 800 అడుగుల ఎత్తైన కొండపై నుంచి దిగువన ఉన్న ప్రాంతాల విహంగ వీక్షణకు ఆదరణ లభిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రాంతాల గురించి విస్తృతంగా ప్రచారం జరగడంతో సందర్శకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఇటీవల పలువురు యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్లు డ్రోన్ కెమెరాలతో ఈ ప్రాంతాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించారు. దీంతో ఈ వ్యూపాయింటుకు సందర్శకుల



తాకిడి విపరీతంగా పెరిగింది.

**వసతులు మెరుగు పరిస్తే అద్భుతమే..**

ఒకే మార్గంలో ఉన్న ఈ ప్రాంతాలలో వసతులు మెరుగుపరిస్తే ఆధ్యాత్మిక పర్యాటకం సాకారమవుతుందని పలువురు సందర్శకులు పేర్కొన్నారు. సింహగిరి ఘాట్రోడ్డులో కొండపైన లోవతోట సమీపం నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లే మార్గం ఉంది. సుమారు 35ఏళ్ల క్రితం మైక్రోవేవ్ స్టేషన్ కోసం ఈ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైపోయింది. ప్రధానంగా కేశఖండ నశాల వెనుక ప్రాంతంలో కొండ మలుపు వద్ద రోడ్డు సందర్శకులను కట్టిపడేస్తుందంటే అతిశయోక్తి కాదు. కొండ గుహను తలపించేలా ఉండే రోడ్డులో ప్రయాణం సందర్శకులకు మరపురాని అనుభూతిని కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేసి చరిత్రను తెలియజేసే విధంగా వివరాలు పేర్కొంటే బాగుంటుందన్నారు. వ్యూపాయింట్లు నిర్మించి భద్రతా ఏర్పాట్లు చేస్తే అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత అద్భుత మధురస్మృతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, ప్రభుత్వం దిశగా ఆలోచనలు చేయాలని కోరుతున్నారు.

# అక్రమార్కులకు బన'వాసి'

ఎమ్మిగనూరు: సారవంతమైన నేల.. వందల ఎకరాలు ఖాళీగా ఉంది.. ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పలుకుతోంది.. పక్కనే తుంగభద్ర దిగువ కాల్వ ప్రవహిస్తోంది.. ఇంకేముంది అక్రమార్కులు కన్నేశారు.. రెండు వందల ఎకరాలకు వరకు ఆక్రమించి ఎంచక్కా పంటలు సాగు చేసుకొంటున్నారు.. పరిరక్షించాల్సిన పశు సంవర్ధకశాఖ అధికారులు తాఖీదులతో సరి పెట్టారు. సర్వే చేయాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.. కలెక్టర్ స్పందిస్తే తప్ప విలువైన భూములకు రక్షణ కంచె పడే పరిస్థితి కనిపించడం లేదు.

**స్పందించని రెవెన్యూ శాఖ**

ఇటీవల మరికొందరు ఆక్రమించే ప్రయత్నం చేశారు.. భూముల్లో ముళ్ల పొదలు తొలగించి చదును చేశారు. స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో పశు సంవర్ధకశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 115 మందికి తాఖీదులు ఇచ్చి సరి పుచ్చారు. సర్వే చేయాల్సిందిగా పశు సంవర్ధకశాఖ రెవెన్యూ అధికారులకు రెండు నెలల కిందట విన్నవించారు.. వారంలో పూర్తి చేస్తామని చెప్పారు.. ఇప్పటి వరకు కొలతలు వేయలేదు..



రూ.కోట్ల విలువైన భూములకు కంచె వేయకుంటే మరింత ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉంది... ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేసి రక్షణ కంచె బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఖాళీ స్థలంపై కన్నేశారు**

ఎమ్మిగనూరు మండలం బనవాసిఫారానికి సంబంధించి రెండువేల ఎకరాల పొలం ఉంది. ఇక్కడ గతంలో పశుక్షేత్రం ఏర్పాటు చేశారు. దేశంలో పేరుగాంచిన గేదెలు, ఆవులను పెంచేవారు. తర్వాత కనుమరుగైంది.. ఆ భూములన్నీ బీడుగా మారాయి.

ఐదువందల ఎకరాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, ఆతోట కేంద్రం, పశు సంవర్ధకశాఖ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

మిగిలిన భూములు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ స్థలంలో అటవీశాఖ రూ.2 కోట్లు వెచ్చించి మొక్కలు నాటించింది. సంరక్షణ లేకపోవడంతో వాడిపోయాయి.

**అక్రమంగా నీటి మళ్లింపు**

బీడుగా ఉన్న బనవాసిఫారం భూముల్లో పరమాన్‌దొడ్డి, నక్కలమిట్ట, వెంకటగిరి, బోడబండ, మల్కాపురం, బనవాసి, చెన్నాపురానికి చెందిన కొందరు పాగా వేశారు.

భూముల మధ్య భాగం నుంచే తుంగభద్ర దిగువ కాల్వ వెళ్లోంది.. ఆ నీటిని మళ్లించుకొని మిరప, పత్తి, మొక్కజొన్న, వేరుసెనగ వంటి పంటలు సాగు చేస్తున్నారు.

సమీపంలో ఎకరా భూమి కౌలు తీసుకోవాలంటే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.బనవాసిఫారం భూములు సారవంతమైనవి కావడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి.

ఈ భూముల పక్కనే జాతీయ రహదారి వెళ్లోంది.. రహదారి పక్కన అయితే ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. లోపల రూ.30 లక్షల వరకు పలుకుతోంది.

# నైపుణ్య కౌశలం.. కొలువుల సౌరభం



పత్తికొండ : నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంచి, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో శిక్షణ నైపుణ్య కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ హబ్) ఏర్పాటు చేశారు. పేద, మధ్య తరగతి యువతకు ఉపయుక్తంగా ఉంది. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పూర్తిచేసిన గ్రామీణ ప్రాంత యువతీ యువకులు కంప్యూటర్ ఇతర నైపుణ్య శిక్షణ పొందేందుకు దూరప్రాంతాలకు వెళ్లాలంటే వారికి సవాలే. కర్నూలు జిల్లాలో మొత్తం 8 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరవుకు నిలయమైన పత్తికొండ లాంటి వెనుకబడిన ప్రాంతంలో వందలాది మంది గ్రామీణ విద్యార్థులు చదువుకు మధ్యలోనే స్వస్తి పలుకుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. మరి కొందరు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ స్వయం ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా శిక్షణ కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టాయి.

**స్థానికంగానే తర్ఫీదు**

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెండేళ్ల కిందట ప్రారంభమైన స్కిల్ హబ్‌లో పది, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18–40 ఏళ్ల నిరుద్యోగులకు శిక్షణ కొనసాగుతోంది. కంప్యూటర్ శిక్షణలో డేటా ఎంట్రీ, ఎంఎస్ ఆఫీస్, కమ్యునికేషన్ స్కిల్స్, సీఆర్ఎం డొమెస్టిక్, ఆంగ్ల వ్యాకరణంలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటి వరకు 250 మందికి పైగా శిక్షణ పూర్తిచేశారు. శిక్షణ పూర్తిచేసిన వారు నాలుగు సార్లు నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆయా సంస్థలు, లిమిటెడ్ కంపెనీల్లో వంద మందికి పైగా ఉద్యోగాల్లో చేరారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా కర్నూలు, అనంతపురం, గుంతకల్లు, ఆదోని లాంటి ప్రాంతాల్లోనే పలువురు కొలువులు పొందారు.

**బయట రూ.వేలు ఖర్చు చేయాలి- వీణ, విరుపాపురం, డిగ్రీ తృతీయ సంవత్సరం**

కళాశాలలో డిగ్రీ చదువుతూనే మధ్యాహ్నం వేళలో కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నా. మా నాన్న కృష్ణ రైతు. రోజూ విరుపాపురం నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నా. బయట కంప్యూటర్ కోర్సు నేర్చుకోవాలంటే.. వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కళాశాలలోనే స్కిల్‌హబ్ కేంద్రంలోనే అవకాశం సద్వినియోగం చేసుకుంటున్నా. ప్రస్తుతం ఏ చిన్న ఉద్యోగానికి వెళ్లాలన్నా కంప్యూటర్‌పై అవగాహన తప్పనిసరి. నేర్చుకున్న మెలకువలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి.

**ఆంగ్లంపై పట్టుతో..- పవిత్ర, డిగ్రీ తృతీయ సంవత్సరం, పత్తికొండ**

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూనే.. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నా. నా భర్త ప్రైవేటు ఉద్యోగి. ప్రస్తుతం ఇద్దరు సంపాదిస్తేనే కుటుంబం గడుస్తుంది. కంప్యూటర్‌తో పాటు ఆంగ్ల భాషలో కఠినంగా అనిపించే గ్రామర్ ఎంతగానో దోహదపడుతోంది. ఆంగ్లంపై పట్టు ఉంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు.

**శిక్షణతోనే కొలువుకు ఎంపిక- చిరంజీవి, హొసూరు**

అమ్మానాన్న లక్ష్మి, మురళి వ్యవసాయ కూలీలు. కంప్యూటర్ విభాగంలో పట్టు సాధించా. గత నెలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఉద్యోగానికి ఎంపికయ్యా. మన చేతిలో నైపుణ్యం ఉంటే.. ఎక్కడైనా కొలువు దక్కుతుందనేది తెలిసింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పటి నుంచే ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది. ఉపాధితో ముందుకు సాగొచ్చు.

**రెండేళ్లలో 260 మందికి శిక్షణ- అల్తాఫ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయకర్త, పత్తికొండ**

పత్తికొండలో రెండేళ్ల కిందట ప్రారంభమైన నైపుణ్య శిక్షణలో భాగంగా 13 బ్యాచ్‌లకు సంబంధించి 250 మందికిపైగా శిక్షణ ఇచ్చాం. పత్తికొండ చుట్టు పక్కల మండలాల నుంచి శిక్షణకు వస్తున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారిలో పలువురికి ఉద్యోగమేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. మరి కొంత మంది త్వరలో ఉద్యోగాల్లో చేరనున్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. త్వరలో మరో బ్యాచ్ ప్రారంభం కానుంది. యువత సద్వినియోగం చేసుకోవాలి.

# చేపల పెంపకం..అక్రమాల పంపకం



పాణ్యం : సంపాదనే ధ్యేయంగా కొందరు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. అక్రమంగా చెరువులు తవ్వి.. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తూ చేపలు పెంపకం చేపడుతున్నారు. గడివేముల మండలం గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది, దుర్వేశి గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో చేపల చెరువులు తవ్వారు.. చాగలమర్రి మండలంలోనూ పెద్దఎత్తున చేపల పెంపకం కొనసాగిస్తున్నారు. చేపల పెంపకానికి మత్స్య, రెవెన్యూ, విద్యుత్తుశాఖల అధికారుల అనుమతులు ఉండాలి. చాలా చోట్ల అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారు. నదిలో నీటిని వాడుకుంటూ.. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారు. చేపలకు ప్రత్యేక దాణా వేయాలంటే ఖర్చవుతుందని భావించి.. కోడి మాంసం వ్యర్థాలు వేస్తున్నారు. వీరి అక్రమాల కారణంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడటంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**విద్యుత్తు చౌర్యం.. అక్రమ నీటి వినియోగం**

చేపల చెరువుల కోసం ప్రత్యేకంగా విద్యుత్తు కనెక్షన్లు తీసుకోవాలి. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని కుందూనది నుంచి అక్రమంగా నీటిని తోడేస్తున్నారు. విషయం తెలిసినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యజమానుల నుంచి డబ్బులు తీసుకుని కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న చేపల చెరువుల యజమానులకు సుమారు రూ.8 లక్షల జరిమానా విధించారు.

**రొయ్యలూ పెంచేస్తున్నారు**

గడిగరేవుల గ్రామ పరిధిలో రొయ్యల సాగు అక్రమంగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే రొయ్యలు పెంచుతున్నారు. దీని గురించి మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. జిల్లాలో రొయ్యల సాగుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇక్కడ మాత్రం నాలుగేళ్లుగా సాగు చేపడుతున్నా.. ఇంతవరకు అధికారులు ఇటువైపు తొంగిచూసిన దాఖలాల్లేవు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

చేపలకు దాణాగా మిల్లెట్, వేరుసెనగ చెక్క, జొన్నపిండి, మొక్కజొన్నపిండి, తవుడు వంటి పదార్థాలు వేయాల్సి ఉంది. వీటి ధర అధికంగా ఉందని చేపల పెంపకందార్లు అడ్డదారులు తొక్కుతున్నారు.

చికెన్ దుకాణాల్లో లభించే కోడిమాంసం వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను చేపలకు ఆహారంగా వేస్తున్నారు.

కుళ్లిపోయిన వ్యర్థాలు తిన్న చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కోళ్ల వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేకంగా ఒక ముఠా తయారైంది.

నంద్యాల పట్టణంలోని గొర్రెల సంత వద్ద అడ్డా ఏర్పాటు చేసుకొని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. అధికారుల కళ్ల ముందే ఈ దందా జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**తాఖీదులు జారీ చేశాం : వీరరాఘవరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి**

జిల్లాలో రొయ్యల పెంపకం కోసం ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. చేపల చెరువుల్లో కొన్నింటికే అనుమతులు ఉన్నాయి. అక్రమంగా చేపలు పెంచుతున్న వారికి స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు ఇచ్చాం. చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేయరాదు. వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

# భూవిలువ సవరణకు సన్నద్ధం


కర్నూలు : వైకాపా హయాంలో భూములు, స్థలాల విలువలు అడ్డగోలుగా పెంచారు. మార్కెట్ విలువ కంటే తక్కువగా ఉండాల్సింది పోయి రెండు నుంచి మూడు రెట్ల వరకు భారం మోపారు. వాటిని సవరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 1వ తేదీన సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్నిచోట్ల 10 శాతం నుంచి 15 శాతం వరకు భూముల విలువలు పెరిగే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు, బేతంచెర్ల పురపాలక సంఘాలు ఉన్నాయి. కుడా పరిధిలో 53 మండలాలు, 896 గ్రామాలున్నాయి. అర్బన్, గ్రామీణ కమిటీ సూచనల ఆధారంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూముల విలువలు సవరించనున్నారు. అర్బన్ కమిటీ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తుండగా జడ్పీ సీఈవో, పురపాలక కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉన్నారు. రూరల్ కమిటీకి ఆర్డీవోలు ఛైర్మన్‌గా, సభ్యులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కన్వీనర్లుగా సబ్ రిజిస్ట్రార్లు వ్యవహరిస్తున్నారు. భూములు, స్థలాల విలువల సవరణకు రంగం సిద్ధమవుతున్న ఈ నేపథ్యంలో జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌ఛార్జి జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి శుక్రవారం నగరంలోని కార్యాలయంలో కర్నూలు జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఏ ప్రాంతంలో ఎంతమేర పెంచాలన్న అంశంపై చర్చించారు. అనంతరం కమిటీ సభ్యుడైన జడ్పీ సీఈవో నాసరరెడ్డిని కలిసి ప్రతిపాదనల నివేదికలో సంతకం తీసుకున్నారు. ఈనెల 25న చివరిగా జేసీతో సమావేశమై భూములు, స్థలాల సవరణకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాల్లో అడ్డగోలుగా పెంచిన భూములు, స్థలాల విలువలు తగ్గే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.



# పన్నుల పక్కదారికి చెక్

ఆళ్లగడ్డ : పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. పన్నుల వసూలులో పారదర్శకత ఉండేలా నగదు రహిత చెల్లింపుల విధానం అమలుకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల పేరిట యూనియన్ బ్యాంకులో ప్రత్యేక ఖాతాలు తెరిపించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏటా రూ.80 కోట్ల వరకు పన్నులు వసూలు చేస్తున్నారు.. వాటికి లెక్కా పత్రం లేకుండా పోయింది. కొందరు సిబ్బంది స్వాహా చేస్తున్నారు. ఆలూరు మేజరు పంచాయతీలో గతంలో ఇంటి, నీటి కుళాయి పన్నుల రూపంలో వచ్చిన రూ.32 లక్షల్ని ఉద్యోగి సొంతానికి వాడేశారు. పత్తికొండ మేజరు పంచాయతీలోనూ గతంలో ఒక ఉద్యోగి ఏకంగా రూ.40 లక్షల పంచాయతీ ఆదాయాన్ని పక్కదారి పట్టించారు. అధికారులు విచారణ జరిపి అందులో రూ.30 లక్షల వరకు రికవరీ చేశారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో నగదు



రహిత చెల్లింపుల ప్రక్రియకు స్వీకారం చుట్టారు. క్యూఆర్ కోడ్, పీవోఎస్ పరికరాలను పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారు. అయిదువేల మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలకు రెండు, తక్కువ ఉన్న గ్రామాలకు ఒకటి చొప్పున క్యూఆర్ కోడ్, పీవోఎస్ పరికరాలను అందించారు. ఇంటి, కుళాయి పన్నులు, ఇంటి ప్లానింగ్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల రుసుముతో పాటు ఇతర వాటికి డిజిటల్ పద్ధతిలో వసూలు చేస్తారు." గతంలో డిజిటలైజేషన్ చెల్లింపుల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా చేపట్టలేకపోయాం. ఈసారి మాత్రం అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని" కర్నూలు డీపీవో భాస్కర్ పేర్కొన్నారు.

# పల్లె సీమలకు స్వచ్ఛత

కర్నూలు : పల్లె సీమలు ఆహ్లాదకరంగా ఉండేలా.. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే 'పల్లె పండగ' పేరుతో గ్రామీణ ప్రాంతాలకు చక్కటి రహదారి వసతి కల్పించగా.. ప్రస్తుతం 'స్వచ్ఛత' కార్యక్రమానికి అడుగులు వేసింది. ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 18వ తేదీన కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

**ప్రతి నెలా మూడో శనివారం**

ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

మొదటగా ఈనెల 18న నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. పట్టణాలు, పల్లెలు, పంచాయతీలతోపాటు పాఠశాల లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ముళ్ల పొదలు, చెత్తాచెదారాలు, వ్యర్థాలు తొలగించాలి. ప్రధాన రహదారుల వెంట పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. కాల్వలు శుభ్రం చేయాలి. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల పరిశుభ్రతపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించాలి.

కలసికట్టుగా ముందుకు

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్'లో భాగంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు వివిధ రంగాలను భాగస్వాములుగా చేయాలి. పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, జడ్పీ, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు భాగస్వాములవ్వాలి.

**గతంలో నిధుల పక్కదారి**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు విడుదలైన ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించింది. గ్రామాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ఫలితంగా జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో 2024–25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు రూ.66.22 కోట్లు పంచాయతీ ఖాతాలకు నేరుగా జమయ్యాయి. ఈ నిధులతో పల్లెల్లో కనీస వసతులు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది.

# రేషన్ బండి.. అంతా తొండి

కర్నూలు : బియ్యం బండి ఇంటికి రావడం లేదు.. ఇంటింటికి వచ్చినట్లు ఆపరేటర్లు లెక్కలు రాసుకొంటున్నారు.. ప్రతి నెలా రూ.1.60 కోట్ల వరకు బిల్లులు తీసుకుంటున్నారు. ఆహారభద్రతా చట్టం ప్రకారం రేషన్ డీలర్లు సరకులు పంపిణీ చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వం పూర్తి అధికారాలను ఆపరేటర్ల చేతికి అప్పగించింది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకులు ఇంటింటికి అందిస్తున్నట్లు గొప్పలు చెప్పారు. ఆపరేటర్లు రేషన్ దుకాణాల వద్దే కూర్చొని కానిచ్చేస్తున్నారు.. మరికొందరు డీలర్లకే బాధ్యత అప్పగించారు. ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారులకు సరకులు అందించినా.. అందించకపోయినా ప్రతి నెలా వారి ఖాతాల్లో రూ.21 వేల చొప్పున జమ చేసేస్తుండటం గమనార్హం.!!

కొరవడిన పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో ఎండీయూ ఆపరేటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పౌరసరఫరాల అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాల ఉప తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు.. ఇలా ఏ ఒక్కరూ వాహనాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేయడం మినహా రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఇటు ఎండీయూ ఆపరేటర్లు, అటు డీలర్లు ఇద్దరూ కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటున్నారు.

ఏటా రూ.19.15 కోట్ల ఖర్చుకర్నూలు జిల్లాలో 409, నంద్యాలలో 351 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం వాహనాలు ఇంటింటికి వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలి. వీధి చివరన.. గ్రామంలో ఒకమూల వాహనం పెట్టి సరకులు అందిస్తున్నారు. ఆ సమయంలో వినియోగదారుడు ఉంటే సరి.. లేకుంటే ఆ నెలలో సరకులు వదులుకోవాల్సిందే. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఒక్కో ఎండీయూ వాహన ఆపరేటరుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.21 వేలు చెల్లిస్తోంది. ఏటా రూ.19.15 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ప్రతి నెలా పరిశీలిస్తే 85 నుంచి 90 శాతం మంది కార్డుదారులకే సరకులు అందుతున్నాయి. చిల్లర పేరుతో చిల్లులుసరకుల పంపిణీ సమయంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారులకు కందిపప్పు, చక్కెర పంపిణీ చేసినట్లు ఈ.పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేయించుకుంటున్నారు.

చురకలు



# వరి సాగుకు సమాయత్తం

అనంతపురం : జిల్లాలో రైతులు రబీలో వరి పంటను విస్తృతంగా సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగినప్పటికీ ఎన్నో ఆశలతో నాట్లు వేస్తున్నారు. గత ఖరీఫ్ ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో ధరలు పతనమైనప్పటికీ, ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసింది. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసింది. దానికితోడు పత్తి పంటపై ఆశలు సన్నగిల్లుతుండటం, హెచ్చెల్సీలో ప్రవాహం ఎక్కువ రోజులు కొనసాగితే నీరు వస్తుందనే నమ్మకంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, బీటీపీ కింద గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, పామిడి, బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు, యల్లనూరు, శింగనమల మండలాల్లో బోర్ల కింద రైతులు ఎక్కువగా వరి సాగు చేయనున్నారు. ఆర్ఎన్ఆర్, ఐఆర్ 93 రకాలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ముందుగానే నార్లు పెంపకం చేపట్టిన రైతులు మడులను సిద్ధం చేసుకొని, జోరుగా నాట్లు వేసుకొంటున్నారు. సాధారణంగా 16వేల



ఎకరాల్లో వరి సాగు కానుందని అధికారులు ప్రతిపాదిస్తుండగా రెట్టింపు విస్తీర్ణంలో, 30 వేల ఎకరాల్లో సాగు కానున్నట్లు అంచనా.

**పెరిగిన పెట్టుబడి ఖర్చులు**

ఖరీఫ్ కంటే రబీ కింద వరి సాగు రైతుకు భారంగా మారింది. ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్ల అద్దె, కూలీల ధరలతో ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. హెచ్చెల్సీ ఆయకట్టు భూముల్లో వరికొయ్య మడులను నాట్లు వేసేలా సిద్ధం చేసేందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ట్రాక్టరుతో టిల్లరు తోలడానికి ఎకరాకు రూ.1,000, దమ్ము చేయడానికి గంటకు రూ.1,500 చొప్పున, వరి నారుకు రూ.5 వేలు, ఎకరా వరి నాట్లు వేసేందుకు రూ.6 వేలు, కూలీలు, ఎరువులు, కలుపు నివారణ, సస్యరక్షణ, మందుల పిచికారీ ఇతరాత్ర కలిపి ఎకరాకు మొత్తం పెట్టుబడి రూ.50 వేలకుపైగా వ్యయం చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

**మెలకువలు పాటించాలి- సాయికుమార్, ఏవో** వరి నాట్లు వేయడంలో రైతులు మెలకువలు పాటించాలి. తగిన దూరం పాటించి నాట్లు వేయడంతోపాటు కాలి బాటలు తీసుకోవాలి. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమసంహారక మందులు వాడకూడదు.

# గోకులం.. పాడిరైతుకు ఊతం

ఉరవకొండ : పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం తోడ్పాటుగా నిలిచింది. గోకులాలను మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటికే చాలా గ్రామాల్లో గోకులాల నిర్మాణాలు పూర్తికాగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేశారు. అనంతపురం జిల్లాలోని 31 మండలాలకు 1,709 గోకులాలు మంజూరు అయ్యాయి. రైతు వాటాతో కలిసి ఒక్కో నిర్మాణానికి రూ.2.30 లక్షలు చొప్పున కేటాయించారు. ఈ లెక్కన రూ.33.45 కోట్లతో పనులు చేపట్టారు.



అందులో 1,652 పనులు ప్రారంభం కాగా, 767 గోకులాల నిర్మాణాలు పూర్తయ్యాయి. 378 పునాదుల స్థాయిలోనూ, 353 బేస్‌మెంటు స్థాయిలో, 154 పైకప్పు వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలను అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. పాడిరైతులు పశువులను గోకులం షెడ్డు కింద కట్టేసుకోవడం ద్వారా అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. సంరక్షణకు, మేత మేయడానికి ఇబ్బంది ఉండదు. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్మాణాలకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గోకులాలను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల వల్ల కొన్ని నిర్మాణాలు పూర్తి కాలేదు. ఈ విషయమై డ్వామా పీడీ సలీంబాషాతో ప్రస్తావించగా ఈ నెలాఖరు నాటికి గోకులాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

# అరకోటి స్థలం ఆక్రమణకు యత్నం!

అనంతపురం : కొత్తచెరువు మండలం మీర్జాపురం పంచాయతీ కొత్తదేవరపల్లి గ్రామంలో అరకోటి విలువైన భూమిని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నాలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘకాలంగా నివాసాల మధ్య ఖాళీ స్థలంలో గుంతలు పడి అపరిశుభ్రంగా ఉండేది. గుంతలను పూడ్చి శుభ్రం చేయించాలని



పలుమార్లు గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. ఇటీవల అధికారులు గుంతలను పూడ్చడానికి రూ.3 లక్షల మండల పరిషత్తు నిధులు మంజూరు చేశారు. పొక్లెయిన్, ట్రాక్టర్లతో మట్టిని తరలించి గుంతలను పూడ్చి చదును చేశారు. దాదాపు 30 నుంచి 40 సెంట్ల విలువైన భూమి భవిష్యత్తులో గ్రామ ప్రజోపయోగాలకు ఉపయోగపడుతుందని భావించారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటుకు సామగ్రి సైతం తెప్పించారు. ఇంతలోనే కొందరు రాజకీయ జోక్యంతో గడ్డివాము, దిబ్బలు ఏర్పాటు చేసి స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారు. అయితే ఈ స్థలంలో కొంత రోడ్డుకు వదిలి మిగిలిన దాంట్లో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో నటరాజ్‌ను వివరణ కోరగా స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

# భూ రీసర్వేకు ముహూర్తం ఖరారు




అనంతపురం : ప్రతిష్ఠాత్మకమైన భూ రీసర్వే నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 20 నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇదే భూ రీసర్వే వ్యవహారం అస్తవ్యస్తంగా.. గందరగోళంగా సాగింది. తప్పులు, పొరపాట్లు లెక్కలేనన్నీ తెరపైకి వచ్చాయి. ఈ తరహా తప్పులు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా రీసర్వే చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికను రూపకల్పన చేశారు. ఇదే విషయాన్ని జిల్లా భూమి, రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ తెలిపారు. తొలి ప్రయత్నంగా ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మక రీసర్వే చేయాలని సంకల్పించారు. జిల్లాలో 31 గ్రామాల్లో సర్వే మొదలు కానుంది. ఏ చిన్న తప్పు దొర్లకుండా ముందస్తుగా గత నెల 25 నుంచి నిర్దేశిత 31 గ్రామాల్లో ప్రత్యేక సభలు నిర్వహించారు. భూమి రీసర్వే పునఃప్రారంభానికి సర్వం సిద్ధం చేసుకున్నారు.

**ప్రతి బ్లాక్‌కు ఒక బృందం**

రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించారు. ఈ బ్లాక్‌కు ఒక బృందం ఉంటుంది. బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌ఓ), గ్రామ సహాయకుడు (వీఆర్‌ఏ) ఉంటారు. బృందానికి మరొక సాంకేతిక సిబ్బంది సాయంగా ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణాన్ని పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ గ్రామ ప్రజలు, భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే చేస్తారు.

**సర్వే చేయనున్న గ్రామాలివే**

అనంత గ్రామీణ మండలంలో తాటిచెర్ల, ఆత్మకూరులో సనప, బీకే సముద్రంలో రెడ్డిపల్లి, గార్లదిన్నెలో కల్లూరు, శింగనమలలో మట్లగొంది, రాప్తాడులో బండమీదపల్లి, నార్పలలో బొందలవాడ, తాడిపత్రిలో ఊరుచింతల, పెద్దపప్పూరులో చిన్నయక్కలూరు, పుట్లూరులో గాండ్లపాడు, కూడేరులో జయపురం, ఎల్లనూరులో పాతపల్లి, గుంతకల్లులో శంకరబండ, గుత్తిలో కొజ్జెపల్లి, పామిడిలో కళాపురం, పెద్దవడుగూరులో దిమ్మగుడి, ఉరవకొండలో వ్యాసాపురం, వజ్రకరూరులో గంజికుంట, విడపనకల్లులో ఉండబండ, యాడికిలో చందన, కళ్యాణదుర్గంలో దురుదకుంట, బెళుగుప్పలో తగ్గుపర్తి, బ్రహ్మసముద్రంలో గుండిగానపల్లి, కుందుర్పిలో అపిలేపల్లి, కంబదూరులో తిమ్మాపురం, శెట్టూరులో అయ్యగార్లపల్లి, గుమ్మఘట్ట, కణేకల్లులో మీనహళ్, రాయదుర్గంలో జుంజురాంపల్లి, డి.హీరేహాళ్‌లో కదలూరు, బొమ్మనహాళ్ మండలంలో కురువపల్లి గ్రామాలను ఎంపిక చేశారు. గత వైకాపా ప్రభుత్వ పెద్దల ప్రచారపిచ్చి పరాకాష్ఠకు చేరిన సంగతి తెలిసిందే. పొలాల సరిహద్దు రాళ్లపై అప్పటి సీఎం బొమ్మలు, పేర్లు వేసుకున్నారు. రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలపై కూడా అదే తరహా ప్రచారాన్ని చేసుకున్నారు. ఇప్పుడు వాటిని చెరిపేస్తున్నారు. రాజముద్రతో ఉన్న పాసుపుస్తకాలను అందజేస్తారు.

# గుట్టుగా డీజిల్, సిమెంట్ చౌర్యం!



అనంతపురం : డీజిల్ అక్రమ విక్రయాలకు 44వ నంబరు జాతీయ రహదారి ఇరువైపులా దుకాణాలు అడ్డాలుగా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 180 కి.మీ మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. వందల సంఖ్యలో దాబాలు, టీ దుకాణాలు వెలిశాయి. వాటికి పక్కనే పలుచోట్ల డీజిల్, సిమెంట్ వాహనాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసేందుకు పలువురు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం వందల లీటర్ల డీజిల్, సిమెంట్ బస్తాలు దారిన వెళ్లే వాహన చోదకుల నుంచి సేకరించి అధిక సొమ్ముకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ నియోజక వర్గాలు, మండలాలను కలుపుతూ విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై ఇటు హైవే పెట్రోలింగ్ సిబ్బంది, అటు పలుస్టేషన్ల పరిధిలోని పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమ దందా నిరంతరం సాగుతోంది.

డీజిల్ కొనుగోలు కోసమే పలువురు జాతీయ రహదారి పక్కనే దుకాణాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల కంటెయినర్ ద్వారా సిమెంట్ సైతం కొనుగోలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు భారీ వాహనాలలో లగేజీ తీసుకెళ్లే వాహన చోదకులు యజమానులకు తెలియకుండా డీజిల్ విక్రయిస్తున్నారు. పలు కంపెనీలు నగరాల్లోని నిర్మాణ సంస్థలకు సిమెంట్ను కంటెయినర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. తిరిగి వచ్చే సమయంలో మిగిలిపోయిన సిమెంట్ను జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న వారికి విక్రయిస్తుంటారు. వారు కొనుగోలు చేసిన ధర కన్నా అధిక ధరలకు డీజిల్, సిమెంట్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాహనదారుల నుంచి లీటరు డీజిల్ రూ.60 నుంచి 65 కొనుగోలు చేసి ఇతర వాహనాల వారికి రూ.85 లకు విక్రయిస్తుంటారు. ఈ లెక్కన లీటరుపై రూ.20 నుంచి 25 వరకు సంపాదిస్తున్నారు. ఒక్కో వాహనదారుడు 10 లీటర్ల నుంచి 80 లీటర్ల వరకు అక్రమంగా విక్రయిస్తుంటాడు. విడి సిమెంట్ను కంటెయినర్ నుంచి 50 కేజీల బస్తాకు రూ. 200 నుంచి 250 చెల్లించి రూ. 300 నుంచి 350 వరకు విక్రయిస్తుంటారు.

కనగానపల్లి మండల జాతీయ రహదారి పరిధిలో 20 అక్రమ డీజిల్ దుకాణాలు, రామగిరి మండలం పరిధిలో 7, చెన్నేకొత్తపల్లి పరిధిలో 3 ఉన్నాయి. కేవలం 15 కి.మీ పరిధిలోనే ఇన్ని ఉన్నాయంటే జిల్లాలో జాతీయ రహదారి పరిధి 180 కి.మీ ఉంది. బహిరంగ మార్కెట్లతో పోలిస్తే రహదారుల పక్కన అక్రమంగా చౌర్యం చేసిన డీజిల్, సిమెంట్ తక్కువ ధరకు లభిస్తుండటంతో వినియోగదారులు వీటిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**అక్రమ వ్యాపారంపై చర్యలు–** మహ్మద్ రిజ్వాన్, ఎస్సై, కనగానపల్లి

జాతీయ రహదారి పక్కన అక్రమంగా జరుగుతున్న డీజిల్, సిమెంట్ చౌర్యంపై చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారిపై ప్రత్యేక దృష్టి సారించి డీజిల్, సిమెంట్ అక్రమాలు జరగకుండా చూస్తాం.

# వేరుసెనగకు మచ్చ తెగులు



చెన్నేకొత్తపల్లి : ఎన్ఎస్‌గేట్ గ్రామానికి చెందిన కౌలు రైతు చంద్రాయుడు ఎనిమిదెకరాలలో పంట సాగు చేయగా 20 బస్తాల దిగుబడి వచ్చింది. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టగా కనీసం రూ.50 నుంచి 60 వేలు వచ్చే పరిస్థితి కూడా లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుసెనగ రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 35,785 ఎకరాల్లో అనంతపురం జిల్లాలో 20, 297 ఎకరాలలో వేరుసెనగ సాగు చేశారు. అందులో 80 శాతం పంటకు నల్లమచ్చ తెగులు సోకడంతో పంటను తొలగించుకుంటున్న దుస్థితి.

వేరుసెనగ పంటలకు తెగుళ్లు సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూలేని విధంగా రబీ వేరుసెనగకు చీడపీడలు అధికంగా వ్యాపించాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. మూడు, నాలుగు పిచికారీలతో పూర్తయ్యే పంట ఈసారి ఎడెనిమిది సార్లు పిచికారీలు చేసినా చీడపీడలు, మచ్చ తెగులు అదుపులోకి రాలేదు. రాప్తాడు నియోజకవర్గం సీకేపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. రైతులు చేసేదేంలేక ఇంకా నెలరోజుల సమయం ఉండగానే పంటను తొలగిస్తున్నారు.

సెప్టెంబరు చివర నుంచి అక్టోబరు చివరి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీ కాలానికి రైతులు వ్యవసాయ బోర్ల ద్వారా విస్తారంగా వేరుసెనగ సాగు చేశారు. అక్టోబరులో భారీ వర్షాలు కురిశాయి. పంట దెబ్బతిని చీడపీడలు చుట్టుముట్టాయి. మందులు పిచికారీ చేసినా నల్లమచ్చ అదుపులోకి రాలేదు. మొక్క ఆకులు నల్లమచ్చ తెగుళ్లు సోకి రాలిపోతూ మొక్క నల్లగా మారి ఎందుకూ పనికి రాకుండా పోయింది.

ఎంత కష్టపడి పనిచేసినా.. రైతుకు పంట దక్కడం గగనం అవుతోంది. పంట దిగుబడి వస్తే ధర ఉండదు.. ధర ఉంటే దిగుబడి రాదు.. శెట్టూరు మండలం బసంపల్లి గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు రెండెకరాల్లో రూ.2.70 లక్షలతో సాహు టమాటా రకం సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా వచ్చినా.. కోతలు మొదలయ్యే సరికి మార్కెట్లో 15 కిలోల బుట్ట ధర రూ.50 మించలేదు. 3 వేల బుట్టెల మార్కెట్‌కు తరలించగా చేతికి ఏమీ రాలేదు. కోత, బుట్టెలు అద్దె, రవాణా ఖర్చులకు కూడా గిట్టుబాటు కాకపోవడంతో గొర్రెలకు వదిలేశానని రైతు ఆంజనేయులు

ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం గ్రామీణం కురుగుంటకు చెందిన రైతు సిద్దన్న ఎనిమిదెకరాలు గుత్తకు తీసుకుని ఉలవ సాగు చేశారు. ఎకరాకు రూ.2 వేలు చొప్పున రూ.16 వేలు గుత్తకు తీసుకోగా, ఎకరా సాగుకు రూ.6 వేలు చొప్పున రూ.48 వేలు పెట్టుబడి పెట్టారు. తీరా పంట పూత, కాయ రాలేదు. ఉన్న పంటకు పురుగు ఆశించడంతో చేసేదిలేక గొర్రెలు మేతకు వదిలేశారు.

**పశుగ్రాసానికి పనికిరాదు - కర్రి సూరి, రైతు, సీకేపల్లి**

3 నెలల క్రితం మూడెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. రెండు నెలలపాటు భారీ వర్షాలు కొనసాగడంతో పంట ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. మొక్కలకు నల్లమచ్చల తెగుళు, లద్దె పురుగు, పచ్చపురుగు వ్యాపించాయి. వాటిని నివారించేందుకు పురుగుల మందులు పిచికారీ, రసాయనిక ఎరువులు చల్లినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే. మూడు ఎకరాల్లో కేవలం 15, 20 బస్తాల దిగుబడి వస్తుందో రాదోనన్న ఆందోళన ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**రూ.మూడున్నర లక్షలు నష్టపోయా - నారాయణరెడ్డి, రైతు, పులేటిపల్లి**

రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఎనిమిదెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. పంట వేసిన రెండో రోజే భారీ వర్షం కురవడం, నెలరోజుల పాటు వర్షాలు కొనసాగడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎన్నడూలేని విధంగా చీడపీడలు వ్యాపించాయి. మూడున్నర లక్షలు నష్టం వచ్చింది.

# 'ఆయుష్' పోసిన కూటమి

నర్సీపట్నం : వైద్యులు, సిబ్బంది లేక కొన్నేళ్లుగా సేవలకు దూరంగా ఉన్న ఆయుష్ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ఆసుపత్రులన్నింటికీ వైద్యులను నియమించింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల కిందట ఏర్పాటైన ఆసుపత్రుల్లో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన వైద్యులు, సిబ్బంది స్థానంలో ఇప్పటివరకు ఎవర్నీ నియమించకపోవడంతో అవన్నీ మూతపడ్డాయి. ప్రస్తుతం ఆసుపత్రులన్నీ తెరచుకోనున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఆయుష్ ఆరోగ్య మందిరాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా చాలాకాలం నుంచి మూతపడిన ఆయుష్, హోమియో, యునాని ఆసుపత్రుల్లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా ఉత్తరాంధ్రలో (జోన్–1) 39 మంది వైద్యులను నియమించింది. వీరిలో 23 మంది ఆయుర్వేద, 16 మంది హోమియో వైద్యులున్నారు. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 113 డిస్పెన్సరీల్లో 59 హోమియో, ఆయుర్వేద, యునానీ ఆసుపత్రులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. మిగతా 54లో 39 ఆసుపత్రులకు తాజాగా వైద్యులను నియమించగా, 15 చోట్ల భర్తీ చేయాల్సి ఉంది.

**నర్సీపట్నంకు యశోదాదేవి, దేవరాపల్లికి గ్రీష్మ**



ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏఎల్‌పురం, కన్నూరుపాలెం, వేంపాడు, దేవరాపల్లి, నర్సీపట్నం, అరకులోయ, డుంబ్రిగుడ, తాజంగి, సీలేరు ఆసుపత్రులకు వైద్యులు నియమితులయ్యారు. నర్సీపట్నంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వైద్యాధికారిగా యశోదాదేవి, దేవరాపల్లిలో మూడేళ్లుగా మూతపడిన ఆసుపత్రికి వైద్యాధికారిణిగా జి.గ్రీష్మ నియమితులయ్యారు.

**త్వరలోనే మందుల నిల్వలు**

ఆయుష్ డిస్పెన్సరీల్లో వైద్యులు లేక కొన్ని మూతపడ్డాయి. వాటిలో 39 మంది చోట్ల కొత్తగా వైద్యులు నియమితులయ్యారు. వారంతా విధుల్లో చేరిన వెంటనే మందుల నిల్వలూ పంపుతాం. మూతపడిన ఆసుపత్రి భవనాలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకువస్తాం. పారా మెడికల్ సిబ్బంది నియామకం త్వరలో జరుగుతుంది. ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో యోగా నేర్పేందుకు ఇద్దరు యోగా శిక్షకులను నియమించాం. వారిలో ఒకరు ఆసుపత్రిలో, మరొకరు ప్రభుత్వ పాఠశాలలో యోగా నేర్పుతారు. ఝాన్సీలక్ష్మి, ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకురాలు, జోన్–1

# గృహామే సాగుసీమ

విశాఖపట్నం : విశాఖ నగరంలో మిద్దె పంటల సాగు సంస్కృతి విస్తృతమవుతుంది. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిపొందుతున్నారు. ఇల్లు.. మేడ.. గోడ.. బాల్కనీలు.. ఎక్కడైనా ఆకుకూరలు, కాయగూరలు పండించేస్తున్నారు. అపార్టుమెంటు, విల్లాలను కూడా సేంద్రియ సాగుకు అనుకూలంగా మార్చేస్తున్నారు. నగరంలో ఎక్కువగా మాధవధార, మురళీనగర్, తిరుమలనగర్, రుషికొండ, మధురవాడ, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లో అధిక సంఖ్యలో మహిళలు మిద్దె తోటలపై పండిస్తున్నారు. ఒక్క మాధవధారలో 300 కుటుంబాలు, మధురవాడలో 200, సీతమ్మధార, ఎంవీపీలో వందేసి కుటుంబాలు ఈ దిశగా సాగుతున్నాయి.

కాలనీల్లో మేడలపై కొద్ది పాటి స్థలాన్ని పలువురు మహిళలు ఇంటి అవసరాలకు సరిపడేలా వినియోగిస్తున్నారు. ఆకుకూరలను చిన్నచిన్న కుండీలు, ప్లాస్టిక్ సంచుల్లో సాగు చేస్తున్నారు. చిక్కుడు, కాకర, బీర, వంగ, బీన్స్, నేతిబీర, డ్రాగన్ ఫ్రూట్స్, మల్బరీ, ద్రాక్ష, అంజీరా, కస్తూరి పసుపు, కొన్ని పండ్ల మొక్కలు పెంచుతున్నారు. సేంద్రియ ఎరువుతో గులాబి, సంపెంగ, చామంతుల సాగు చేయడంతో ఎక్కువ పూలు చేతికందుతున్నాయి.

సమాచారం ఇలా: మిద్దె సాగులో ఎదురయ్యే సమస్యలు చెప్పుకొని పరిష్కారం పొందటానికి, అనుభవాలు మిగిలిన వారితో పంచుకోవటానికి వాట్సప్ గ్రూపులున్నాయి. ఒక్కో బృందంలో 50 నుంచి 100 మంది వరకు సభ్యులుంటున్నారు.

పెంపకంపై ఆసక్తి ఉన్నవారికి అవగాహన కల్పించి కొందరు ఉ



చితంగానే మొక్కలను అందజేస్తున్నారు. పండిన కూరగాయలను సభ్యులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

**12 సంవత్సరాలుగా..:** 250 గజాల స్థలంలో నిర్మించిన ఇంటిపై ఎన్నో రకాలు మొక్కలు పెంచుతున్నాం. యూట్యూబ్‌లో ఒకరి సాగు చూసి ప్రారంభించాం. 12 ఏళ్లుగా ఆసక్తిగా పండిస్తున్నాం. వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా 700కు పైగా ప్లాస్టిక్ కుండీలు, సిమెంటు మడుల్లో సాగు చేస్తున్నాం. ఇంట్లో తయారు చేసిన పశువుల గెత్తం, వృథా కాయగూరలు తదితర వాటితో ఎరువు తయారు చేసి మొక్కలకు వేస్తాం. చిన్నపాటి కొలనులో చేపలూ పెంచుతున్నాం.

**స్థలం సద్వినియోగం:** మాది మూడంతస్తుల ఇల్లు. ఇంటి గోడలు, కిటికీలు, మెట్ల మార్గం ఇలా దేన్నీ వదల్లేదు. ఖాళీ నీళ్ల సీసాలే కాకుండా కోక్ టిన్నులు, నీళ్ల డబ్బాలు, పెయింట్ డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువుల్లో పెంచుతున్నా. అందంగా కనిపించడానికి సీసాలకు రంగులు అద్ది మరీ వేలాడదీస్తున్నా. పూలమొక్కలే కాకుండా ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల రకాలు ఎన్నో పెంచుతున్నా. అన్ని ఒకే చోట కాకుండా... చిన్న పాత్రలు, డబ్బాల్లో అయితే తక్కువ మట్టితో ఎక్కువ పెంచుకోవచ్చు. అరుణ, మురళీనగర్

చురకలు



# పంచాయతీ భూములు పరాధీనం

పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గ కేంద్రం భూ అక్రమాలకు అడ్డాగా మారింది. లోపాయికారీ ఒప్పందాల పుణ్యమాని లక్షలాది రూపాయల విలువజేసే పంచాయతీ స్థలాలు చేతులు మారిపోతున్నాయి. దర్జాగా అమ్మకాలు సాగిపోతున్నాయి. అధికారుల కళ్లముందే ఆస్తులు గల్లంతవుతున్నాయి.
పాయకరావుపేట పంచాయతీ పరిధిలో ఇప్పటివరకు దాదాపు 100 ఎకరాల్లో లేఅవుట్లు వేశారు. వీటిలో వీఎంఆర్డీఏ నుంచి అనుమతులు తీసుకున్నవి మూడు మాత్రమే. మిగతావన్నీ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నవే. నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాల లేఅవుట్లలో తప్పనిసరిగా 33 అడుగుల రోడ్లు వేయాల్సి ఉంది. కానీ 15 అడుగుల రోడ్లతోనే సరిపెట్టేశారు. ఎకరానికి పది సెంట్లు భూమిని సామాజిక అవసరాలకు వదిలేయాలి. దీనిని పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఇక్కడే అధికారులు, వ్యాపారులు ఒక్కటయ్యారు. కొత్తగా లేఅవుట్లు వేసినవారు పంచాయతీకి భూమి కేటాయించకుండా విక్రయాలు సాగించేస్తున్నారు. ఇంకొందరు మరో అడుగు ముందుకేసి పంచాయతీకి గతంలో కేటాయించిన భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి వాటిని సొంత స్థలాలుగా చూపించి విక్రయించేస్తున్నారు. రాజుగారిబీడు, షీలానగర్, దేవీనగర్ సహా పలు ప్రాంతాల్లో పంచాయతీ ఆధీనంలో ఉండాల్సిన స్థలాల్లో కొన్నే మిగిలాయి. ఇలా దాదాపు




రూ. 3 కోట్ల విలువజేసే స్థలాలు చేతులు మారిపోయాయి. అదేవిధంగా మండలంలోని నామవరం, పి.ఎల్.పురం, సీతారాంపురంలోనూ 40 ఎకరాల వరకు లేఅవుట్లున్నాయి. ఇక్కడా ఇదే పరిస్థితి ఉంది.

**హోంమంత్రి ఆదేశాలతో గుట్టు వీడేనా..**

పంచాయతీ స్థలాలపై సర్వే చేయాలని ఇటీవలే హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు ఇచ్చారు. స్థలాలకు కంచె వేసి హెచ్చరిక బోర్డులు పెట్టాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దునిద్ర వీడతారో లేదో చూడాలి. అయితే ఇంకా సర్వే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పంచాయతీలోనూ లేఅవుట్లలోని స్థలాల దస్త్రాలు మాయం అయ్యాయి. దీంతో పూర్తిస్థాయిలో స్థలాల ఆచూకీ లభ్యం అవుతుందా అనేది ప్రశ్నార్థకమే. ఇప్పటికీ స్థలాలు అమ్మేస్తున్నారంటూ పంచాయతీకి ఫిర్యాదులు వస్తున్నాయి. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఉన్నతాధికారులు తక్షణం దృష్టి సారిస్తే పంచాయతీ స్థలాలకు రక్షణ లభించే అవకాశముంది. పాయకరావుపేటలో భూ అక్రమాలపై ఈఓఆర్డీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా అన్ని లేఅవుట్ల వివరాలు తీసుకుంటున్నామని చెప్పారు. పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

# పల్లెలకు 'అన్న'పూర్ణ

అనకాపల్లి : ఇంతవరకు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన అన్నక్యాంటీన్లను గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సరైన స్థలాలు ఎంపిక చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు సైతం జారీ చేయడంతో అధికారులు గ్రామాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటుపై క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు.
కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అన్న క్యాంటీన్లు ప్రజాదరణ పొందాయి. ఇవి ప్రస్తుతం నగర, పట్టణాల్లో మాత్రం ఉన్నాయి. పల్లెల నుంచి వివిధ పనులపై పట్టణాలకు వచ్చే నిరుపేదలకు రూ. 5కే నామమాత్రపు ధరతో అల్పాహారం, రెండుపూటలా భోజనం అందిస్తున్నాయి. పట్టణాల కంటే గ్రామాల్లో ఎక్కువగా పేదలున్నారు. వీరి పడుతున్న ఇబ్బందులకు గుర్తించిన కూటమి సర్కార్ గ్రామాల్లో అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకువచ్చి ఆకలి తీర్చాలని నిర్ణయం తీసుకోవడంతో గ్రామాల్లో ఉన్న నిరుపేదలు ప్రభుత్వ నిర్ణయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
తెదేపా హయాంలో 2014-19లో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ నిరుపేదలు ఈ క్యాంటీన్ల వద్ద ఆకలి తీర్చుకునేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన




వైకాపా ప్రభుత్వం వీటిని ఎత్తివేసి, పేదల కడుపు కొట్టింది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ తెదేపా పలుచోట్ల దాతల సహాయంతో క్యాంటీన్లు నడిపించి ఆకలి తీర్చింది. తిరిగి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి నిరుపేదలకు రూ. 5కే భోజనం అందించడం ప్రారంభించింది. నాణ్యతలో రాజీ లేకుండా ఆహారం అందిస్తోంది. జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నంలలో ఇవి నడుస్తున్నాయి. రోజుకు 300 నుంచి 400 మంది నిరుపేదల ఆకలి తీరుస్తున్నాయి. తాజాగా పల్లెలకు ఈ కేంద్రాలు సేవలు విస్తరిస్తుండటంతో పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 24 మండలాలు ఉన్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

**ఎంపిక బాధ్యత కలెక్టర్‌కు..**

గ్రామాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటుకు సంబంధించి స్థలాల ఎంపిక బాధ్యతను ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించింది. దీంతో జిల్లాలో ఏఏ గ్రామాల్లో ఏర్పాటు చేయాలి అన్న అంశంపై కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులతో చర్చిస్తున్నారు. మేజర్ పంచాయతీ గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

# ఆయిల్‌ఫెడ్ అస్తవ్యస్తం




అనంతపురం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వేరుసెనగ పంట అత్యధికంగా సాగయ్యేది ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే. ఏటా ఖరీఫ్‌లో సుమారు 7-8 లక్షల హెక్టార్లలో పంట పండేది. 14-16 వేల టన్నుల వేరుసెనగ దిగుబడి వచ్చేది. జిల్లాలోనే పంటంతా కొనుగోలు చేసేవారు. రోజుకు 20 లారీల వేరుసెనగ కాయలతో 8 టన్నుల నూనె ఉత్పత్తి చేసి గుజరాత్ రాష్ట్రానికి ఎగుమతి చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా నిత్యం సుమారు 200 మందికి ఉపాధి దొరికేది. నూనె తీసేందుకు మూడు షిఫ్టులలో సిబ్బంది పనిచేశారు. రాయలసీమలోనే అనంతపురం జిల్లాలో అంతటి ప్రాచుర్యం ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆయిల్‌ఫెడ్). 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంస్థని పూర్తిగా మూసేసింది. పరిపాలనా భవనంతోపాటు గోదాములు, ఖాళీ స్థలం మొత్తం కడప జిల్లాకు చెందిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంబంధీకులైన శిరిడిసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సంస్థకు ఆయిల్‌ఫెడ్ ఆస్తులన్నీ అద్దెకు కట్టబెట్టి అధోగతి పట్టించారు.

**సిబ్బంది ఒక్కరూ మిగల్లే..**

ఏపీ ఆయిల్‌ఫెడ్ సంస్థలో 60 మంది ఉద్యోగులు పనిచేసేవారు. 20 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేశారు. 150 మంది హమాలీలకు నిత్యం ఉపాధి దొరికేది. అధికారులు, సిబ్బంది కొందరు పదవీ విరమణ పొందారు. సెక్యూరిటీ గార్డులను తొలగించారు. మరికొందరిని రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఇదంతా గత 5-10 ఏళ్ల క్రితం మాట. ప్రస్తుతం ఒక్కరు కూడా సిబ్బంది లేరు. ఆస్తులన్నీ ప్రైవేట్ వ్యక్తికి ఇచ్చేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీ ఆయిల్‌ఫెడ్‌కు మళ్లీ గత ఖరీఫ్‌లోని వేరుసెనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. తాజాగా వ్యవసాయ, కోఆపరేటివ్‌శాఖ ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అసలు మనుషులేరు. కొనుగోలు చేసేదెవరని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

**1.12 లక్షల హెక్టార్లలో సాగు**

ఉమ్మడి జిల్లాలో గత ఖరీఫ్‌లో వేరుసెనగ సాధారణ సాగు 3,72,794 హెక్టార్లు కాగా, అందులో 1,89,584 హెక్టార్లలో సాగైంది. హెక్టారుకు 5-6 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మొత్తం 9,47,920 నుంచి 11,37,504 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రభుత్వ రంగ సంస్థకే కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో పరిస్థితి అయోమయంగా మారింది.

**ఆస్తులన్నీ అద్దెకు..**

అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలో (తపోవనం) 1988లో ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రారంభమంది. 24 ఎకరాల్లో విస్తరించింది. అంతకు ముందు ఏపీ మార్క్‌ఫెడ్ ఆస్తులవి. పరిపాలన భవనంతోపాటు విశ్రాంత భవనం, 6 వేల సామర్థ్యం ఉన్న పది గోదాములున్నాయి. అందులో నాలుగు గోదాములు హెూల్‌సేల్ ఎరువుల వ్యాపారికి అద్దెకిచ్చారు. మిగిలిన ఆరు గోదాములతో పాటు ఖాళీ స్థలమంతా ప్రైవేట్ విద్యుత్తు సంస్థకు ఇచ్చేశారు. 2003 వరకు వేరుసెనగ నూనె ఉత్పత్తి చేశారు. గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద నగరానికి నూనెను ట్యాంకర్లతో ఎగుమతి చేశారు. అంతేకాకుండా విజయ ఆయిల్ కంపెనీకి చెందిన నూనెను నెలకు 20 వేల లీటర్ల వరకు అమ్మి ఏపీఆయిల్‌ఫెడ్ సంస్థకు ఆదాయం పెంచారు. ఆ తర్వాత జిల్లాలోని వేరుసెనగ విత్తనకాయలన్నీ కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసేవారు. మళ్లీ ప్రతి ఖరీఫ్‌కు 6-7 లక్షల క్వింటాళ్లు రైతులకు పంపిణీ చేసేవారు. 2018 వరకు రైతుల నుంచి వేరుసెనగ కొనుగోలు చేయడం, మళ్లీ రైతులకు పంపిణీ ప్రక్రియ సాగింది. ఆ తర్వాత వేరుసెనగ కొనుగోలు ఆపేశారు. 2022లో ప్రైవేట్ విద్యుత్తు సంస్థకు ఆస్తులన్నీ అద్దెకిచ్చి సర్వం ధారాదత్తం చేశారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రభుత్వ రంగసంస్థకు 24 ఎకరాల భూమి ఉంది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో భూములు రూ.కోట్ల విలువ చేస్తున్నాయి. ఐదేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం అధికారంలో రాగానే ఆపార్టీ ప్రజాప్రతినిధులు ఆ స్థలంపై కన్నేశారు. భూమంతా లాక్కోవాలని చూశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఒకసారి, పశువుల సంతకు తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చారు. అయితే సంస్థ ఒప్పుకోకపోవడంతో అక్కడితో వదిలేశారు.

# చేపా.. చేపా.. ఎక్కడున్నావ్..?




చిత్తూరు : మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచి యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రారంభించిన ఫిష్ ఆంధ్రా ఔట్‌లెట్లు గల్లంతయ్యాయి. వైకాపా నాయకులు ప్రభుత్వ రాయితీ స్వాహా చేసేందుకే తూతూమంత్రంగా వాటిని ప్రారంభించి మూణ్నాళ్లకే మూసేశారు.. కేంద్రం నిధులు మళ్లించి వైకాపా అస్మదీయులకు రాయితీలు అప్పనంగా కట్టబెట్టారు.. దాదాపు 80 శాతం మంది లబ్ధిదారులు రాయితీలు లాగించి చల్లగా జారుకున్నారు.. ఇదీ నేటి ఈ ప్రాజెక్టు దుస్థితి..
జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య యోజన కింద కేంద్రం అందించిన నిధులను మళ్లించుకున్న వైకాపా ప్రభుత్వం సొంత డబ్బా కొట్టుకుని ఫిష్ ఆంధ్రా పేరిట ఏర్పాటు చేసిన యూనిట్లు రాయితీలకే పరిమితమయ్యాయి. పథకం కింద ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీలు ఇచ్చారు. వైకాపా నేతలు సిఫార్సు చేసిన వారికి, వారి అనుచరులకు కట్టబెట్టడంతో పథకం నీరుగారిపోయింది.

**రాయితీల కాజేత ఇలా..**

జిల్లాలో ఫిష్ ఆంధ్రా పథకం పేరిట మంజూరైన యూనిట్లు ప్రస్తుతం నడుస్తున్నాయా? మూతపడ్డాయా? లబ్ధిదారుల ఎంపిక ఎలా జరిగిందా? తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ అధికారులను ఆదేశించింది. ఆపై అధికారుల పరిశీలనలో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. జిల్లాలో చేపలు, రొయ్యల ఉత్పత్తుల దుకాణాలకు సంబంధించి రూ.50 లక్షల యూనిట్లు రెండు మంజూరు చేయగా ఆ రెండూ మూతపడ్డాయి. రూ.20 లక్షల యూనిట్ విలువతో స్థానికంగా చేపలు, రొయ్యల విక్రయాల దుకాణాలు నాలుగు మంజూరు చేయగా మూడు మూతపడ్డాయి. రూ.10 లక్షల విలువతో ఫిష్ కియోస్క్ పేరుతో చేపల ఉత్పత్తుల విక్రయ దుకాణాలు ఎనిమిది మంజూరు చేయగా.. ఆరు ఎక్కడున్నాయో కనబడటం లేదు.

**హబ్ లేకుండానే వాహనాల అప్పగింత**

జిల్లాకు రూ.కోటి యూనిట్ విలువతో రెండు ఆక్వా హబ్‌లు మంజూరు చేసినా వీటి ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు రాలేదు. హబ్‌లు ఉన్నచోటే రూ.24 లక్షల విలువ చేసే ఆరు చక్రాల వాహనాలు పంపిణీ చేయాలి. అయితే జిల్లాలో ఈ హబ్ లేనేలేదు. మూడు ఆరు చక్రాల వాహనాలు లబ్ధిదారులకు కట్టబెట్టడం గమనార్హం.

**నిబంధనలు గాలికి..**

ఫిష్ ఆంధ్రా యూనిట్ల మంజూరులో నిబంధనలు గాలికొదిలేశారు. అంతా మా ఇష్టం.. మేం చెప్పిందే..చేసిందే నిబంధన అంటూ కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా యూనిట్లు మంజూరు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రత్యేక త్రీ మెన్ కమిటీ అధికారులు యూనిట్లను పరిశీలించి సంతృప్తిచెంది కలెక్టర్ ఆమోదంతో రాయితీ నిధులు మంజూరు చేయాలి. ఇవేమి పట్టించుకోక రాయితీ నగదు మంజూరు చేశారు.

**ప్రభుత్వానికి నివేదిక..** రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలో ఫిష్ ఆంధ్రా పథకంలో మంజూరైన యూనిట్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. ఎక్కువ యూనిట్లు నడపడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా ఈ పథకాన్ని అమలు చేసినట్లు గుర్తించాం. సమగ్ర వివరాలు ప్రభుత్వానికి నివేదించాం. శ్రీనివాసరావు, డీడీ, జిల్లా మత్స్య శాఖ

# గంజాయి సిగరెట్!

అనంతపురం : అనంత నగర ప్రభుత్వ కొత్తూరు జూనియర్ కళాశాల మైదానం.. ఆదివారం సరిగ్గా ఉదయం 7 గంటలు.. ఓ కుర్రాడు ఎంచక్కా బండపై కూర్చొని సిగరెట్ తరహాలో పీల్చుస్తున్నాడు. పిల్లాడు కదా.. అని మందలించేందుకు ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లాడు. ఆ కుర్రాడు ఆ సిగరెట్ను అక్కడే పడేసి తప్పించుకుని పారిపోయాడు. తీరా దాన్ని చూసిన సదరు వ్యక్తి ఆశ్చర్య పడ్డాడు. వామ్మో.. ఇది సిగరెట్ కాదని తెలుసుకొని అవాక్కయ్యాడు. ఈలోపు అందరూ అక్కడ గుమికూడారు. ఎంచక్కా.. సిగరెట్ నమూనాలో గంజాయి పొడిని పేపర్‌లో చుట్టి.. ఆఖరులో పీల్చే వైపు దూదిని పెట్టాడు. సిగరెట్ మాదిరే తయారీ చేసుకుని పీల్చుతుండటం బట్టి చూస్తే అనంత నగరంలో గంజాయి పొడి ఉందనడానికి ఈ ఘటన నిదర్శనంగా ఉంది. అనంత నగరంలో అనేక విద్యా సంస్థల్లో ఈ గంజాయి పొడి లభిస్తున్నట్లు ఇప్పటికే కొన్ని ఘటనలు వెలుగు చూశాయి. ఎక్కడికక్కడ నిర్మూలించకపోతే విద్యార్థులు, యువత తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించాల్సి ఉంది.



# మస్తర్లలో మాయాజాలానికి చెక్

నక్కపల్లి : ఉపాధి హామీ పథకంలో సాంకేతికత ఎంత అందుబాటులోకి తెచ్చినా అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ప్రధానంగా కూలీల పేరిట బోగస్ మస్తర్లు వేసి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి క్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా పర్యవేక్షణ విభాగాలను నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో 2.8 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, రోజూ రెండు లక్షల మంది వరకు పనులకు వెళుతున్నారు. ఏటా రూ. వందల కోట్ల విలువైన పనులు చేస్తున్నారు. చెరువులు, సాగునీటి కాలువల అభివృద్ధి, మొక్కల పెంపకం, కందకాల తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ మేరకు నిర్దేశించిన పని చేసినందుకు ఒక్కో కూలీకి రూ. 300 వేతనం చెల్లిస్తుంది. కాగా పనుల్లోకి వస్తున్న కూలీల్లో కొందరు జాబ్‌కార్డులు పొందినా, వారు ఇతర వ్యాపకాలను చూసుకుంటూ పనులకు రావడంలేదు. దీంతో ఇలాంటి వారిని ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. దీనికి తోడు గరిష్ఠ వేతనం పొందుతున్నవారి సంఖ్య తక్కువగా ఉంది. ఈ తరహా అక్రమాలను సామాజిక తనిఖీ గ్రామసభల్లో గుర్తించి... ప్రజావేదికలో వెల్లడిస్తున్నారు.
అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అధికారులు దారి తప్పిన సొమ్మును బాధ్యుల నుంచి రికవరీ చేస్తున్నారు. ఇదంతా తనిఖీల్లో బయటపడి



తేనే.. లేకపోతే అక్రమాలు బయటకు రావడం లేదు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీఆర్పీలు ఖాళీలు ఉన్నాయి. దీంతో ఇలాంటి చోట్ల మేట్లతోనే పనులు చేయిస్తున్నారు. ఫలితంగా అక్రమాలకు మరింత ఆస్కారం ఏర్పడుతోంది.
ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను పూర్తిస్థాయిలో అరికట్టడానికి ప్రత్యేక పర్యవేక్షణ విభాగాలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రాష్ట్రస్థాయి, జిల్లా విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో వీరు పనిచేయనున్నారు. వీరు మస్తర్ల నమోదును ఆకస్మికంగా తనిఖీ చేస్తారు. ప్రస్తుతం ఉపాధి హామీ ఏపీఓ మండలంలో ప్రతిరోజూ రెండు గ్రామాలు, ఏపీడీ వారంలో రెండు రోజులు పని ప్రదేశాలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం వారు ఎక్కడకి వెళ్లాలనేది యాప్ ద్వారా ఏరోజుకా రోజు సమాచారం వస్తుంది.
నక్కపల్లి మండలం చందనాడలో ఒకరి పేరిట మరొకరికి మస్తర్లు వేసి ఉపాధి పనిలో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన సామాజిక తనిఖీ సిబ్బంది ప్రజావేదికలో ఈ విషయాన్ని బయటపెట్టారు. బాధ్యుల నుంచి రూ. 80 వేలు రికవరీకి రాశారు. చోడవరంలో గతేడాది నిర్వహించిన సామాజిక తనిఖీ సమావేశంలో మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అనేక చోట్ల మస్తర్ల రికార్డుల్లో దిద్దుబాటులు ఉన్నట్లు గుర్తించారు. పాయకరావుపేట మండలంలో ఇటీవల నిర్వహించిన ప్రజావేదిక సభలో బినామీ మస్తర్లు వేసినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మునగపాక మండలంలోనూ ఇదే తరహాలో అక్రమాలు గుర్తించారు.

**మరింత పర్యవేక్షణ పెరుగుతుంది**

ప్రస్తుతం గ్రామాల్లో బినామీ మస్తర్ల సంఖ్య బాగా తగ్గింది. ప్రతిరోజూ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తారు. గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీల ద్వారా ఏమైనా తేడాలుంటే గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పర్యవేక్షణ విభాగం ద్వారా మరింత పర్యవేక్షణ పెరుగుతుంది. ఆర్.పూర్ణిమాదేవి, డ్వామా పీడీ

# అందుబాటులోకి అటవీ పర్యాటకం

అనకాపల్లి : చింతపల్లి అటవీ డివిజన్‌లో తొలిసారిగా పర్యాటకులను ఆకర్షించేందుకు అటవీశాఖ చేపట్టిన ఎకో టూరిజం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. చింతపల్లి డివిజన్‌గా ఏర్పడిన తరువాత రేంజి పరిధిలోని కృష్ణాపురంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎకో టూరిజం ప్రాజెక్టుకు గత ఏడాది శ్రీకారం చుట్టారు. దీనికోసం రూ.60 లక్షల నిధులు కేటాయించారు. ఈ టూరిజం ప్రాజెక్టులను అటవీశాఖ విశాఖ సర్కిల్ ముఖ్య సంరక్షణాధికారి సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి సెప్టెంబరు 30న లాంఛనంగా ప్రారంభించారు. తాత్కాలికంగా ఈ ప్రాజెక్టును ప్రారంభించినా కొన్ని పనులు పూర్తికాని కారణంగా పర్యాటకులను ఇప్పటివరకూ అనుమతించలేదు. పనులు పూర్తి చేయడంతో శనివారం నుంచి ప్రవేశాలు కల్పించారు. సందర్శకులను ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. తోటల్లో బస చేసేందుకు వీలుగా గుడారాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉదయం వేళల్లో పర్యాటకులు ట్రెక్కింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి పర్యాటకులకు ప్రవేశాలు కల్పించిన సందర్భంగా డీఎఫ్ఓ నర్సింహారావు సూచనల మేరకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది పర్యాటకులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. అటవీ రేంజి అధికారి బి. అప్పారావు, సెక్షన్ అధికారి వెంకట్రావు, ఎఫ్‌బీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.
పర్యాటకుల కోసం పైనస్ తోటల్లోనే ఫొటోషూట్‌తోపాటు అర్చరీ, ఊయలలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచారు. పైన్ వృక్షాల వద్ద ఉదయం పూట దట్టంగా మంచు అలుముకుంటోంది. ఇది చూపరులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఈ తోటల్లోనే పర్యాటకులు రాత్రి బస చేసేందుకు వీలుగా తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేశారు.

**గిరిజనులకు ఉపాధి**

చింతపల్లి డివిజన్ కేంద్రంగా ఏర్పడిన తరువాత మొట్టమొదటిసారిగా కృష్ణాపురం తోటల్లో ఎకో టూరిజం ప్రాజెక్టును అమలు చేశాం. కేవలం ఏడాది కాలంలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేయగలిగాం. దశలవారీగా లంబసింగి ఘాట్‌రోడ్డులోని బోడకొండమ్మ, దారాలమ్మ ఆలయాలతోపాటు లంబసింగి, చెరువులవేనం, ఎర్రవరం జలపాతాల వద్ద ఈ ప్రాజెక్టులు అమలు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధంపై పర్యాటకులకు అవగాహన కల్పిస్తాం. స్థానికంగా ఉన్న గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా అటవీ శాఖ ద్వారా పర్యాటక ప్రాజెక్టులను అమలు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. నర్సింహరావు, డివిజనల్ అటవీ అధికారి చింతపల్లి

# కాసులే పరమావధి

పుత్తూరు : పుత్తూరు పట్టణంలో ఇటీవల పలు హొటళ్లలో పురపాలక అధికారుల బృందం తనిఖీ చేసి నివ్వెరపోయింది. ఏఒక్క హొటల్‌లోనూ తాజా చికెన్, మటన్, చేపలు లేవు. 15 రోజుల కిందట కొనుగోలు చేసిన వాటికి రంగులద్ది దాచి వండి వడ్డిస్తున్నారు. దీంతో పలు హొటళ్లకు జరిమానా విధించినా నేటికీ మార్పులేదు. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన తినుబండారాల ప్యాకెట్ రూ.5కు విక్రయిస్తుండగా, ఆ కంపెనీలు కేవలం 0.90 పైసలు మార్జిన్ ఇస్తున్నాయి. అదే కంపెనీ పేరును అటుఇటూ కొద్దిగా మార్చి ప్యాకెట్‌కు ఇంకొన్ని కంపెనీలు రూ.2 నుంచి రూ.2.50 వరకు మార్జిన్ ఇస్తున్నాయి. అసలును పోలిన ప్యాకెట్లను చిల్లర దుకాణాల్లో విక్రయించేందుకు వ్యాపారులు ఎక్కువ ఇష్టత చూపుతున్నారు. పుత్తూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు, తిరుపతి వంటి పట్టణాల్లో ఏమాత్రం నాణ్యత లేని నకిలీలు భారీఎత్తున తయారవుతున్నా అధికార యంత్రాంగానికి చీమకుట్టినట్లైనా లేదు. ప్రజల అమాయకత్వాన్ని కొందరు కాసులుగా మలచుకుంటున్నారు. కాలం చెల్లిన వాటిని బయట పడేయాల్సి ఉండగా కొందరు బాహాటంగా విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రంగురంగుల బొమ్మలతో ఆకట్టుకునేలా నకిలీలు తయారుచేసి ఇబ్బడిముబ్బడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చేరవేస్తున్నారు.. ఫలితంగా ప్రజారోగ్యం ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం గాల్లో దీపంలా మారింది.. వీటిని తిని పిల్లలు తరచూ వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, జ్వరం, అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు అధికంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచే ఈ నకిలీ ప్యాకెట్లు వస్తున్నాయి.



పలు కంపెనీలకు చెందిన తినుబండారాలు అటుఇటూ అక్షరాల తేడాతో విక్రయిస్తున్నారు. వాటిని నిశితంగా పరిశీలిస్తే తప్ప పోల్చడం కష్టమే. ఇదే సమయంలో కాలం చెల్లినవీ అమ్మేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో హొల్‌సేల్ వ్యాపారులు వందల్లో ఉంటే రిటైల్ వ్యాపారులు వేలల్లో ఉన్నారు. పిల్లల బలహీనతలను వీరు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన పట్టణాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. మరోవైపు పాఠశాలలకు 200 మీటర్ల లోగా.. ఈ తరహా ప్యాకెట్లు అమ్మేందుకు నిషేధం అమల్లో ఉన్నా అధికార యంత్రాంగ మొద్దునిద్ర వల్ల జిల్లాలో ఎక్కడా అమలు కావడంలేదు.

**పిల్లల ఆరోగ్యంపై ప్రభావం..**

నేడు పిల్లల స్నాక్స్ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దుకాణాల్లో దొరికే తినుబండారాలు కొనిస్తుండటంతో పిల్లల ఆరోగ్యంపై అది ప్రభావం చూపుతోంది. ఆహార నిల్వకు ఉపయోగించే రసాయనాలతో తయారుచేసే జంక్ ఫుడ్ తినేందుకు రుచిగా ఉన్నా.. క్రమంగా పిల్లల్లో రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తుంది. వారిలో ఆకలి మందగించడం, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరమని తరచూ పిల్లలు చెబుతున్నారు. తల్లిదండ్రులు గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు, పుత్తూరు

**తరచూ తనిఖీలు నిర్వహిస్తాం..**

పట్టణాల్లో తరచూ తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. ఏదైనా తేడా అనిపించినా శాంపిల్స్ తీసి ల్యాబ్‌లకు పంపుతున్నాం. ప్రజలు సైతం హొటల్స్, దుకాణాలకు వెళ్లిన సమయంలో వాటిపై ఉన్న తేదీలు ఒకసారి పరిశీలిస్తే వాటి గురించి తెలుస్తుంది. జగదీష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పుత్తూరు

# అస్తవ్యస్తంగా ఆర్టీసీ

తిరుపతి : తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు, జిల్లాలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించే పర్యాటకులకు రవాణా సేవలు అందించడంలో ఆర్టీసీ కీలకం వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రజా సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా, జిల్లా స్థాయి అధికారులు లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా ప్రజా రవాణాధికారి(డీపీటీవో)గా ఉన్న చెంగల్‌రెడ్డి పదోన్నతిపై ఈడీగా విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. నవంబరు నెలాఖరులో జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(సీటీఎం) భాస్కర్ ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ప్రయాణికుల సౌకర్యాల కల్పన, భద్రతా ప్రమాణాలపై సమీక్షలు, ఉద్యోగులు సమస్యలు పరిష్కరించేందుకు ఆ స్థాయి అధికారులు లేకపోవడంపై పలువురిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**ఇన్‌ఛార్జులతో సర్దుబాటు**

ఆర్టీసీలో జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలోనూ, ఆదాయం సమకూర్చడంలోనూ మూడు, నాలుగు స్థానాలతో ప్రశంసలు అందుకుంటోంది. ఇందుకు తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుచానూరు వంటి ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక కేంద్రాలు నెలవై ఉండటమే కారణం. తద్వారా ఆర్టీసీకు రోజుకు సుమారు రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. రోజువారీ సమీక్షలు, జిల్లా పరిధిలోని డిపో మేనేజర్లతో సమన్వయం వంటి చర్యలతోనే ఇంతటి ఆదాయం, ప్రయాణికులకు సేవలు మెరుగుపరచడం సాధ్యమవుతుంది. కానీ జిల్లాకు డీపీటీవో, సీటీఎం లేకపోవడం విచారకరం. ఖాళీగా ఉన్న డీపీటీవో స్థానంలో చిత్తూరు డీపీటీవో జగదీష్‌ను ఇన్‌ఛార్జిగా నియమించి సర్దుబాటు చేశారు. 11 డిపోలు కలిగిన జిల్లాకు ఇన్‌ఛార్జిని నియమించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా ఉన్న రాజవర్ధన్ రెడ్డి రెండు నెలల కిందట విరమణ పొందగా, ఆ డిపో ఇన్‌ఛార్జిగా తిరుపతి డిపో మేనేజర్ బాలాజీని నియమించారు.

**సమస్యలు పరిష్కారానికి నోచుకోక** ఆర్టీసీలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రతివారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో అర్జీలు సమర్పిస్తుంటారు. ఆ అర్జీలు పేరుకుపోయి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారి పాల్గొని సత్వరమే పరిష్కరించాల్సి ఉండగా, ఆ స్థాయి అధికారి లేకపోవడం శోచనీయం. జిల్లాలో డిపోలు: 11 మొత్తం ఉద్యోగులు: 4,322 ఆర్టీసీ సొంత బస్సులు: 736 అద్దెవి: 180 రోజూ ప్రయాణిస్తున్న వారి సంఖ్య: 1.20 లక్షలు

# చౌక బియ్యం నొక్కేస్తున్నారు..



గుత్తి : ప్రభుత్వ చౌకధాన్య డిపోలకు బియ్యం సరఫరా చేసే స్టాక్‌పాయింట్లలో అక్రమాలు సాగుతున్నాయి. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. స్టాక్‌పాయింట్ నిర్వహణ అధికారులు తక్కువ తూకాలతో డీలర్లకు బియ్యం సరఫరా చేస్తున్నారు. గుత్తి, తాడిపత్రి, రాయలచెరువు మండలస్థాయి స్టాక్‌పాయింట్లలో కొన్నేళ్లుగా అక్రమాలు పాగా వేశాయి. ఎంఎల్ఎస్ పాయింట్లకు పోస్టింగ్‌లకు రూ.లక్షల్లో మామూళ్లు ముట్టచెప్పుకోవాల్సి ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మిగులు బియ్యంను నల్లబజార్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మార్గంలో తమకు వచ్చే సొమ్ముతో అందరినీ సంతృప్తి పరచాల్సి ఉంది. స్టాక్‌పాయంట్లకు సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం తరలిస్తున్నారు. గుత్తి, తాడిపత్రి జైళ్లకు కూడా బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా స్టాకిస్టులు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. యాడికి మండలంలోని రాయలచెరువు స్టాక్‌పాయింట్ నుంచి ప్రతినెలా యాడికి, పెద్దవడుగూరు మండలంలోని కొన్ని గ్రామాల స్టోర్లకు బియ్యం సరఫరా చేస్తున్నారు. తాడిపత్రి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లోని స్టోర్లకు సరఫరా అవుతోంది. గుత్తి స్టాక్‌పాయింట్ నుంచి పెద్దవడుగూరు, పామిడి, గుత్తి, గార్లదిన్నె, గుంతకల్లు, పుట్లూరు మండలాలలోని స్టోర్లకు సరకు సరఫరా చేస్తున్నారు.

**టేర్‌వెయిట్ ఏదీ?..** డీలర్లకు సరఫరా చేసే బియ్యం బస్తాలకు టేర్‌వెయిట్ ఇవ్వాల్సి ఉంది. 50 కేజీల ప్యాకెట్ బియ్యంకు స్టాకిస్టులు 600 గ్రాములు అదనంగా ఇవ్వాల్సి ఉంది. గోన సంచుల తూకానికి సమానంగా బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఎవరూ ఇవ్వడం లేదు. డీలర్లకు 50 కేజీల ప్యాకెట్లు ఇస్తున్నారు. అవికూడా తూకం సరిగా ఉండటం లేదు. 50 కేజీలు అని ఇచ్చే బియ్యం సంచిలో కేవలం 48 కేజీలు మాత్రమే ఉంటున్నాయి. తూకాల్లో అక్రమాలు సాగుతున్నాయి. టేర్‌తూకాలు ఇవ్వడం లేదు. అలాగే కచ్చితమైన తూకాలు చేయడం లేదు. 6 నెలల కిందట తాడిపత్రి స్టాక్‌పాయింట్‌లో రూ.కోట్లలో అక్రమాలు సాగాయి. వైకాపా నాయకులు బియ్యం రవాణా గుత్తేదారులుగా ఉండి లబ్ధిదారులకు చేర్చాల్సిన బియ్యంను బహిరంగ మార్కెట్‌కు తరలించి విక్రమించుకున్నారు. సుమారు రూ.2 కోట్లు విలువైన బియ్యం స్వాహా చేశారు. గుత్తిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో కూడా గతంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలో స్టాకు నిల్వల్లో తేడాలు వచ్చాయి. ప్రస్తుతం సరకు రవాణాకు ఇక్కడ గుత్తేదారులు లేరు. అధికారులే గుత్తేదారులుగా వ్యవహరిస్తున్నారు.

ఆరోపణలపై గుత్తి స్టాకిస్టు నారాయణస్వామిని వివరణ కోరేందుకు చరవాణిలో ప్రయత్నించగా తాను బిజీగా ఉన్నట్లు తెలిపారు. పూజలో ఉన్నానని ఫోన్ కట్ చేశారు.

# నీటి బొట్టు.. ఒడిసి పట్టు




ఉరవకొండ : ఉరవకొండ మండలం లత్తవరం గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి ముందు వ్యక్తిగత ఇంకుడు గుంత తవ్వుకున్నారు. ఇంట్లో వాడుక నీటిని అందులోకి వదిలేలా ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య అధికంగా ఉంది. స్థానిక తెదేపా నాయకుల ప్రోత్సాహంతో మొత్తం 70 కుటుంబాలు వ్యక్తిగత ఇంకుడు గుంతలు తవ్వుకున్నాయి. మరింత మంది గుంతలు తవ్వుకోవడానికి ముందుకు వస్తున్నారు. మండలంలో మిగతా గ్రామాల కంటే ఇక్కడ ఎక్కువ మంది ఇంకుడు గుంతలు తవ్వుకుంటుండటం విశేషం. ఉరవకొండ మండలం లత్తవరం తండా ప్రాథమిక పాఠశాల ఆవరణలో రూఫ్ వాటర్ హార్‌వెస్టింగ్ స్ట్రక్చర్ కింద ఇంకుడు గుంత తవ్వించారు. వర్షాకాలంలో పాఠశాల భవనాలపై నుంచి జారిపడే నీటిని ఒడిసి పట్టేలా దాన్ని తవ్వించారు. ఈ గ్రామంలో సుమారు 50 కుటుంబాలు వ్యక్తిగత ఇంకుడు గుంతలు తవ్వుకుంటున్నారు.

ఇళ్లలోని వాడుక నీరు గ్రామాల్లో రోడ్లపై పారుతూ తీవ్ర అపరిశుభ్రత నెలకొంటోంది. ఈ సమస్యను తీర్చడానికి ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా వ్యక్తిగత ఇంకుడు గుంతల తవ్వకానికి ప్రాధాన్యం ఇస్తోంది. ఉపాధి పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం జిల్లాకు 31 వేల వ్యక్తిగత ఇంకుడు గుంతలు మంజూరు చేసింది. అందులో మండలానికి వెయ్యి చొప్పున కేటాయించారు. ఒక్కో గుంతకు రూ.6 వేలు మంజూరు చేస్తున్నారు. వీటితోపాటు వర్షం కురిసే సమయంలో ప్రభుత్వ భవనాల పైకప్పు నుంచి జారి పడే నీటిని ఒడిసి పట్టడానికి రూఫ్ హార్‌వెస్టింగ్ స్ట్రక్చర్ పేరుతో పెద్ద ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయి. వాటిని మండల పరిషత్తు కార్యాలయాలు, పాఠశాలల సముదాయాల్లో తవ్వడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు ఒక చోట నిల్వ చేయడానికి కమ్యూనిటీ ఇంకుడు గుంతల తవ్వకాన్ని చేపట్టింది. ఈ విభాగాల్లో ఒక్కో గుంతకు కొలతలు బట్టి రూ.60వేల నుంచి రూ.80వేలు కేటాయించింది.

**మార్చి నాటికి పూర్తి చేస్తాం**

జిల్లాకు కేటాయించిన ఇంకుడు గుంతల తవ్వకాలను మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను ఉపాధి అధికార యంత్రాంగం ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించి, ప్రజలు ముందుకు వచ్చేలా చైతన్యం చేస్తున్నాం. సలీంబాషా, డ్వామా పీడీ

# రూ.కోట్ల వ్యయం.. లక్ష్యం శూన్యం



వాకాడు : మండలంలోని కల్లూరు, కొండాపురం, రావిగుంటపాలెం, బాలిరెడ్డిపాలెం గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాములు మంజూరు చేశారు. 500 టన్నుల సామర్థ్యంతో నిర్మాణానికి రూ.42 లక్షల నిధులు కేటాయించారు. ఆన్‌లైన్ టెండర్ల ద్వారా గుత్తేదార్లకు గతేడాది పనులు అప్పగించారు. కల్లూరు, కొండాపురం, రావిగుంటపాలెం గ్రామాల్లో నిర్మాణాలు కొంత మేర చేపట్టినా బిల్లులు రాక పనులు నిలిపివేశారు.

జిల్లాలో రూ.17.60 కోట్లతో మొదటి విడతలో 30, రెండో విడతలో 12 గోదాములు మంజూరు చేయగా వాటిలో 25 పూర్తి చేశారు. మిగిలినవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. శ్రీకాళహస్తి, వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం, దక్కిలి, చిల్లకూరు, చిట్టమూరు మండలాల్లో ఐదు గోదాములకు స్థల సమస్య తలెత్తడంతో పనులు మొదలు పెట్టలేదు. పంట దిగుబడులకు రక్షణ లేకుండా పోతోంది. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. వైకాపా ప్రభుత్వ హయాంలో బహుళ ప్రయోజక సౌకర్య కేంద్రాలను (గోదాములు) జిల్లాలో పలుచోట్ల మంజూరు చేశారు. పనులు చేపట్టిన గుత్తేదారుకు బిల్లులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా రైతులు ఆరుబయట ఉంచుకోలేక వచ్చినంత ధరకు విక్రయిస్తుండగా మరికొందరు ప్రైవేటు గోదాముల్లో అధిక అద్దె చెల్లిస్తూ ఇబ్బంది పడుతున్నారు.

**ఒక్కో గోదాంకు రూ.42 లక్షలు**

గోదాముల నిర్మాణాలకు అప్కాబ్ 90 శాతం రుణం ఇవ్వగా రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 10 శాతం నిధులు వెచ్చించారు. ఒక్కో గోదాం నిర్మాణానికి రూ.42 లక్షల నుంచి రూ.44లక్షల వరకు వెచ్చించారు. అయితే గోదాముల నిర్మాణాలకు స్థలాల ఎంపిక సక్రమంగా సాగలేదు. పలుచోట్ల రహదారి కూడా లేని స్థలాలు ఎంపిక చేశారు.

**రైతుల అవస్థలిలా..**


ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా మూడు మండలాలకు రెండు గోదాములు నిర్మించారు. మూడు మండలాలకు సరిపోకపోవడంతో కొందరు రైతులు ధాన్యంను కోసిన వెంటనే తక్కువ ధరకు అమ్ముతున్నారు. మరి కొందరు రోడ్లపై పొలాల్లో ఆరబెట్టి అక్కడే నిల్వ చేస్తున్నారు. మార్కెట్ కమిటీ గోదాముల్లో పెద్ద రైతులకు మినహా సన్నచిన్నకారు రైతులకు నిల్వ చేసుకునేందుకు వీలు ఉండటం లేదు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ శాఖ ఈఈ హరినారా యణరెడ్డిని సంప్రదించగా..

వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు దక్కించుకున్న గుత్తేదారులతోనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

# ఊరికి.. ఉరి

సత్యవేడు : ఇల్లు నేలకూలింది. నమ్ముకున్న ఊరు మాయమైంది. అభంశుభం తెలియని గిరిజన ప్రజలు వైకాపా నేతల దాష్టీకానికి బలయ్యారు. అధికారం అండతో పరిహారంతో పరిహాసాలు ఆడుకుని ఏకంగా ఓ గిరిజన కాలనీనే మింగేసిన ఘటన ఇది. కాలనీ కింద బంగారంలాంటి రాతిని దక్కించుకునేందుకు కుట్రపన్నారు. అమాయక ప్రజలపై ఒత్తిడి తెచ్చి భూములు లాగేసుకున్నారు. ఉన్నఫళంగా ఇళ్లను ఖాళీ చేయించడంతో చెట్టుకొకరు పుట్టకొకరు చేరగా చివరకు కాలనీ క్వారీగా మారిపోయింది.

సత్యవేడు మండలం పీవీపురం పంచాయతీ పరిధిలోని గిరిజన కాలనీలో 18 కుటుంబాలు నివసించేవి. కాలనీకి పంచాయతీ నిధులతో సీసీరోడ్డు వేశారు. గ్రావెల్ రోడ్డు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో ఎనిమిది పక్కా గృహాలు నిర్మించారు. కాలనీ కింద ఉన్న కంకర రాళ్లపై కన్నుపడిన వైకాపా నాయకులు క్వారీ ఏర్పాటు చేసి రూ.కోట్లు కొల్లగొట్టడానికి పక్కాప్రణాళిక సిద్ధం చేశారు. నయానా భయానా గిరిజనులను ఖాళీ చేయించారు. ఒక్కో ఇంటికి రూ.50 వేలు, సాగు



భూమికి ఎకరాకు రూ.లక్ష ఇస్తామని బలవంతంగా డబ్బు చేతిలో పెట్టారు. రెండు రోజులకే ఖాళీ చేయించి జేసీబీలతో ఇళ్లను కూల్చివేశారు. గిరిజనకాలనీ, పరిసర డీకేటీ భూములను రెవెన్యూ అధికారులు పక్క మండలానికి చెందిన వైకాపా నేత పేరిట బదలాయించారు. నాలుగు కుటుంబాలు పక్కనే ఉన్న ఓబుళరాజు కండ్రిగ పంచాయతీ ఆనందపురం గిరిజనకాలనీకి, మరికొందరు సమీపంలోనే చమర్తికండ్రిగ వద్దకు వెళ్లిపోయారు. మరో పది కుటుంబాలు ఎటు వెళ్లాయో తెలియదు. దీనిపై తహసీల్దారు టీవీ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా ఇటీవల గ్రామస్థులు ఫిర్యాదు చేశారని, రెవెన్యూ సదస్సులో ఉన్నందును పరిశీలించలేకపోయామని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

**బెదిరింపులతో మోసపోయాం**

అధికార పార్టీ నాయకులు కావడంతో వారిని ఎదిరించలేకపోయాం. మాకు ఎవరూ అండగా నిలవకపోవడంతో తలవంచక తప్పలేదు. మాకు ఆలోచించుకునే సమయం అడిగినా ఇవ్వలేదు. రెండు రోజులకే మా ఇళ్లు కూల్చివేశారు. గత్యంతరం లేక కాలనీని వదిలిపోవాల్సి వచ్చింది. అందరికీ డబ్బు ఆశ చూపారు. వారిచ్చిన రూ.50 వేలు కనీసం పూరిపాక వేసుకోవడానికే చాల్లేదు. వారికి తలవంచి మోసపోయాం. వెంకట్రామయ్య, గిరిజనకాలనీ పెద్ద

# ప్రాజెక్టు కమిటీ లేక.. 15 ఏళ్లు

గూడూరు : స్వర్ణముఖి బ్యారేజీకి 15 ఏళ్లుగా ప్రాజెక్టు కమిటీ ఏర్పాటుకాకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాకాడులో రూ.50 కోట్ల వ్యయంతో 2008లో దీనిని ప్రారంభించారు. గూడూరు డివిజన్‌లోని గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఇదే ఏకైక పెద్ద ప్రాజెక్టు. 2009లోనే కమిటీ ఏర్పాటుకు అప్పట్లో ప్రతిపాదనలు పంపినా 2009, 2015 తోపాటు తాజాగా జరిగిన సంఘాల ఎన్నికల్లోనూ కమిటీ ఏర్పాటుకు అనుమతి లభించలేదు. బ్యారేజీ పరిధిలో మొత్తం 10 చెరువులు ఉన్నాయి. 9,500 ఎకరాల ఆయకట్టు ఉంది. పది చెరువుల అధ్యక్షులు కలిపి బ్యారేజీ ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతో పాటుగా ఆరుగురు సభ్యులు ఉంటారు. వీరు బ్యారేజీ పరిధిలో ఏటా నిర్వహణ చేయించడం.. ఆయకట్టు పొలాలకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవడం.. వంటి పనులు చేపడతారు.

**కుదరని సమన్వయం**

బ్యారేజీ పరిధిలో పది చెరువులకు సాగునీరు కావాలంటే తూపిలి, కల్లూరు చెరువులు నిండి తర్వాత కాలువల ద్వారా మిగతా చెరువులకు చేరాలి. ఆయా చెరువులకు ప్రత్యేక కాలువలు లేక ఏటా రైతుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. దుగరాజపట్నం, తిరుమూరు, కోడివాక చెరువులకు కల్లూరు చెరువు ద్వారా నీరు చేరాలి. దాంతో సమస్యలు అధికమవుతున్నాయి. వీటన్నింటిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు అన్ని చెరువుల నుంచి రైతులు కలిసి రావడం లేదు. అదే కమిటీ ఉంటే సమస్య పరిష్కరించుకోవచ్చని రైతులు అంటున్నారు. ఈ విషయమై బ్యారేజీ డీఈ ఆనందబాబును వివరణ కోరగా త్వరలో వాకాడు బ్యారేజీకి కమిటీ ఏర్పాటు కానుందని, అందుకు సంబంధించి కదలికలు వచ్చాయన్నారు.

**పాలకవర్గం అవసరం..**

రూ.50 కోట్లు పెట్టి బ్యారేజీని నిర్మించారు. 15 ఏళ్లుగా ఎలాంటి నిర్వహణకు నోచుకోలేదు. గేట్లు, రోప్‌లు, మోటార్లు తుప్పు పడుతున్నాయి. వరదల సమయంలో బ్యారేజీ కాలువలకు గండ్లు పడుతున్నాయి. అందరినీ సమన్వయం చేసుకునేందుకు బ్యారేజీకి ఓ కమిటీ ఉంటే ఆ పాలకవర్గం నిర్వహణ బాధ్యతలు తీసుకుంటుంది. ద్వారకానాథ్‌రెడ్డి, తూపిలి చెరువు ఆయకట్టు మాజీ అధ్యక్షుడు

# కలప అమ్ముకుని.. అక్రమార్జనకు పాదులు తీసి

పలమనేరు : ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా అటవీశాఖ పరిధిలో వెలుగు చూసిన అవినీతి లోతు అంతకంతకూ పెరుగుతోంది. చెట్లను కత్తిరించిన వ్యవహారంలో భారీగా సొమ్ములు స్వాహా చేసిన ఘటనపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేస్తోంది. వృక్షాలు అమ్ముకోవడం ద్వారా ఇప్పటికే రూ.27 లక్షలు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి ప్రస్తుతం వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లగా వేళ్లన్నీ సదరు అధికారిపైనే చూపుతున్నాయి. దర్యాప్తు అధికారులు పట్టణంలోని వైట్‌సైడ్ గార్డెన్‌లోని కలప నిల్వలను ఇటీవల పరిశీలించారు. దారి నిర్మాణంలో ఎన్ని వృక్షాలు తొలగించారు నిల్వలు ఎన్ని ఉన్నాయనే వివరాలు పరిశీలించారు. కాగా ఇక్కడ నిల్వ చేసిన కలప పూర్తిగా పాడవుతోంది. **మరికొన్నింటిలోనూ..** సామాజిక అటవీ వనాల చెట్లకు పాదులు తీసే విషయంలోనూ బిల్లుల స్వాహా జరిగిందనే విషయాన్ని అధికారులు గుర్తించారు. పాదులు తీయకనే రూ.4 లక్షల వరకు స్వాహా అయినట్లు తెలుస్తోంది. గంగవరం మండల పరిధిలోని అడవిలో ఎర్రచందనం మొక్కలు, నాటిన ప్రదేశంలో వాటికి పాదులు తీసినట్లు తప్పుడు లెక్కలు చూపించినట్లు ఆరోపణలున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణలో తొలగించిన వృక్షాలకు సంబంధిత హైవే విభాగం పరిహారం చెల్లించగా సదరు అధికారి దానిని స్వాహా చేస్తూ వృక్షాలను ఎక్స్‌ట్రాక్షన్ పేరిట అటవీశాఖ కత్తిరించినట్లు రికార్డులు సృష్టించారు. దీంతో మరో రూ.17 లక్షల బిల్లులు సృష్టించి మొత్తాన్ని డ్రా చేశారు. ఈ మొత్తం కూడా ఏమైందనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది.

చురకలు



## గోల్డెన్ డిలైట్‌లో అషు రెడ్డి మెరుపులు

సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడూ కొత్త లుక్‌లతో మెరిసిపోతున్న అషు రెడ్డి తన అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో గ్లామర్ పిక్స్ షేర్ చేయడంలో ముందుండే అషు, ఇప్పుడు తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. "గోల్డెన్ డిలైట్" క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలో ఆమె వేసిన అద్భుతమైన గోల్డెన్ ప్రింటెడ్ బాడీ ఫిట్ డ్రెస్, దీనికి జతగా ధరించిన స్టైలిష్ డెనిమ్ జాకెట్ ఆమెకు మరింత గ్లామర్ ని తీసుకువచ్చింది. ఆమె వైభవంగా మెరిసే హావభావాలు, ఆడిట్యూడ్ నెటిజన్ల మనసులను బాగా ఆకట్టుకున్నాయి. అషు రెడ్డి గతంలో జూనియర్ సమంతగా గుర్తింపు తెచ్చుకుని, తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకుంది. అయితే, ఇటీవల ఆమె ఈ ఇమేజ్‌కు దూరంగా వెళ్లి తనకంటూ ప్రత్యేకమైన స్టైల్ స్టేట్మెంట్‌ను క్రియేట్ చేసుకుంటోంది. ఈ ట్రాన్సిషన్‌లో ఆమె లుక్, ప్రెజెన్స్ మరింత



ఇంప్రెసివ్‌గా మారాయి. "హ్యాపీ సోల్స్ ఆర్ ద ప్రెట్టియెస్ట్" అనే క్యాప్షన్ కూడా ఆమె కాన్ఫిడెన్స్‌ను ప్రతిబింబిస్తోంది. ఫిట్‌నెస్ మీద దృష్టి పెట్టిన తర్వాత ఆమె గ్లామర్ లుక్ మరింత అందంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ తాజా ఫోటోలు అభిమానులకు మాత్రమే కాకుండా, నెటిజన్లకు కూడా ఫుల్ టాక్ ఆఫ్ ద టౌన్ అయ్యాయి. అషు రెడ్డి ధరించిన గోల్డెన్ ప్రింటెడ్ డ్రస్ ఆమె అందాన్ని హైలైట్ చేస్తూ ప్రత్యేకమైన లుక్ ఇస్తోంది. ఆమె తన లుక్‌తోనే కాకుండా ఫోటోకి ఇచ్చిన క్యాప్షన్‌తో కూడా ప్రత్యేకమైన మెసేజ్‌ని అందించింది. నేనే ఒక స్టైల్ అంటూ గతంలో చెప్పినట్లు, ఈ లుక్ ఆమె వ్యక్తిత్వానికి, ఆత్మవిశ్వాసానికి తార్కాణంగా నిలిచింది. అషు రెడ్డి సోషల్ మీడియాలో తన ఫాలోవర్స్‌ను కేవలం గ్లామర్ షోతోనే కాదు, కాన్ఫిడెంట్ లుక్‌లు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ద్వారా కూడా అట్రాక్ట్ చేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె వేసుకున్న డ్రస్ ఫ్యాషన్‌కి హై గ్లామర్ టచ్‌తో మోడ్రన్ ట్రెండ్‌ని మిళితం చేసినట్లు కనిపిస్తోంది. ఇలాంటి యూనిక్ లుక్‌లు ఆమెను సోషల్ మీడియాలో మరింత ప్రత్యేకంగా నిలిపాయి.

## మోస్ట్ అవైటెడ్ సినిమాలు.. రష్మిక డామినేషన్..!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'యానిమల్', 'పుష్ప 2: ది రూల్' వంటి పాన్ ఇండియా విజయాలతో మోస్ట్ డిమాండబుల్ హీరో యిన్ గా మారిపోయింది. తన క్రేజ్ ను క్యాష్ చేసుకుంటూ, ఆచితూచి ప్రాజెక్ట్స్ ఎంపిక చేసుకుంటూ వస్తోంది. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో, వరుస షూటింగులతో అమ్మడు తీరిక లేకుండా గడుపుతోంది. ఈ ఏడాదిలో పలు క్రేజీ చిత్రాలతో ప్రేక్షకులను పలకరించబోతున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు IMDB లోనూ రికార్డ్ క్రియేట్ చేసింది. 2025లో సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల జాబితాను 'ఇంటర్నెట్ మూవీ డేటాబేస్' సంస్థ తాజాగా విడుదల చేసింది. అందులో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటించిన 'సికందర్', 'ఛావా', 'థమా' వంటి సినిమాలు ఉండటం విశేషం. టాప్-20 మోస్ట్ అవైటెడ్ మూవీస్ లిస్టులో ఆమె నటించిన మూడు సినిమాలకు చోటు దక్కడంతో, అభిమానులు రష్మికను 'ఫీమేల్ స్టార్ ఆఫ్ ది



ఇయర్'గా పేర్కొంటున్నారు. IMDB లిస్ట్ లో అందరూ ఎదురు చూస్తున్న సినిమాగా 'సికందర్' టాప్ ప్లేస్ లో నిలిచింది. ఏఆర్ మురగదాస్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామాలో సల్మాన్ ఖాన్, రష్మిక జంటగా నటించారు. నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈద్ స్పెషల్ గా మార్చి నెలాఖరున ఈ సినిమా విడుదల కానుంది. ఇటీవలే ఈ మూవీ టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. విక్కీ కౌశల్, రష్మిక మందన్నా కలిసి నటించిన హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'ఛావా' ఈ జాబితాలో 10వ స్థానంలో ఉంది. ఛత్రపతి శివాజీ కుమారుడు, మరాఠా యోధుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో శంభాజీ భార్య ఏసుబాయి పాత్రలో రష్మిక కనిపించనుంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే రిలీజైన ఈ మూవీ టీజర్ ఆకట్టుకుంది. ట్రైలర్ రాబోతోంది. ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటిస్తున్న హారర్-కామెడీ మూవీ 'థమా' అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూవీస్ లిస్టులో 17వ ప్లేస్ లో ఉంది. 'ముంజ్యా', 'స్త్రీ 2' క్రియేటర్స్, మాడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ ఫ్రాంచైజ్ లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.




## తండేల్.. పాన్ ఇండియా టార్గెట్



నిజ జీవిత ఘటనలతో సినిమాలను తెరకెక్కిస్తే ప్రజల్లో బోలెడంత క్యూరియాసిటీ నెలకొంటుంది. అలాంటి ఒక నిజకథతో నాగచైతన్య కథానాయకుడిగా చందు మొండేటి రూపొందిస్తున్న తండేల్ చాలా కాలంగా చర్చల్లో ఉంది. ఈ సినిమా దాయాది దేశం పాకిస్తాన్ జైలులో మగ్గిన భారతీయ మత్స్యకారుని కథ. అక్కినేని నాగ చైతన్య-సాయి పల్లవి జంటగా నటించిన ఈ చిత్రాన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించారు. ఇది పీరియాడికల్ లవ్ యాక్షన్ డ్రామా కథాంశంతో తెరకెక్కింది. ఎమోషన్ పీక్స్ లో వర్కవుట్ చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం ఫిబ్రవరి 7న గ్రాండ్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. తాజా సమాచారం మేరకు.. తండేల్ ని పాన్ ఇండియాలో ఒకేసారి రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మలయాళ వెర్షన్ ను తెలుగు, తమిళ, హిందీ వెర్షన్లతో పాటు ఒకేసారి విడుదల చేస్తారని సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. తండేల్ ట్రైలర్ కోసం అక్కినేని ఫ్యాన్స్ ఎంతో ఎగ్జయిటింగ్ గా వేచి చూస్తున్నారు. జనవరి 26న ట్రైలర్ ని విడుదల చేస్తారని కూడా టాక్ వినిపిస్తోంది. పెండింగ్ చిత్రీకరణను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. నెలాఖరు నుంచి ప్రమోషన్లను ప్రారంభించడానికి తండేల్ బృందం ప్రిపరేషన్ లో ఉందని సమాచారం. హిందీలోను రిలీజ్ చేస్తున్నారు గనుక నాగచైతన్య తన సినిమాని ముంబై సహా పలు ఉత్తరాది నగరాల్లో ప్రమోట్ చేసే వీలుంది. అల్లు అరవింద్ సమర్పణలో బన్ని వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. తండేల్ నేపథ్య సంగీతం ఎమోషనల్ డ్రామాకు తగ్గట్టే, మరో లెవల్లో ఉంటుందని సమాచారం.

## ఫ్రెండ్స్‌ని హింసించిన నటి



కొందరు మాత్రమే ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతారు. అతికొద్ది మంది మాత్రమే సాహసాలకు వెనకడుగు వేయరు. ధైర్యంగా కొండ కోనలు, గుట్టలు దాటుకుని, సరస్సుల్లో ప్రయాణించి, చివరికి లక్ష్యానికి చేరుకునే ధైర్యం చాలా అరుదుగా ఇలాంటి మహిళలకు మాత్రమే ఉంటుంది. కొండ కోనల్లో సాహసాలు చేయడానికి వెళ్లినప్పుడు ఒక్కోసారి తిరిగి ఇంటికి వస్తారో రారో కూడా తెలీదు. ఎన్ని హాలీవుడ్ సినిమాల్లో చూడలేదు ఇలాంటి కథల్ని.. పైగా ఇక్కడ గర్ల్స్ గ్యాంగ్ ని వెంట తీసుకుని మరీ సాహసయాత్రకు వెళ్లింది ఫాతిమా సనా షేక్. ఈ దంగల్ బ్యూటీ నిజానికి మొండి పట్టుదల కలిగిన యువతి. తన స్నేహితురాళ్లను తెల్లవారి 4 ఏఎం కే నిదుర లేపి హైకింగ్ కి లాక్కెళ్లిందట. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ లో ఫాతిమా సనా షేక్ తన సన్నిహితులతో అడ్వెంచర్ ట్రిప్ కి వెళ్లినప్పటి అరుదైన ఫోటోలను షేర్ చేసింది. అడవులు కొండలు కోనలు సరస్సులు దాటుకుంటూ సాగించిన ప్రయాణంలో ఇవి అద్భుతమైన స్టిల్స్. అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఈ ఫోటోలను చూడగానే అలాంటి చోటికి ట్రిప్ వెళ్లే అవకాశం తమకు ఎందుకు రాలేదు? అని చాలామంది నిరాశ చెందుతున్నారు. ఫైండింగ్ ఫ్యానీ, ముంబై డైరీస్, మోడరన్ లవ్ ఇన్ ముంబై చిత్రాలతో పాపులరైన ప్రొడక్షన్ డిజైనర్ మనీషా ఖండేల్వాల్, ది స్కై ఈజ్ పింక్, ఎ ఫ్లై ఆన్ ది వాల్ , అము చిత్రాలతో పాపులరైన ప్రముఖ దర్శకురాలు షోనాలి బోస్, థార్ , ఉలాజ్ చిత్రాలకు ప్రసిద్ధి చెందిన సినిమాటోగ్రాఫర్-కమ్-ఫిల్మ్ మేకర్ శ్రేయ దేవ్ దూబే, మేకప్ ఆర్టిస్ట్ దిశా సోలంకి, కమినీ, ది సౌండ్ ఆఫ్ ముంబై: ఎ మ్యూజికల్ చిత్రాలతో పాపులరైన సినిమాటోగ్రాఫర్ కవిన్ జగ్తియాని ఈ పర్యటనలో ఆమెతో పాటు ఉన్నారు. దంగల్ గర్ల్ ఫాతిమా మాట్లాడుతూ.."నేను శాడిస్టును కాను కానీ, 4 గంటలకు నిద్రలేచి, గంటల తరబడి హైకింగ్ చేసి, నా స్నేహితులను హీట్ స్ట్రోక్‌తో దాదాపు చంపేసాను" అని రాసింది. ఒకరికి చీలమండ బెణికింది.. మరొకరి మోకాలికి గాయం అయింది.. అని కూడా తెలిపింది. వారు పరిమితుల్ని మించి అడ్వెంచర్ చేసారని ఫాతిమా వెల్లడించింది. "మా హైక్ చివరిలో ఆ సరస్సు... ఉఫ్ఫ్! స్వర్గం!" అని కూడా నోట్ లో రాసింది. తమతో పాటు బొచ్చు కుక్కపిల్ల బిజ్లీ కూడా టూర్ కి వచ్చిందని తెలిపింది.

బిజ్లీ మొదటిసారి ఈత కొట్టింది. ఇప్పటివరకు అత్యంత ఎగ్జయిట్ చేసే సంతృప్తికరమైన పుట్టినరోజు ఇది" అని ఫాతిమా తన 33వ పుట్టినరోజు వెకేషన్ ట్రిప్ గురించి తెలిపింది. చాలా మంది సోషల్ మీడియాల్లో ఫాతిమా అడ్వెంచర్ ట్రిప్ ని ప్రశంసించారు. మీ స్నేహితులకు హ్యాట్స్ ఆఫ్! .. మీ ధృఢ సంకల్పానికి అభినందనలు" అని రాసారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే... ఫాతిమా 2025 లో మూడు చిత్రాల్లో నటిస్తోంది. వాటిలో మెట్రో ఇన్ డినో, ఉల్ జలూల్ ఇష్క్, ఆప్ జైసా కోయి చిత్రీకరణలో ఉన్నాయి.

## సర్పకన్య నాగిని నృత్యానికి 2 కోట్ల వ్యూస్

అవును.. ఆకాశం నుంచి దిగి వచ్చిన దేవతా సుందరి ఈ మనోహరి. చూడగానే తళుక్కున వెండిమబ్బులా మెరుస్తోంది. నీలి నింగి అంచుల్ని తాకిన ముగ్ధ మనోహరిని తలపిస్తోంది. ఇంతలోనే సర్పకన్యలా నాగిని నృత్యంతో కట్టి పడేస్తోంది. ఇంతకీ ఎవరీ సుందరి? అంటే.. కచ్చితంగా బాహుబలి మనోహరి నోరాఫతేహి అని చెప్పేయొచ్చు. నోరా ఇటీవల వరుసగా సింగిల్ ఆల్బమ్స్ తో కుర్రకారును కట్టిపడేస్తోంది. ఓవైపు డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా కనిపిస్తూనే దక్షిణాదినా తనవైపు వచ్చే పెద్ద తెర అవకాశాల్ని



అందిపుచ్చుకుంటోంది. ఇటీవల జాసన్ డెరులోతో కలిసి తన కొత్త పాట వీడియో స్నేక్‌ను విడుదల చేసింది. నోరా మంత్రముగ్ధులను చేసే ప్రదర్శన 2 కోట్ల (20 మిలియన్ల) వీక్షణలతో సంచలనం సృష్టించింది. తాజాగా ఈ వీడియో ఆల్బమ్ కోసం ప్రత్యేక ఫోటోషూట్ నుంచి ఎంపిక చేసిన ఫోటోలను షేర్ చేయగా అవి వైరల్ గా మారుతున్నాయి. నోరా వెండి మబ్బులను తలపించే అందమైన డిజైనర్ దుస్తుల్లో మైమరిపించింది. ఈ దుస్తులను ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా రూపొందించారు. లాంగ్ స్కర్ట్, లేత గులాబీ రంగు బ్రాలెట్‌తో నోరా సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. నోరా ఈ పాటలో ఎప్పటిలానే బోల్డ్ మూవ్స్ తో మతులు చెడగొట్టింది.

ప్రస్తుతం ఈ వీడియో, ఫోటోలు ట్రెండింగ్ గా మారుతున్నాయి. కెరీర్ మ్యాటర్‌కి వస్తే .. నోరా నటించిన తాజా కన్నడ చిత్రం కేడీ: ది డెవిల్ రిలీజ్ కోసం అభిమానులు వేచి చూస్తున్నారు. వరుణ్ తేజ్ మట్కాలో సోఫియా అనే పాత్రను నోరా పోషించిన సంగతి తెలిసిందే. నోరా తన అద్భుతమైన నటనను కనబరిచినా మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించినంతగా ఆడలేదు.

## చెమటలు పట్టించిన నెపో కిడ్

సోషల్ మీడియాల్లో చురుగ్గా ఉండేవారికి ఆలయ.ఎఫ్ పరిచయం అవసరం లేదు. నటి పూజా భేడి నటవారసురాలు ఆలయ ఫర్నిచర్ వాలా బాలీవుడ్‌లో ప్రతిభావంతురాలైన నటి. తాను నటించిన తొలి సినిమాతోనే ఈ భామ అందరి దృష్టిని ఆకర్షించింది. జాన్వీకపూర్, ఖుషి కపూర్, అనన్య పాండే లాంటి భామలకు ఆరంభ చిత్రంతో వచ్చిన టాక్ కంటే, ఆలయ నటించిన మొదటి సినిమాకు మంచి పేరొచ్చింది. ప్రారంభ నటిగా ఆలయ ప్రతిభను క్రిటిక్స్ ప్రశంసించారు. అయితే తనకు మొదటి చిత్రం విడుదలైన తర్వాత ఆశించినన్ని అవకాశాలు రాలేదని నిర్మొహమాటంగా చెప్పింది ఆలయ. ఫర్నిచర్ వాలా. అయితే ఆలయ నిరంతరం సోషల్ మీడియాల్లో తన అభిమానులను నిరాశపరచదు. ఇటీవల ఈ భామ పోటీ ప్రపంచంలో ఇతర నెపో కిడ్స్ కి ధీటుగా పోటీపడుతూ వరుస ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా మరో కొత్త ఫోటోషూట్ ని ఆలయ షేర్ చేసింది. బికినీలో ఈ బ్యూటీ అందచందాలు మతులు చెడగొడుతు



న్నాయి. ఆలయ రకరకాల భంగిమల్లో స్టన్నర్‌గా మతులు చెడగొడుతోంది. ప్రస్తుతం అభిమానులు ఈ ఫోటోషూట్ ని వైరల్ గా షేర్ చేస్తున్నారు. బాలీవుడ్ లో బంధుప్రీతి గురించి చాలా చర్చ సాగుతోంది. కానీ ఇతర నెపో కిడ్స్ లాగా, ఆలయ ఎందుకు ప్రజాదరణ పొందలేదో నాకు అర్థం కాలేదు అని ఒక అభిమాని రెడ్డిట్ లో వ్యాఖ్యానించాడు. ఆమె(ఆలయ) నిజానికి వారి కంటే చాలా బాగుంది. ఆమె బాగా నటించగలదు. నేను ఆలయ నటించిన మొదటి సినిమా చూశాను. ఆమె తన మొదటి సినిమాలోనే చాలా మంచి నటనను కనబరిచింది. అనన్య, సారా, జాన్వి కంటే ఆలయ ఎక్కువ అర్హురాలు అని నేను అనుకుంటున్నాను.. అని అన్నారు. ప్రముఖ నటి పూజా బేడి, వ్యాపారవేత్త ఫర్హాన్ ఫర్నిచర్‌వాలా కుమార్తె అయిన అలయ 2020లో సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి జవానీ జానేమాన్-తో బాలీవుడ్‌లో నటిగా రంగ ప్రవేశం చేసింది. తరువాత ఫ్రెడ్డీ, DJ మొహబ్బత్, ఆల్మోస్ట్ ప్యార్, బడే మియాన్ చోటే మియాన్, శ్రీకాంత్ వంటి చిత్రాలలో నటించింది. తదుపరి కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ లో రూపొందనున్న డ్రామా సిరీస్‌లోను నటించనుంది. ఈ సిరీస్‌లో షనాయ కపూర్‌తో కలిసి అలయ నటిస్తుంది. రీతూ దర్శకత్వం వహిస్తారని తెలుస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536